www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
పేజీలు: 16 + 20 వెల: రూ. 6.50
శుక్రవారం | 25-1-2019 | సంపుటి: 59 సంచిక: 280 | విజయవాడ సిటీ
శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి రా. 6.19 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఉత్తర సా. 4.26 తదుపరి హస్త; వర్జ్యం: రా. 12.21-1.52; దుర్ముహూర్తం: ఉ. 9.08-9.52, మ. 12.50-1.35; అమృతఘడియలు: ఉ. 9.48-11.17; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.54; సూర్యాస్తమయం: 6.02
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



పీఎస్ఎల్వీ-సీ44
సక్సెస్
అర్ధరాత్రి నింగిలోకి మైక్రోశాట్
277కి.మీ ఎత్తులో కక్ష్యలోకి
4వ దశలో 450 కి.మీ.లకు
ఇదులోనే కలాంశాట్-వీ2
విద్యార్థుల శోధనలకు ఊతం
6



మాజీ ఉగ్రవాది, అమర జవాన్
లాన్స్ నాయక్ వనీకి
అశోక చక్ర
ఉగ్రవాదులతో పోరులో ప్రాణాలర్పించిన ధైర్యశాలి
6



కొచర్‌పై సీబీఐ కేసు
వీడియోకాన్ అధిపతి
వేణుగోపాల్ ధూత్‌పైనా
ఐసీఐసీఐ బ్యాంకు మాజీ
అధిపతికి మరిన్ని కష్టాలు
11

యూనిఫాం పోస్టులకు
మరో రెండేళ్లు
ఏపీపీఎస్సీ, ఇతర ఏజెన్సీలు
భర్తీ చేసే పోస్టులకు
గరిష్ఠ వయోపరిమితి
పెంచిన ప్రభుత్వం
గ్రూప్-1, 2 దరఖాస్తుల
గడువు పొడిగింపు
2

మోదీకి కష్టమే



లోక్‌సభ ఎన్నికల్లో త్రిశంకు సభే.. సర్వేల్లో వెల్లడి

కేసీఆర్, జగన్, నవీన్ మద్దతిచ్చినా డౌటే: ఇండియా టుడే

ఈ ముగ్గురు కలిసినా బొటాబొటీ మెజారిటీయే: సీ వోటర్

కమలాన్ని నిలువరిస్తున్న యూపీ మహా కూటమి

భారీగా సీట్లు గల్లంతు.. బీజేపీకి పెనుదెబ్బ ఖాయం

మాయ, మమత, మెహబూబా, అఖిలేశ్ మద్దతిస్తే యూపీఏకు మేజిక్ మార్క్ స్థానాలు దక్కొచ్చు

2019 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ మళ్లీ గెలవడం అసాధ్యమే. బీజేపీకి సొంతంగా కాదు కదా.. ఎన్డీయేగా కూడా సాధారణ మెజారిటీ దక్కడం అనుమానమే. ఇవి తాజా సర్వేలు తేల్చి చెప్పిన మాట. సార్వత్రిక ఎన్నికల తర్వాత హంగ్ లోక్‌సభ ఏర్పడుతుందని ఇండియా టుడే-కార్వీ; ఏబీపీ-సీవోటర్ సర్వేలు తేల్చి చెప్పాయి. కేసీఆర్, జగన్, నవీన్ పట్నాయక్, పళనిస్వామి తదితరులు మద్దతు ఇచ్చినా ఎన్డీయే మళ్లీ అధికారం చేపట్టలేదని అంచనా వేశాయి.

న్యూఢిల్లీ, జనవరి 24: మోదీ మళ్లీ అధికారంలోకి రావడం కష్టమే! జగన్, కేసీఆర్, నవీన్ పట్నాయక్ తమ రాష్ట్రాల్లో సాధించిన సీట్లతో మోదీకి జైకొట్టినా ఢిల్లీ గద్దె బీజేపీకి దక్కకపోవచ్చని ఇండియాటుడే మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే వెల్లడించింది. ఎన్డీయే మేజిక్ మార్కును చేరదని అంచనా వేసింది. చివరికి, అన్నాడీఎంకే, స్వతంత్రులంతా మద్దతు ఇచ్చినా మేజిక్ మార్కుకు ఒక్క సీటు దగ్గర ఆగిపోతుందని పేర్కొంది. యూపీఏ తన సీట్లను గణనీయంగా పెంచుకుంటుంది! ఎస్పీ, బీఎస్పీ, టీఎంసీ, పీడీపీలు కలిస్తే.. యూపీఏకు మేజిక్ మార్కు ఖాయం. ఈ సంస్థ దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల్లోని 97 లోక్‌సభ

మిగతా 16వ పేజీలో...

ఇండియా టుడే ఏం చెప్పింది?
- ఎన్డీయే: 237; యూపీఏ: 166
- ఇతర పార్టీలు గెలిచేది 140
- యూపీలో బీజేపీకి కేవలం 18 సీట్లే
- వైసీపీ, టీఆర్ఎస్, బీజేడీ తోడైతే 271
- మాయ, మమత, అఖిలేశ్‌లతో కేంద్రంలో యూపీఏకు అధికారం

సీ వోటర్ ఏం చెప్పింది?
- ఎన్డీయే: 233; యూపీఏ: 167
- ఇతర పార్టీలు గెలిచేది 143
- యూపీలో ఎన్డీయేకి ఈసారి 25 సీట్లే
- వైసీపీ, టీఆర్ఎస్, బీజేడీ తోడైతే 278
- ఎస్పీ, బీఎస్పీ కలిసినా యూపీఏకి 257

1.16 లక్షల కోట్లు!

లోటు, రాజధాని, హోదా కింద రావాలి

పారిశ్రామిక రాయితీలతో కూడిన ప్రత్యేక హోదా

వెంటనే వెనుకబడిన జిల్లాల నిధులివ్వాలి

2018 జూన్ నుంచి పోలవరానికి పైసా ఇవ్వలేదు

నాటి రాజ్యసభ హామీలను తక్షణం నెరవేర్చండి

హామీల అమలుపై మంత్రులకు ఆదేశాలివ్వాలి

ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి సుదీర్ఘ లేఖ 14



సీఎం చంద్రబాబును గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నేతలు

Agri Gold 2
వెతికేకొద్దీ వెలుగులోకి..!
భారీగా అగ్రిగోల్డ్ ఆస్తులను పసిగట్టిన సీఐడీ
బినామీల పేరుతో ఉన్న 151 స్థిరాస్తులు గుర్తింపు

కవిగాయక లోకానికి రాజు.. త్యాగరాజు



పరంజ్యోతి

శ్రీరామచంద్ర లీలామృత రసాస్వాదన శక్తిని పదరచనా పటిమతో భవ్యంగా సాధించి ఆ పతితపావనమైన కీర్తనలు పరవశించి పాడి, కరుణాంతరంగుడగు రఘురాముని దయకు పాత్రుడైనవాడు, మరో జన్మలేని మహాత్మానందమందినవాడు, భారతీయ సనాతన ధర్మసంబంధమైన సంగీత, సాహిత్య సౌరభవాన్ని ప్రపంచప్రజాళికందించిన ప్రాభవోత్తముడు సత్కళా తపో విరాజితుడు త్యాగరాజు. ఆ త్యాగోన్నతజన్ముడు, రామబ్రహ్మం సీతమ్మ దంపతులకు 1759 సంవత్సరం (1767 అని కొందరి వాదన) వైశాఖ శుద్ధ షష్టినాడు జన్మించాడు. పూర్వజన్మసుకృత ఫల విశేషం.. వీణాపాణి అయిన వాణీమాత అమరాశీస్సులచే.. త్యాగయ్యకు కళాకౌశలత్వం సహజంగా సంక్రమించింది. పుష్పానికి తావి అబ్బినట్లు ప్రముఖ గాయక కళాతపస్వి అయిన శ్రీ సొంఠి వేంకట రమణయ్య గారి శిష్యత్వం లభించింది. దీంతో.. 'పిట్టకొంచెం కూతఘనం' అన్నట్లు త్యాగయ్య పిన్నవయసులోనే గురువర్యుని దక్షతన 'నమో నమో రాఘవా' అనే కీర్తన రచించి స్వరపరచి పరవశించి పాడగలిగాడు. అలాగే తన గురూత్తముని గృహంలో సంగీత కచేరీలో 'ఎందరో మహానుభావులు' అనే కృతిని వెలువరించి, చక్కగా స్వరాలు కూర్చి సర్వోత్తమంగా ఆలపించాడు. త్యాగయ్య కళాకౌశలత్వాన్ని కన్నులారాకాంచిన గురువు గారు ఆనాటి తంజావూరు రాజుకు తన శిష్యుని గొప్పదనాన్ని తెలియజేశాడు. ఆ రాజు త్యాగయ్యను తన కొలువుకూటానికి రావించి ధనకనకవస్తువాహనాదులతో సత్కరించే ప్రయత్నం చేశారు. కానీ అశాశ్వతమైన ప్రాపంచిక భోగ నిధులకన్నా, శాశ్వతానందాన్ని ప్రసాదించే రామసన్నిధి మాత్రమే తనకు సుఖశాంతులనిస్తుందని రాజుకు విన్నవించాడు త్యాగరాజు. రాజు కోరికను తిరస్కరించాడనే కోపంతో ఆయన సోదరుడు జప్యేశుడు.. నిత్యం సత్యదీక్షతో త్యాగయ్య పూజించే సీతారామలక్ష్మణుల విగ్రహాలను కావేరి నదిలో కలిపివేశాడు. త్యాగరాజస్వామి.. మనశ్శాంతి కోసం అనేక పుణ్యక్షేత్రాలు పర్యటించి తన ఇష్టదైవమైన రఘురాముణ్ని వివిధ విధాలుగా కీర్తించాడు. విగ్రహాలు లభించాయి. ఆయన ఆనందానికి హద్దులు లేవు. ఒకసారి ఆయన ఏడుకొండలవాడి దర్శనార్థం తిరుమలకు వెళ్లగా.. అప్పటికే గుడి తలుపులు మూసేశారు. అప్పుడాయన.. 'తెరతీయగరాదా' అంటూ ఆర్తిగా ఆలపించడంతో గుడితలుపులు తెరుచుకున్నాయి. త్యాగయ్య ఔన్నత్యానికి నారదమౌనీంద్రుడు అమలంగా ఆనందించి తన దరికేగి ఆశీస్సులిచ్చి సంగీతసాధనాసత్ఫలితాలకు సంబంధించిన మేల్తరమైన మెలుకువలు మిక్కుటంగా వివరించి వెళ్లినట్లు ఆస్తిక మహాశయుల అభిప్రాయం. ఆ పదకవివరేణ్యుడు భగవంతునిపై భక్తితో వేలాది కృతులు రంజితంగా రచించడమే కాక ప్రహ్లాదభక్తవిజయము, నౌకాచరిత్రము మొదలుగా గల సరససంగీత సాహిత్య ఆధ్యాత్మిక నాటకాలు విరచించి క్రమకళాకారుల హృదయాంతరాళలో నిత్యోత్సవంగా నిక్షిప్తమైపోయాడు. తాను పరమపదించే సమయంలో 'గిరిపై, పరితాపము' అనే కృతులు అలవోకగా ఆనందంతో ఆలపించి 1847 సంవత్సరం పుష్యబహుళ పంచమినాడు పరమాత్మలో లీనమైపోయాడు త్యాగయ్య. ఆ కళాపతంసుని జయంతిని పురస్కరించుకొని ఆనాడు భారతీయ సంగీత దినోత్సవంగా భారతీయులు జరుపుకోవడం ముదావహం. అట్లే ఆ వరణీయుని వర్ధంతి సమయాన్ని స్మరిస్తూ ఆరాధనోత్సవాలు అత్యంత ఆసక్తికరంగా నిర్వహించడం త్యాగరాజు ధన్యత్వానికి తార్కాణం.



-వల్లూరు చిన్నయ్య, 99483 48918

సొంతింటి కల సాకారం!

ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్లు లేదా ఫ్లాట్లు

- సంఘాలు, సొసైటీల ద్వారా కేటాయింపు
- ప్రభుత్వ భూమి లేకుంటే ప్రైవేటు భూమి
- కలెక్టర్ నేతృత్వాన నోడల్ ఏజెన్సీ
- ఇంట్లో ఇద్దరు ఉద్యోగులుంటే ఒక్కరికే
- సొంత ఇల్లు, ఫ్లాట్ ఉన్నా అనర్హులే
- 15 ఏళ్లపాటు అమ్ముకోవడానికి వీల్లేదు
- హౌసింగ్ పాలసీ విడుదల చేసిన సర్కారు



అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో ప్రభుత్వ ఉద్యోగులకు సొంతింటి భాగ్యం కల్పించేందుకు ముందడుగు పడింది. ఉద్యోగులకు ఇళ్ల కేటాయింపుపై విధివిధానాలు, మార్గదర్శకాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం విధాన పత్రం(పాలసీ) విడుదల చేసింది. ఈ మేరకు గురువారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ ఉత్తర్వులు(జీవో 43) జారీ చేశారు. ఇక్కడి ఉద్యోగుల (బార్న్ ఎంప్లాయీస్) తోపాటు రాష్ట్రానికి కేటాయించిన వారిని కూడా ఆంధ్రప్రదేశ్ ఉద్యోగస్తులుగానే పరిగణించి అర్హులైన వారికి సొంతింటి అవకాశం కల్పించడమే లక్ష్యమని ప్రభుత్వం పాలసీలో పేర్కొంది. 2008లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు, 2011లో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలకు అనుగుణంగా న్యాయ సలహా తీసుకొని ప్రభుత్వం ఈ పాలసీని రూపొందించింది. భవిష్యత్తులో దీనిపై న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అనేక జాగ్రత్తలు తీసుకుని ఆదేశాలు జారీ చేసింది.

> ఉద్యోగుల ఇళ్ల కేటాయింపు కోసం నూతన విధానాన్ని ప్రకటిస్తూ ఉత్తర్వులిచ్చినందుకు సీఎం చంద్రబాబుకు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. చిరుద్యోగులకు సొంతింటి కలను సాకారం చేయాలని పలు దఫాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసిన తర్వాత వివిధ స్థాయిల్లో చర్చించి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు.
>
> **ఉద్యోగుల ఇళ్ల పాలసీపై హర్షం**

ఎవరు అర్హులు..

రాష్ట్ర ప్రభుత్వంలో జిల్లాలు, ప్రాంతీయంగా పనిచేస్తున్న ఉద్యోగులంతా ఇళ్లకు అర్హులే. సొంత ఉద్యోగులతోపాటు విభజన సందర్భంగా రాష్ట్రానికి కేటాయించిన ఉద్యోగులను ఏపీ ఉద్యోగులుగా పరిగణిస్తున్నందున వారితోపాటు, ప్రస్తుతం పాలసీ వచ్చే నాటికి పనిచేస్తోన్న ఉద్యోగులు అర్హులు. అయితే ప్రస్తుతం పనిచేస్తోన్న నగరం లేదా పట్టణం పరిధిలో ఉద్యోగులు, వారి జీవితభాగస్వామి, పిల్లల పేరిట సొంతిల్లు కలిగి ఉంటే ఈ పథకానికి అనర్హులు. ఒకే ఇంట్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులే అయితే ఒక్కరికే అవకాశం ఇస్తారు. ప్రభుత్వ భూమి ఉన్నమేరకు ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇస్తారు. ఒకవేళ ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోతే ప్రైవేటు భూములను సేకరిస్తారు. వాటిని బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించేందుకు కేటాయిస్తారు. భూములను గృహనిర్మాణ సొసైటీలు, సంఘాలకు మాత్రమే కేటాయించాలి. కాబట్టి ఉద్యోగులు సొంతంగా ఓ హౌసింగ్ సొసైటీని లేదా సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటేనే దీని కింద ఇళ్లు పొందగలరు. ఆయా సంఘాలు, సొసైటీల కింద సభ్యులుగా చేరిన వారు ప్రస్తుతం పనిచేస్తోన్న చోట తను, భార్య, పిల్లల పేరిట సొంత ఇళ్లు, ఫ్లాట్లు లేవని స్వీయ ధృవీకరణ (అఫిడవిట్) ఇవ్వాలి. ఇక జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని నోడల్ ఏజెన్సీకి హౌసింగ్ సొసైటీ లేదా సంఘాలు తమ సభ్యుల వివరాలు అందజేయాలి. తప్పుడు ధృవీకరణలు ఇస్తే దరఖాస్తులను తిరస్కరించి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఈ ప్రక్రియంతా ముగిశాక ఏపీ భూ నిర్వహణ సంస్థ (ఏపీ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ) నిర్ణయం మేరకు నామమాత్రపు ధరలకు సొసైటీలు, సంఘాలకు భూములను కేటాయిస్తారు. కాగా, ఉద్యోగుల ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం ఎలా చేపట్టాలన్నదానిపై ప్రభుత్వం సొసైటీలు, సంఘాలకు వెసులుబాటు కల్పించింది.

భూమి కేటాయింపుల్లో షరతులు

ఇళ్లస్థలాలకోసం ఉద్యోగుల సొసైటీ, సంఘాలకు భూములు కేటాయించిన తర్వాత ఏం చేయాలి? ఎలా చేయాలన్న దానిపై పలు నియమనిబంధనలు, షరతులు విధించారు. భూమి కేటాయింపుల ఉత్తర్వులు వెలువడ్డాక సొసైటీలు, సంఘాలు ఆరు నెలల్లోగా సభ్యులకు డ్రా ద్వారా వ్యక్తిగతంగా ఇళ్లస్థలాలు కేటాయించాలి. సభ్యులు ఇంటిస్థలం పొందిన తర్వాత మూడేళ్లలో ఇళ్లు లేదా ఫ్లాట్ నిర్మాణం పూర్తిచేయాలి. లబ్ధి పొందిన ఉద్యోగులు కనీసం పదిహేనేళ్లపాటు దాన్ని ఇతరులకు విక్రయించడానికి వీల్లేదు. ఉద్యోగులు రెండు, అంతకన్నా ఎక్కువ సొసైటీలు, సంఘాల్లో సభ్యులుగా ఉంటూ ప్రభుత్వం నుంచి ఇళ్లు పొందాలనుకుంటే కుదరదు. కాబట్టి ఒక ఉద్యోగికి రాష్ట్రంలో ఒక సొసైటీ తరపున ఒక్కసారే ఇంటిస్థలం లేదా ప్లాట్ కేటాయిస్తారు. ఇక, అది కూడా ఉద్యోగ సర్వీసులో ఒక్కసారికే పరిమితం.

అమరావతి ఉద్యోగుల హౌసింగ్ పాలసీ ఖరారు

అఖిల భారత సర్వీస్ (ఏఐఎస్) అధికారులతోపాటు రాష్ట్ర రాజధానిలో పనిచేస్తున్న ఉద్యోగులకు అమరావతిలో గృహ వసతికి సంబంధించిన హౌసింగ్ పాలసీని ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో జారీచేసింది. అందులో వివిధ కేడర్లకు నిర్ణీత అర్హతలను నిర్దేశించింది. ఏఐఎస్ అధికారులకు 500 చదరపు గజాల చొప్పున ఇస్తామని, గెజిటెడ్-నాన్‌గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులకు మాత్రం స్థల లభ్యతను బట్టి ఇళ్ల స్థలాలు లేదా ఫ్లాట్లను కేటాయిస్తామని పేర్కొంది. అయితే ఇందుకుగాను వీరందరూ సొసైటీలుగా ఏర్పడాల్సి ఉంటుందని వెల్లడించింది. ఏపీ కేడర్ ఏఐఎస్ అధికారులు, డిప్యుటేషన్ అధికారులను అర్హులుగా పేర్కొన్నారు. వారందరికీ ఒక్కొక్కరికి 500 చదరపు గజాల చొప్పున రాజధాని నగరంలో ఇళ్ల స్థలం కేటాయిస్తారు. అందుకోసం వారు సొసైటీలు లేదా సంఘాలుగా ఏర్పడాలి. అలాగే రాష్ట్రానికి కేటాయించిన లేక నియమితులై, ప్రస్తుతం రాజధానిలో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వోద్యోగులు, అధికారులు కూడా దీనికి అర్హులే. వారికి ఇళ్లస్థలాలు లేదా ఫ్లాట్లను కేటాయిస్తారు.

లోకం తీరు



ఎప్పుడూ విదేశాలకే కాకుండా ఈ సారి అడవుల్లోకి వెళ్లి మిమ్మల్ని మీరు ఆత్మపరిశీలన చేసుకోండి సార్!

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
విశాఖపట్నం	15.6	30.6
గుంటూరు	17.9	30.9
ఏలూరు	18.0	30.0
హైదరాబాద్	18.3	29.7
చిత్తూరు	18.5	32.5
విజయవాడ	19.5	30.1

రేపటి నుంచి వర్షాలు

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో ఉపరితల ఆవర్తనం, గల్ఫ్ ఆఫ్ మనార్ నుంచి తమిళనాడు, కర్ణాటక వరకు ద్రోణి కొనసాగుతున్నాయి. ఇంకా ఉత్తరాదిలో పయనిస్తున్న వెస్ట్రన్ డిస్ట్రబెన్స్, బంగాళాఖాతం నుంచి వీస్తున్న తూర్పుగాలులు కలుస్తున్నాయి. వీటి ప్రభావంతో మధ్యభారతం దానికి ఆనుకుని వున్న కోస్తా, రాయలసీమ, తెలంగాణల్లో వర్షాలు కురిసే వాతావరణం నెలకొంది. ఈనెల 26 నుంచి రెండు రోజులపాటు కోస్తా, తెలంగాణల్లో వర్షాలతోపాటు వడగళ్లు, రాయలసీమలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా తెలంగాణకు ఆనుకుని కోస్తా జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా వుంటుందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. కాగా గురువారం కోస్తాలో పొగమంచు కురిసింది.



రైతులకు త్వరలో కేంద్రం ప్యాకేజీ

రైతుల ఆదాయాన్ని పెంచేలా త్వరలో ఓ ప్యాకేజీ ప్రకటించనున్నాం. దీనిని ఫిబ్రవరి 1న బడ్జెట్‌లో ప్రకటిస్తామా? అంతకన్నా ముందే వెల్లడిస్తామా? అన్నది ఇప్పుడే చెప్పలేం. కానీ త్వరలోనే దీనిని ప్రకటిస్తాం. మీరు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేదు.

- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల



అమ్మాయిలు జీన్స్ వేసుకోవద్దు!

ఎలాంటి దుస్తులు ధరించాలో మనకు ఓ అవగాహన ఉండాలి. గుడికి వెళ్లేటప్పుడు జీన్స్ వేసుకోకూడదు. ఎందుకంటే అవి అసౌకర్యంగా ఉంటాయి. సల్వార్ కమీజ్ లేదంటే చీర కట్టుకోవాలి. ఇది మన వారసత్వం. తర్వాతి తరానికి వారి మంచి కోసం ఎలాంటి దుస్తులు ధరించాలో చెప్పాల్సిన అవసరం ఉంది. ఒక తల్లిగా, భారత స్త్రీగా అమ్మాయిలు జీన్స్ వేసుకోకూడదనేది నా అభిప్రాయం. **- మౌసమి చటర్జీ, బీజేపీ నేత, నటి**



ఫ్రైడ్ చికెన్‌తో అకాల మరణం!

వాషింగ్టన్, జనవరి 24: ఫ్రైడ్ చికెన్.. ఫ్రైడ్ ఫిష్ వంటి వంటకాలను తరచూ తినడం వల్ల మహిళల్లో అకాల మరణం ముప్పు పెరుగుతుందని తాజా అధ్యయనంలో తేలింది. 1993-1998 మధ్యలో వుమెన్స్ హెల్త్ ఇనిషియేటివ్‌లో నమోదైన 50-79 ఏళ్ల వయసు గల 1,06,966 మంది మహిళల సమాచారాన్ని విశ్లేషించిన పరిశోధకులు ఈ విషయాన్ని గుర్తించారు. ఫిబ్రవరి 2017 నాటికి వీరిలో 9,320 మంది హృద్రోగ సమస్యలతో, 8,358 మంది కేన్సర్‌తో, 13,880 మంది ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో అకాల మరణం చెందినట్లు పరిశోధకుడు వెయి బావో తెలిపారు.

పురుషుల్లో సంతానోత్పత్తికి 'ఆర్బీఎమ్ఎక్స్ఎల్2' కీలకం

లండన్, జనవరి 24: పురుషుల్లో వంధ్యత్వ సమస్యకు జన్యు పరమైన కారణాలే ఉంటాయి. ఆ దిశగా దృష్టి సారించిన శాస్త్రవేత్తలు ఓ జన్యువు పనితీరుపై పరిశోధనలు చేసి.. అదే వంధ్యత్వాన్ని పోగొట్టే కీలక జన్యువు అని గుర్తించారు. ఆరోగ్యకరమైన వీర్య కణాల ఉత్పత్తిలో 'ఆర్బీఎమ్ఎక్స్ఎల్2' అనే జన్యువు క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని తేల్చారు. ఎలుకల్లోని క్రోమోజోమ్-11 నుంచి ఆ జన్యువును తొలగించగా వీర్య కణాల ఉత్పత్తి ఆగిపోయిందని ఇంగ్లండ్‌లోని న్యూక్యాసిల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు.

కలెక్టర్ల సదస్సు కొత్తగా!

- 28న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహణ
- మండల స్థాయి అధికారులకూ భాగస్వామ్యం

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ల కాన్ఫరెన్స్ అంటే... అదో భారీ ప్రహసనం! రాష్ట్ర స్థాయి అధికారులూ అందులో పాల్గొనాలి. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు రాజధానికి తరలి రావాలి. కానీ, ఈనెల 28న కలెక్టర్ల సదస్సును వినూత్నంగా... వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రుల నుంచి మండలస్థాయి అధికారుల వరకు అందరికీ భాగస్వామ్యం కల్పిస్తోంది. ముఖ్యమంత్రి, మంత్రులు, రాష్ట్రస్థాయి అధికారులు అమరావతిలో సమావేశమవుతారు. కలెక్టర్లు తమతమ జిల్లాల్లోనే ఉండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటారు. మండల స్థాయి అధికారులు కూడా ఇందులో భాగస్వాములవుతారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చతో పాటు... వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధి, ఇంకా తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు.

యూనిఫాం పోస్టులకు మరో రెండేళ్లు

- గరిష్ఠ వయోపరిమితి పెంచిన ప్రభుత్వం
- గ్రూప్-1, 2 దరఖాస్తుల గడువు పొడిగింపు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): యూనిఫాం సర్వీసు పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితిని ప్రభుత్వం రెండు సంవత్సరాలు పెంచింది. ఏపీపీఎస్సీ, ఇతర రిక్రూటింగ్ ఏజెన్సీల ద్వారా ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు చేపట్టే పోస్టుల భర్తీకి ఈ పెంపు వర్తిస్తుంది. గ్రూప్-1 సర్వీసులోని... డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(సివిల్-పోస్ట్ కోడ్ నం.3), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్(మెన్-పోస్ట్ కోడ్ నం.4) పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 28 ఏళ్లు ఉండగా... ఇప్పుడు 30 ఏళ్లకు పెంచారు. డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్స్(పోస్ట్ కోడ్ నం.5), అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్(పోస్ట్ కోడ్ నం.8) పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 26 ఏళ్లు ఉండగా... ఇప్పుడు 28 ఏళ్లకు పెంచారు. గ్రూప్-2 సర్వీసులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్(పోస్ట్ కోడ్ నం.7) పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 28 ఏళ్లు ఉండగా... ఇప్పుడు 30 ఏళ్లకు పెంచారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(సర్వీసెస్) కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ గురువారం ఉత్తర్వులు(జీ.వో.ఎం.ఎస్.నం.8) జారీచేశారు. దీంతో గ్రూప్-1, 2 సర్వీసుల నోటిఫికేషన్లకు దరఖాస్తు స్వీకరణ గడువును ఏపీపీఎస్సీ పొడిగించింది. గ్రూప్-1కు ఈ నెల 27 వరకూ, గ్రూప్-2కు ఈ నెల 25 వరకూ పొడిగించారు.

477 మంది టీచర్ల అంతర్‌జిల్లా బదిలీలు

- పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు
- ఉపాధ్యాయ సంఘాల హర్షం

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, జిల్లాపరిషత్ పాఠశాలల్లో పనిచేస్తోన్న 477 మంది ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు (జీవో నెంబరు 32) జారీచేసింది. ఇందులో 322 మంది మ్యూచ్‌వల్, 141 మంది స్పౌజ్, నలుగురు ఎక్స్ సర్వీస్‌మెన్ కేటగిరి కింద బదిలీ అయ్యారు. ఉత్తర్వుల ప్రకారం ఈ 477 మంది వెంటనే రిలీవ్ అవుతారు. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)ల విషయానికి వస్తే పాత పాఠశాలల్లో అవసరం ఉంటేనే తొలుత కొత్త పాఠశాలలో జాయిన్ అయ్యి మళ్లీ డిప్యుటేషన్‌పై పాత పాఠశాలలో పనిచేస్తారు. అవసరం లేకుంటే కొత్త పాఠశాలలోనే కొనసాగవచ్చు. ఇక స్కూల్ అసిస్టెంట్లు, హెడ్మాస్టర్ల విషయానికి వస్తే.. కచ్చితంగా రిలీవ్ అయ్యి, తొలుత కొత్త పాఠశాలల్లో జాయిన్ అయ్యి, మళ్లీ పాత పాఠశాలల్లో డిప్యుటేషన్‌పై పనిచేయాల్సి ఉంటుంది. ఈ ఉత్తర్వుల పట్ల ఎమ్మెల్సీలు డాక్టర్ ఏఎస్ రామకృష్ణ, గాదె శ్రీనివాసులునాయుడు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, జి.హృదయరాజు, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం- అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి ఎం.శివార్జున వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.

వెతికేకొద్దీ వెలుగులోకి..!

- భారీగా అగ్రిగోల్డ్ ఆస్తులను పసిగట్టిన సీఐడీ
- బినామీల పేరుతో ఉన్న 151 స్థిరాస్తులు గుర్తింపు
- గుంటూరు, ప్రకాశం, హైదరాబాద్‌లలో 33 ఆస్తుల జప్తు
- ఏపీలోని 6 జిల్లాల్లో మరో 118 ఆస్తుల అటాచ్‌కు సిద్ధం

Agri Gold

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బినామీ ఆస్తులు వెతికే కొద్దీ బయటకొస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో తాజాగా 151 స్థిరాస్తులను సీఐడీ గుర్తించింది. అగ్రిగోల్డ్‌కు ఒక్క మన రాష్ట్రంలోనే 20 లక్షల మంది డిపాజిటర్లు ఉన్నారు. ఈ కేసును సీఐడీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేస్తోంది. అమరావతి పరిధిలో రూ.600 కోట్లకుపైగా విలువైన హాయ్‌ల్యాండ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో భారీగా స్థిరాస్తులు ఉన్నాయి. ఇవి కాకుండా తాజాగా అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, విశాఖ, విజయనగరం జిల్లాల తోపాటు హైదరాబాద్ షేక్‌పేట్‌లో ఉన్న స్థిరాస్తులను సీఐడీ అధికారులు పసిగట్టారు. ఈ అంశంపై 2 నెలలుగా చేసిన కసరత్తు ఫలితంగా ఈనెలలో 151 స్థిరాస్తులు వెలుగులోకి వచ్చాయి. ఇందులో వేల చదరపు గజాల వెంచర్లు, వందల ఎకరాల భూములు ఉన్నాయి. వీటన్నింటి జప్తు కోసం సీఐడీ అడిషనల్ డీజీ అమిత్ గార్గ్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఇప్పటికే గుంటూరు జిల్లాలోని 15, కృష్ణా జిల్లాలో 17, ప్రకాశం జిల్లాలో 2 స్థిరాస్తుల జప్తునకు హోంశాఖ ఆదేశాలిచ్చేందుకు సిద్ధమైందని సమాచారం. మరో 118 ఆస్తులు గుంటూరు, అనంతపురం, ప్రకాశం, నెల్లూరు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఉన్నట్లు సమాచారం. ఈ ఆస్తులు అగ్రిగోల్డ్ డైరెక్టర్లు, సిబ్బందితోపాటు, బినామీల పేర్లపై ఉన్నట్లు తెలిసింది. గడిచిన పదేళ్లుగా కొనుగోలు చేసిన ఈ ఆస్తుల విలువ ప్రకాశం జిల్లా మినహా ఇతర అన్నిప్రాంతాల్లోనూ రూ.కోట్లల్లోనే ఉంటుందని సీఐడీ అధికారి ఒకరు తెలిపారు.

ఎవరికి ఎంత చెల్లించాలంటే..!

డిపాజిటర్లలో ఎవరెవరికి ఎంత మొత్తం చెల్లించాలన్న వివరాలను సీఐడీ వెల్లడించింది. అత్యధికంగా రూ.లక్ష బాండ్‌ను పరిగణనలోకి తీసుకొని అంతలోపు ఉన్న మొత్తాన్ని 5 విభాగాలుగా విభజించింది. అంతకన్నా ఎక్కువ మొత్తం ఉన్నవారిని ఆరో విభాగంలో చేర్చారు. ఇందులో ఏపీ వరకూ 19.43లక్షల అకౌంట్లు ఉండగా, రూ.3965.78 కోట్లు చెల్లించాలి. ఇందులో రూ.5వేలలోపు డిపాజిట్ చేసిన వారికి ఇప్పటికిప్పుడు చెల్లించాలంటే రూ.122కోట్లు అవసరమని సీఐడీ తెలిపింది. రూ.5001-రూ.10వేల వరకూ 2.91లక్షల అకౌంట్లున్నాయి. రూ.241కోట్లు చెల్లిస్తే వీరికి క్లియర్ అవుతుంది. రూ.10,001- రూ.20 వేల మధ్యలో 5,89,644 అకౌంట్లుండగా.. రూ.819 కోట్లు అవసరమవుతాయి. రూ.20,001-రూ.50వేల మధ్యలో 4,16,579 మంది ఉండగా, వీరికి రూ.1417.14కోట్లు చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు. రూ.50,001-రూ.1లక్షల వరకూ 1,29,887 అకౌంట్లు ఉండగా, రూ.1013.40లక్షలు, ఆపైన 22,216 మందికి రూ.353కోట్లు చెల్లిస్తే మొత్తం డిపాజిటర్ల సమస్య పరిష్కారమవుతుందని వివరించారు.

సత్వర పరిష్కారమే లక్ష్యం: సీఐడీ

డిపాజిటర్లకు వీలైనంత త్వరగా న్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమని సీఐడీ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఇప్పటికే 212 ఆస్తుల వేలానికి సిద్ధం చేశామని, హైకోర్టు సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఏపీలో మొత్తం 17,546 ఎకరాల భూమి, 2.88లక్షల చ.గ.ల నివాస-వాణిజ్య స్థలం ఉందన్నారు. అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో 9,189 సెంట్ల నివాస స్థలాలు, విజయనగరం జిల్లాలో 2840 చ.అ.ల నిర్మాణం, మొత్తం 8 జిల్లాల్లో 2,145 ప్లాట్లు ఉన్నట్లు సీఐడీ చీఫ్ అమిత్‌గార్గ్ వివరించారు. ఇవిగాక హాయ్‌ల్యాండ్ మరిన్ని ఆస్తులు కూడా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ విలువ ప్రకారం రూ.2,150 కోట్లు ఉంటుందన్నారు.



బంగారు కోడి పెట్ట..

పది రోజుల్లో 35 గుడ్లు

సాధారణంగా కోడి రోజుకు ఒక గుడ్డు పెడుతుంది. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకా హుచ్చమ్మనహళ్ళి గ్రామంలోని ఈ కోడి మాత్రం పది రోజుల్లో 35 గుడ్లు పెట్టి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. గ్రామానికి చెందిన యల్లమ్మ గత 8 నెలల నుంచి ఈ కోడిని పెంచుతోంది. కోళ్లలో పిండం అభివృద్ధి దశలో 'సూపర్ ఓవలేషన్' అనే ప్రక్రియ జరిగితేనే ఇలా అధిక సంఖ్యలో గుడ్లు పెట్టడం సాధ్యమని పశువైద్యాధికారులు చెప్పారు. లక్ష కోళ్లలో ఒక దానికి ఇలాంటి ఘటనలు సంభవిస్తుంటాయన్నారు.

-బళ్లారి గాంధీనగర్

సమ్మె లేకుండా.. సమస్యకు పరిష్కారం

ఆర్టీసీ జేఏసీకి మంత్రి అచ్చెన్న హామీ



మంత్రి అచ్చెన్నకు వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ జేఏసీ నేతలు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సమ్మెకు ఆస్కారం లేకుండా వేతన సవరణ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు జేఏసీ నేతలకు హామీ ఇచ్చారు. గుర్తింపు సంఘం ఈయూ నేతృత్వంలో ఐక్య కార్యాచరణ కూటమి(జేఏసీ)గా ఏర్పడిన కార్మిక సంఘాల నేతలు గురువారం విజయవాడలో మంత్రితో భేటీ అయ్యారు. ఆర్టీసీ నష్టాలకు కార్మికులు కారణం కాదని, డీజిల్ ధరల పెరుగుదల, పల్లెవెలుగు సర్వీసులపై భారీగా పన్ను, అప్పులకు వడ్డీలు, ప్రైవేటు వాహనాల అక్రమ రవాణా కారణమని జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదర్‌రావు, సభ్యులు వైవీ రావు, జిలానీ, శ్రీనివాసరావు తదితరులు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కార్మికుల కష్టం వల్లే ఆర్టీసీ ఆక్యుపెన్సీ 67శాతం నుంచి 80శాతానికి పెరిగిందన్నారు. ఈ నెల 30, 31న ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం జేఏసీ కన్వీనర్ దామోదర్‌రావు మాట్లాడుతూ ఫిబ్రవరి 6న సమ్మెకు పూర్తిగా సంసిద్ధం అవుతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 128 బస్ డిపోల్లో ఇప్పటికే సన్నాహక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు.

లైమ్‌స్టోన్ అక్రమ తవ్వకాలపై 3 వారాల్లో నివేదికివ్వండి: హైకోర్టు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని లైమ్‌స్టోన్ అక్రమ తవ్వకాల వ్యవహారంపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి, 3 వారాల్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ సత్యనారాయణ మూర్తితో కూడిన ధర్మాసనం సీఐడీని ఆదేశించింది. కేశనుపల్లి, నడికుడి, కోనంకి, పిడుగురాళ్ల గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని, ఆయన అనుచర గణం లైమ్‌స్టోన్ అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారంటూ మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యంపై దాఖలు చేశారు. బుధవారం దీనిపై విచారణ సందర్భంగా హైకోర్టు.. సీఐడీ దర్యాప్తు పట్ల అసంతృప్తి వ్యక్తంచేసింది. గురువారం జరిగిన విచారణలో సీఐడీ అందించిన వివరాలను ధర్మాసనం పరిశీలించింది. మూడు వారాల్లో పూర్తి దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

350 కోట్లు ఎందుకు వెనక్కు తీసుకున్నారు?

- ఫిబ్రవరి 7కి నివేదికివ్వండి
- కేంద్రాన్ని ఆదేశించిన ఏపీ హై కోర్టు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన జిల్లాల అభివృద్ధికోసం ఇచ్చిన రూ.350 కోట్లను వెనక్కి తీసుకోవడానికి గల కారణాలను తెలిపేందుకు కేంద్రానికి ఏపీ హైకోర్టు మరో రెండు వారాల గడువు పొడిగించింది. రాయల సీమలోని 4, ఉత్తర కోస్తాలోని 3 జిల్లాల అభివృద్ధి కోసం 2017-18 సంవత్సరానికిగాను రూ.350 కోట్లను కేటాయించింది. గతేడాది ఫిబ్రవరి 9న రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో ఆ సొమ్మును జమ చేసింది. అదేనెల 15న వెనక్కి తీసేసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీనియర్ నేత కొణతాల రామకృష్ణ గత జూన్ 13న ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను ఈ నెల 3న విచారించిన ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తితో కూడిన ధర్మాసనం ఆ నగదును ఎందుకు వెనక్కి తీసుకోవాల్సివచ్చిందో వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై తిరిగి గురువారం విచారణ జరిగింది. కేంద్రం తరపున హాజరైన అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ ఎం.కృష్ణమోహన్ కేంద్రం నుంచి మరిన్ని వివరాలు రావాల్సి ఉన్నందున మూడు వారాల గడువు కావాలని ధర్మాసనాన్ని కోరారు. కొణతాల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సి.రఘు అభ్యంతరం తెలిపారు. ఈ వ్యవహారంలో జాప్యం వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని, అభివృద్ధి పనులు కుంటుపడే అవకాశముందని, అందువల్ల అంత గడువు ఇవ్వరాదని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇద్దరి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... ఫిబ్రవరి 7వ తేదీకి తదుపరి విచారణను వాయిదా వేసింది.

నెల్లూరు, కరీంనగర్‌కు బేటీ బచావో-బేటీ పఢావో అవార్డులు

న్యూఢిల్లీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'బేటీ బచావో - బేటీ పఢావో' కార్యక్రమం అమల్లో ఉత్తమ పనితీరు కనపరిచిన రెండు తెలుగు రాష్ట్రాల్లోని రెండు జిల్లాలకు జాతీయ అవార్డులు లభించాయి. ఎఫెక్టివ్ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ విభాగంలో కరీంనగర్, నెల్లూరు జిల్లాలకు అవార్డులు దక్కించుకున్నాయి. గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్, నెల్లూరు ఐసీడీఎస్ పీడీ సరోజిని ఈ అవార్డులను కేంద్ర మంత్రి మేనకా గాంధీ చేతుల మీదుగా స్వీకరించారు.





స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచార్థిక వేదిక (వరల్డ్ ఎకనమిక్ ఫోరం) సదస్సుకు ముందు అంతర్జాతీయ హక్కుల సంస్థ 'ఆక్స్‌ఫామ్' ఏటా ఒక నివేదిక విడుదల చేస్తూంటుంది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయనీ, సృష్టించిన సంపదంతా కొద్దిమంది కుబేరుల దగ్గర పోగుపడిపోతున్నదనీ అది చెబుతున్నప్పుడల్లా మనకు ఆవేదన, ఆగ్రహం కలుగుతుంటాయి. భారత్ అద్భుతమైన ఆర్థిక ప్రగతి సాధిస్తున్నదనీ, అనతికాలంలోనే జీడీపీని అనేక రెట్లు పెంచుకున్నదనీ పాలకులు ఒకపక్క గొప్పలు పోతుంటే, ఈ నివేదిక మాత్రం భారత్‌లో ఎదుగుతున్నది ధనికులే తప్ప, పేదలు కాదని పెదవి విరుస్తున్నది. ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్న తీరు ఈ దొంతి మరింత బలపడుతున్నదని దాని కొత్త నివేదిక కూడా తేల్చేసింది.

భారత్‌లో ఆర్థిక వ్యత్యాసాలు రెండు దశాబ్దాల కాలంలో అనేక రెట్లు పెరిగిపోయిన వాస్తవం కంటికి సైతం కనిపిస్తున్నదే ఉన్నది. ఈ నివేదిక ప్రకారం, భారత కుబేరుల సంపద గత ఏడాది రోజుకు 2200 కోట్లు చప్పున పెరిగింది. ఐశ్వర్యవంతుల సంపద39శాతం వృద్ధి చెందితే, జనాభాలో సగభాగం సంపద మూడుశాతమే పెరిగింది. అత్యంత పేదలైన పదిశాతంమంది అంటే, రమారమి ఓ పద్నాలుగు కోట్ల జనాభా దశాబ్దన్నర కాలంగా అప్పుల ఊబిలోనే కూరుకుని దుర్భర జీవితాలు గడుపుతున్నారు. వృద్ధి చెందుతున్న సంపదనంతా కొంతమంది కుబేరులు అనుభవిస్తుంటే, కోట్ల మంది పేదలు పూట గడవక, పిల్లలకు మందులు కూడా కొనివ్వలేనిస్థితిలో ఉన్నారు. భారత సంపదలో 77శాతం 10శాతంమంది ధనికుల చేతుల్లో ఉంటే, ఒక్క శాతం అపర కుబేరుల గుప్పిట్లో 52శాతం సంపద పోగుపడి ఉంది. తొమ్మిది మంది అతి సంపన్నుల సంపద దేశంలోని సగం జనాభాతో సమానంగా ఉంది. గత ఏడాది కొత్తగా 18మంది బిలియనీర్లు ఈ దేశంలో అవతరించి, వీరి సంఖ్య 119కు పెరిగింది. వీరందరి సంపద గత ఏడాది ముప్పైలక్షల కోట్లకు పెరిగింది. మరో మూడేళ్లలో భారత్‌లో రోజుకు డెబ్బయ్‌మంది కుబేరులు తయారవుతుంటారు.

వృద్ధి వెనుక వాస్తవాలు

ధనికుల సంపద రోజుకు రెండువేలకోట్ల రూపాయలు పెరుగుతూ రావడాన్ని బట్టి పెద్దనోట్ల రద్దు, ఆర్థిక వ్యవస్థ మందగమనం ఇత్యాది బాధలన్నీ పేదలకే తప్ప పెద్దలకు కాదని అర్థం. పెరుగుతున్న ఈ అసమానతలను సరిదిద్దకపోతే సామాజిక అశాంతి ప్రబలిపోతుందని, ప్రజాస్వామ్యం ఉనికికే ముప్పు వాటిల్లుతుందని ఆక్స్‌ఫామ్ ఈ నివేదికలో మరోమారు హెచ్చరించింది. ఈ హెచ్చరికలను మన పాలకులు పట్టించుకోవడం మానేశారు. దానితో పాటు, పేదలను ఆదుకునేందుకు ఉద్దేశించిన పథకాలు, కార్యక్రమాలకు కోతలపెట్టడం కూడా వేగంగా సాగిపోతున్నది. మట్టు పేదరికం తాండవిస్తుండగా, మధ్యలో కుబేరులు కోటలు కట్టుకొని కూర్చుంటే అత్యధిక జనాభాకు కడుపు మండదనీ, తిరుగుబాట్లు ఉండవనీ పాలకులు నిజంగా అనుకుంటున్నారో, నిర్దాక్షిణ్యంగా అణచివేయవచ్చునని నమ్ముతున్నారో తెలియదు. ఒక పక్కన ఉత్పాదకత హెచ్చుతున్నా దేశంలో అత్యధిక జనాభా దారిద్ర్యంలోనూ, నిరాశానిస్పృహల్లోనూ మగ్గిపోవడం సిగ్గుచేటైన విషయం. బిలియనీర్ల సంఖ్యలు, వారి సంపదలు ఏటా పెరిగిపోతుండటం, పేదలు మరింత దిగజారిపోవడం మన సత్వర ఆర్థికాభివృద్ధి మాయకు నిదర్శనం. బ్యాంకుల్లో 10లక్షలకోట్ల మేరకు పేరుకుపోయిన నిరర్థక ఆస్తులు కూడా అపరకుబేరుల సంఖ్య ఎలా పెరిగిందో తెలియచెబుతాయి. కొద్దిమంది సంపన్నులకు కాక, ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దమనీ, కార్మికశక్తికి ప్రాధాన్యం ఇమ్మనీ, వ్యవసాయంలో పెట్టుబడులు పెంచమనీ ఆక్స్‌ఫామ్ చెబుతూంటుంది. కానీ, కార్మికచట్టాలను నిర్వీర్యం చేసి, పెట్టుబడిదారులను రెడ్‌కార్పెట్‌తో స్వాగతించడంలో పాలకులకు ఉన్న ప్రయోజనాల ముందు ఇవేవీ నిలవడం లేదు. వృద్ధిమాయలో జనాన్ని ముంచుతున్న పాలకులకు అంతర్జాతీయ సర్వేలు, విశ్లేషణలు మరింత ఊతాన్నిస్తున్నాయి. భారతదేశం ఈ ఏడాది చివరికల్లా ఫ్రాన్స్, బ్రిటన్‌లను దాటేసి, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఐదోస్థానంలో నిలుస్తుందని ఇటీవలే పిడబ్ల్యుసి అనే సంస్థ ప్రకటించింది. కానీ, ఈ లెక్కలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు ఏ మాత్రం పొంతన ఉండదు. నోట్ల రద్దు ప్రభావంతో విచ్ఛిన్నమైన అనేక రంగాలు ఇంకా తేరుకోలేదు. భారత రైతాంగం ఉద్యమాల బాట పడుతున్నది. అన్ని రంగాల్లోనూ ఉపాధి లేమి స్పష్టంగా కనిపిస్తున్నది. ఆక్స్‌ఫామ్ నివేదిక పాలకులు అందంగా అల్లిన వృద్ధిమాయను ఛేదించి, అసలు నిజాన్ని మనముందు ఉంచింది.

మేనక చరిత్రాత్మక న్యాయపోరాటం

మన సుప్రీం కోర్టు 1978 జనవరి 25న జీవించే హక్కుపై ఒక చరిత్రాత్మక తీర్పు నిచ్చింది. 'మేనకా గాంధీ వెర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఇచ్చిన తీర్పు అది. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆ తర్వాత వెలువరించిన అనేకానేక తీర్పులకు ఈ సుప్రసిద్ధ తీర్పే మార్గదర్శకమైంది. భారత న్యాయస్థానాల తీర్పుల చరిత్రను 'మేనకా గాంధీ కేసు తీర్పుకు ముందు తర్వాత' అని చెప్పుకునే విధంగా 1978 తీర్పు ఒక మైలురాయిగా నిలిచింది. న్యూఢిల్లీలోని రీజనల్ పాస్‌పోర్టు అధారిటీ మేనకా గాంధీకి మంజూరు చేసిన పాస్‌పోర్ట్‌ను 1977లో భారత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ పాస్‌పోర్ట్‌ను సరెండర్ చేయాలని 1977 జులై 2న మేనకకు ఆదేశాలు అందాయి. ఆమె వెంటనే తన పాస్‌పోర్ట్ రద్దు చేయడానికి గల కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని అర్జీ పెట్టుకున్నారు. దానికి సమాధానంగా సంబంధిత అధికారులు 'ప్రజా ప్రయోజనాల రీత్యా' ఆ కారణాలు వెల్లడించలేమని పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో మేనకా గాంధీ అధికరణ 32 క్రింద సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అధికరణలు 14, 19, 21లో దేశ పౌరులకు ప్రసాదించిన హక్కులకు భంగం వాటిల్లేలా అధికారుల చర్యలు ఉన్నాయని మేనక తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. జస్టిస్ ఎమ్.హెచ్. బేగ్, జస్టిస్ వై.వి. చంద్రచూడ్, జస్టిస్ పి.ఎన్. భగవతి, జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్, జస్టిస్ ఎల్.ఎల్. ఉంటివాలా, జస్టిస్ ముర్తాజా ఫజల్ అలీ, జస్టిస్ పి.ఎస్. కైలాసంతో కూడిన ధర్మాసనం ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించి ఆర్టికల్ 21లో ఉన్న 'జీవించే హక్కు'కు గల విశాల, విస్తృత పరిధిని వివరిస్తూ తీర్పునిచ్చింది.

ఎ.కె. గోపాలన్ కేసు (1950)లోనూ, శివకాంత్ శుక్ల వెర్సెస్ ఎ.డి.ఎం. జబల్పూర్ (1976) తదితర కేసులలో మెజార్టీ తీర్పు ఆర్టికల్ 21లో పొందుపరచిన 'జీవించే హక్కు'ను, అదే అధికరణలో పేర్కొన్న 'ప్రొసీజర్ ఎస్టాబ్లిష్డ్ బై లా' ద్వారా నియంత్రించదగ్గ, నిరాకరించదగ్గ హక్కు అని స్పష్టంచేసింది (ఎమర్జెన్సీ సమయంలో, దేశ పౌరులకు 'జీవించే హక్కు'ను నిరాకరించేందుకు ప్రభుత్వానికి అధికారమున్నదని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది!). మేనకా గాంధీ కేసు విచారణ సమయంలో రాజ్యాంగ రచనలో మన న్యాయ కోవిదులు ఆర్టికల్ 21ని యు.ఎస్. రాజ్యాంగంలో పొందుపరచిన 'డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా' ను కాకుండా, జపాన్ రాజ్యాంగంలో పొందుపరిచిన 'ప్రొసీజర్ ఎస్టాబ్లిషెడ్ బై లా' ను స్వీకరించటానికి గల అప్పటి పరిస్థితులను ధర్మాసనం లోతుగా అధ్యయనం చేసింది. 'డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా' ప్రకారం చట్టసభలు చేసే చట్టాలు న్యాయ సమీక్షను ఎదుర్కొని నిలబడవలసి ఉంటుందని, తద్వారా న్యాయస్థానాల ప్రమేయం చట్ట సభలపై అధికంగా ఉంటుందని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి సంపూర్ణత చేకూర్చదని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడ్డ చట్ట సభలు చేసే చట్టాలు అమలులోకి రాకముందే న్యాయసమీక్షను ఎదుర్కోవటం కన్నా, చట్ట సభలకు ప్రాధాన్యం కల్పించే ఉద్దేశ్యంతో 'ప్రొసీజర్ ఎస్టాబ్లిషెడ్ బై లా' అనే పదాన్ని ఆర్టికల్ 21లో పొందుపరిచినట్లు గౌరవనీయ న్యాయమూర్తులు నిర్ధారించారు. 'ప్రొసీజర్ ఎస్టాబ్లిషెడ్ బై లా' లోని 'లా' అనే పదం తప్పనిసరిగా రాగద్వేషాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా, ధర్మబద్ధంగా, శాస్త్రీయంగా వుండి తీరాలని పేర్కొన్నారు. ఈ తీర్పు తర్వాత 'ప్రొసీజర్ ఎస్టాబ్లిషెడ్ బై లా' అనే పదం 'డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా'కు పర్యాయ పదంగా మారింది. 'ప్రొసీజర్ ఎస్టాబ్లిషెడ్ బై లా' అనే మాటకు ప్రభుత్వాలు వారి వారి అవసరార్థం తమకు అనుకూలంగా, ఎంతటి బలహీనమైన నిర్వచనాన్ని ఇస్తాయో, ఇష్టానుసారం ఎలా దుర్వినియోగ పరచుకుంటాయో తెలిపేందుకు ఈ కేసు చక్కని ఉదాహరణ అని మేనక కేసు తీర్పులో వారు పేర్కొన్నారు. ఎ.కె. గోపాలన్ కేసులో మైనారిటీ తీర్పు ఇచ్చిన ఫజల్ అలీ తీర్పును ఈ కేసు తీర్ప లో అంగీకరిస్తూ, మెజార్టీ తీర్పును ఓవర్ రూల్ చేసింది. శివకాంత్ శుక్ల కేసులో మైనారిటీ తీర్పు ఇచ్చిన జస్టిస్ హన్సరాజ్ ఖన్నా తీర్పు కూడా పరిశీలించటం జరిగింది. ఆర్టికల్ 19 డి లో పేర్కొన్న ఫ్రీడం ఆఫ్ మూమెంట్ లో విదేశీ ప్రయాణం ఉన్నదా? ఆర్టికల్ 21లో వున్న వ్యక్తిగత స్వేచ్ఛతో జీవించే హక్కులో విదేశీ యానం కూడా ఉన్నదా? ఉంటే, సదరు హక్కులపై ప్రభుత్వ నియంత్రణ ఎంతవరకు ఏయే సందర్భాలలో సమర్థనీయం అనే అంశాలను పరిశీలించారు. రాజ్యాంగంలోని ప్రతి ప్రాథమిక హక్కు ప్రత్యేకమైనదని, ఒక ఆర్టికల్‌లో పేర్కొన్న హక్కుకు, మరొక ఆర్టికల్‌లో పేర్కొన్న హక్కుకు ఎట్టి పరస్పర సంబంధాలు లేవని, దేనికి దానికే ఒక ద్వీపంలాంటివి అని ఎ.కె.గోపాలన్ కేసులో చెప్పిన నిర్వచనం అశాస్త్రీయమైనదని, ఆర్టికల్ 14, 21, 19లలో పొందుపరచిన హక్కులన్నీ సామరస్య పూర్వక సంబంధాన్ని (హార్మోనియస్ రిలేషన్) కలిగి వుంటాయని అంటూ, వీటిని 'గోల్డెన్ ట్రై యాంగిల్' గా మేనకా గాంధీ కేసు తీర్పులో అభివర్ణించారు. మేనక కేసులో పాస్‌పోర్ట్‌ను రద్దు చేయటానికి గల కారణాలను కోరినప్పటికీ తెలుపక పోవటం ఖచ్చితంగా సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని, పిటిషనర్ ఆ విధంగా కోరకపోతే నిజాలు తెలిసేవి కావని పేర్కొంటూ మేనకా గాంధీ పోరాటస్ఫూర్తిని సుప్రీంకోర్టు ధర్మాసనం కొనియాడింది. జైళ్లలో జీవించే ఖైదీల జీవన ప్రమాణాల గురించి, మహిళా ఖైదీల దీనస్థితి గురించి దాఖలైన కేసులలో సైతం ఈ తీర్పు ఒక దిక్సూచి అయ్యింది. పర్యావరణ పరిరక్షణ, జీవన ప్రమాణాల మెరుగుదల, రహదారుల మెరుగుదల, నదుల ప్రక్షాళన, సత్వర వైద్యం, వ్యక్తిగత గోప్యత, వేగవంతమైన కేసుల విచారణ వంటి అనేకానేక కేసులు నిర్ధారించే సమయాల్లో అత్యధికంగా కనీసం 215 పైగా కేసులలో సుప్రీం కోర్టు ఈ తీర్పును ఉదహరించింది.



'మేనకా గాంధీ వెర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో జీవించే హక్కుపై సుప్రీంకోర్టు నాలుగు దశాబ్దాల క్రితం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనది. ఖైదీల జీవన ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ, నదుల ప్రక్షాళన, సత్వర వైద్యం, వ్యక్తిగత గోప్యత మొదలైన అంశాలలో న్యాయ నిర్ణయాలకు ఆ తీర్పు స్ఫూర్తిదాయకంగా ఉన్నది.

■ వడ్డి జితేంద్రమోహన్ లోహియా

సీట్ల సుడిలో ఉన్నత విద్య!

రాజ్యాంగ (103వ సవరణ) చట్టం 2019 నిర్దేశించిన విధంగా అగ్రవర్ణాల వారిలో ఆర్థికంగా వెనుకబడినవారికి ప్రభుత్వోద్యోగాలు, ఉన్నత విద్యా సంస్థలలో 10 శాతం రిజర్వేషన్లను అమలుపరచనున్నట్టు కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఈ నెల 14న ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ అనంతరం మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ఒక ప్రకటన చేస్తూ 2019–20 విద్యా సంవత్సరం నుంచే అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ విద్యా సంస్థలతో సహా ఉన్నత విద్యా సంస్థలన్నిటిలోనూ సీట్ల సంఖ్యను 25 శాతం పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని వెల్లడించారు. 103వ రాజ్యాంగ సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటీషన్లు దేశ సర్వోన్నత న్యాయస్థానం విచారణలో ఉన్నాయి. అంతేగాక అగ్ర వర్ణాల పేదలకు పది శాతం రిజర్వేషన్ల రాజ్యాంగ సక్రమతను న్యాయసమీక్షలో ఇంకా నిర్ధారించవలసివుండగా ఉన్నత విద్యా సంస్థల్లో సీట్ల పెంపుదలపై ప్రభుత్వ నిర్ణయం వెలువడింది.

ఈ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్ణయం బాగా ఆలోచించి తీసుకున్నదేనా? ఈ నిర్ణయాన్ని అమలుపరచడంలో ఎదురయ్యే సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండానే హడావుడిగా ప్రకటించినదని చెప్పక తప్పదు. ఉన్నత విద్యా సంస్థల అడ్మిషన్లలో ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్ కోటాకు, కొత్తగా అమలవనున్న పది శాతం కోటా ఎటువంటి హాని చేయదని మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావదేకర్ సమర్థించారు. కొత్త రిజర్వేషన్ల వల్ల షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు, ఇతర వెనుకబడిన వర్గాల వారి ప్రయోజనాలు ఏమాత్రం దెబ్బతినవని జావదేకర్ స్పష్టం చేశారు. నిజమేనా? గౌరవనీయ మంత్రి మాట తప్పుదోవ పట్టించేవిధంగా ఉన్నది సుమా! 100 సీట్లలో 10 సీట్లను జనరల్ కేటగిరీ (అగ్రవర్ణాలవారు) కి చెందిన పేదలకు ఇస్తే, ఆ కేటాయింపు ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్ల కోటాకు ఎలా హాని చేస్తుంది? ప్రశ్న సరళంగానే ఉన్నప్పటికీ సమంజసమైన సమాధానమివ్వడం అంత సులువు కాదు. అసలు ఉన్నత విద్యా సంస్థలలో సీట్ల సంఖ్యను అంత అధికంగా పెంచవలసిన అవసరమేమిటి? పది శాతం కొత్త రిజర్వేషన్లు అమలులో ఎంత కష్టమో, ఆ నిర్ణయం పర్యవసానాలు ఎంత సంక్లిష్టంగా ఉండగలవో జావదేకర్ మహాశయుడు అర్థం చేసుకున్నారా? ఉన్నత విద్యా సంస్థలలో పది శాతం రిజర్వేషన్లను అమలుపరచడానికిగాను పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో ఒక బిల్లును ప్రవేశపెట్టేందుకు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సమాయత్తమవుతోంది. కేంద్రీయ విశ్వ విద్యాలయాలవరకు, ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా ఈ కొత్త రిజర్వేషన్లను అమలు పరుస్తారు.

దేశవ్యాప్తంగా 40,000కిపైగా కళాశాలలు, 900 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఈ ఉన్నత విద్యా సంస్థలలో ఏటా మొత్తం 370 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్నారు. వీరిలో 9.28 లక్షల మందికి ఐఐటిలు, ఎన్ఐటిలు, ఐఐఎమ్‌లతో సహా కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో అడ్మిషన్లు లభిస్తున్నాయి. ఇప్పుడు పది శాతం కొత్త రిజర్వేషన్ల అమలుకు 25 శాతం సీట్ల పెంపుదలతో కేంద్రీయ విశ్వద్యాలయాలలో ఏటా అదనంగా 3.3 మిలియన్ సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇంకా రాష్ట్ర ప్రభుత్వాల విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు ఉండనే ఉన్నాయి. ఉన్నత విద్యను కోరుకునే వారందరికీ ఎక్కడో ఒక చోట అడ్మిషన్ లభించే అవకాశం ఇతోధికంగా పెరిగింది. మరి ఉత్కృష్ట బోధనా నైపుణ్యాలు, పరిశోధనా ప్రతిభాపాటవాలు ఉన్న అధ్యాపకుల మాటేమిటి? మన ఉన్నత విద్యారంగంలో ఇటువంటి బోధకుల కొరత తీవ్రంగా ఉందనేది ఒక కఠోర వాస్తవం. కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో 5600కి పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఐఐటిలు, ఎన్ఐటిలు, ఐఐఎమ్‌లు ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో సైతం భర్తీ కాని అధ్యాపక పోస్టుల సంఖ్య వేలల్లోనే ఉన్నది. ఒక్క ఐఐటీలలోనే 2800 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉత్కృష్ట అర్హతలు గల అభ్యర్థులు లభ్యం కాకపోవడం వల్ల, బోధనా వృత్తిలో యువ పట్టభద్రులు ఆసక్తి చూపని కారణంగా అధ్యాపకులను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించడం జరుగుతోంది. ఈ అధ్యాపక పోస్టులను అర్హులైన వారితో భర్తీ చేసేందుకు ప్రాధాన్యాన్ని ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.



2019–20 విద్యా సంవత్సరం నుంచే అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ విద్యా సంస్థలతో సహా ఉన్నత విద్యా సంస్థలన్నిటిలోనూ సీట్ల సంఖ్య 25 శాతం పెరగనున్నది. ఈ నిర్ణయం తీసుకునే ముందు, సీట్ల పెంపుదల మోపే ఆర్థిక భారపు పర్యవసానాలను అధ్యయనం చేశారా? ప్రైవేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజులను చెల్లించలేని విద్యార్థులను ఆదుకునేది ఎవరు? మన ఉన్నత విద్యారంగం రాబోయే రోజుల్లో సంక్షోభంలోకి పయనించనున్నది.

మరి ఉన్నతావిద్యావకాశాలు గణనీయంగా మెరుగుపడుతున్న దృష్ట్యా ఆ విద్యాధికులకు సరిపడా ఉద్యోగావకాశాలూ పెరుగుతాయా? ఉద్యోగాలలో రిజర్వేషన్ల విషయానికి వస్తే మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖే వివిధ కేటగిరీల వారికి రిజర్వ్ చేసిన పోస్టులను భర్తీ చేయలేకపోయింది. కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం గ్రూప్‌ఎ, బి స్థాయిలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు, ఇతర వెనుకబడిన వర్గాల వారి ప్రాతినిధ్యం ఉండవలసిన దానికంటే తక్కువగా ఉందనేది ఎవరూ కాదనలేని సత్యం. ఉన్నత విద్యాసంస్థల బోధనేతర సిబ్బందిలో సైతం పైన పేర్కొన్న మూడు వర్గాల వారికి వరుసగా 8.96 శాతం, 4.24 శాతం, 10.17 శాతం ప్రాతినిధ్యం మాత్రమే ఉన్నది. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలోనూ, దాని ఆధ్వర్యంలోని వివిధ సంస్థలలోను గ్రూప్ ఎ, బి స్థాయి అధికారులు 665 మంది ఉండగా వారిలో 440 మంది (66.17 శాతం) జనరల్ కేటగిరీ (అగ్రవర్ణాలవారు) కి చెందినవారేకావడం గమనార్హం. రైల్వే శాఖలో సైతం దాదాపు 70 శాతం ఉద్యోగాలు నాన్‌రిజర్వడ్ కేటగిరీల అభ్యర్థులతోనే భర్తీ అవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్థికంగా వెనుకబడినవర్గాల వారికి అంటూ కొత్త రిజర్వేషన్లను ప్రవేశపెట్టడమెందుకు? ఎందుకీ గందరగోళం? ఏ ప్రయోజనాన్ని ఆశించి, ఎవరి లబ్ధికి ఈ నిర్ణయం తీసుకున్నారు? విద్యారంగ భవిష్యత్తుతో ఇలా ఆటలాడుకోవడం గర్హనీయం.

విద్యాసంస్థలకు ఇప్పటికే విద్యార్థులు వెల్లువెత్తుతున్నారు. తరగతిగదులు కిక్కిరిసిపోతున్నాయి. ఇద్దరు కూర్చోవలసిన బెంచీపై ముగ్గురు లేదా నలుగురు కూర్చోవడం జరుగుతోంది. ముంబై విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలు ప్రస్తుతం ఒక్కో విభాగంలో 100 మందికి పైగా విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నాయి. మరి ఇంకా 25 శాతం సీట్ల పెంపుదలతో పరిస్థితి ఏమిటి? ఇది, విద్యా సంస్థల్లో ఒక ఉపద్రవాన్నే సృష్టిస్తుందనడంలో సందేహం లేదు. తరగతి గదులు మరింతగా కిక్కిరిసిపోవడం ఖాయం. సరైన సదుపాయాలు లేక సతమతమవుతోన్న విద్యాలయాలు అదనపు విద్యార్థుల రాకతో ఎదురయ్యే సమస్యలను తట్టుకోగలుగుతాయా? అనివార్యంగా అధ్యాపకులపై పని భారం విపరీతంగా పెరుగుతుంది. ఇప్పటికే విద్యార్థుల ఉపాధ్యాయుల నిష్పత్తి ఉండవలసిన రీతిలో లేదు. సీట్ల పెంపుదలతో ఈ నిష్పత్తిలో అంతరం మరింతగా పెరిగిపోతుంది. ఇటువంటి ప్రతికూల పరిణామాలతో బోధనా ప్రమాణాలు ఇంకా దిగజారిపోతాయి.

మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఒక జాతీయ విద్యా విధానం రూపకల్పనకు కృషి చేస్తున్న దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వసతుల కొరత తదితర సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఇది ఎంతైనా ముఖ్యం. గ్రామీణ భారతదేశంలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నది. 'ప్రథమ్' అనే ప్రభుత్వేతర సంస్థ తాజా నివేదిక ప్రకారం ప్రతి నలుగురు గ్రామీణ బాలల్లో ఒకరు ప్రాథమిక పఠన కౌశలాలు లేకుండానే ఎనిమిదవ తరగతితో చదువుకు స్వస్తి చెపుతున్నాడు. ఐదవ తరగతిలో వున్న బాలల్లో కేవలం సగం మంది మాత్రమే 2 వ తరగతి స్థాయి పాఠ్యగ్రంథాన్ని చదవగలుగుతున్నారు! ఎనిమిదవ తరగతి బాలల్లో 56 శాతం మంది ఒక ప్రాథమిక తీసివేత సమస్యను పరిష్కరించలేకపోతున్నాడని 'ప్రథమ్' తాజా నివేదిక పేర్కొంది. తెలంగాణ మొదలైన రాష్ట్రాలలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు కనీస వసతులు, సదుపాయాలు లేకుండానే నడుస్తున్నాయి. టాయ్‌లెట్స్ ఉండవు; ఉన్నా వాటిలో నీటివసతి ఉండదు. కంప్యూటర్ ల్యాబ్స్ ఉండవు; ఉన్నా బోధకులు ఉండరు. గ్రంథాలయాలు ఉండవు. ఉన్నా సహాయకులు ఎవరూ ఉండరు. స్వీపర్ పోస్టు సైతం మంజూరు కాని పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. ఈ గ్రామీణ పాఠశాలలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యం బోధనా ప్రమాణాలను, బాలల విద్యాభ్యాసాన్ని గణనీయంగా దెబ్బతీస్తోంది.

ప్రస్తుత పాలకుల విధాన నిర్ణయాలు చాలా అసమంజసంగా ఉంటున్నాయి. విద్యారంగ వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని రూపొందిస్తున్న నిర్ణయాలు కావవి. ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల పెంపుదల నిర్ణయమే ఇందు కొక ఉదాహరణ. సీట్ల పెంపుదల మోపే ఆర్థిక భారపు పర్యవసానాలను అధ్యయనం చేశారా? మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ మౌనం వహించింది. ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థలలో అధిక ఫీజులను చెల్లించలేని విద్యార్థుల విషయమేమిటి? వారిని ఆదుకునేది ఎవరు? మన ఉన్నత విద్యారంగం రాబోయే రోజుల్లో సంక్షోభంలోకి పయనించనున్నది.

■ జి.రామచంద్రం
ముంబై విశ్వవిద్యాలయం

జనవాక్యం

ట్యాంపరింగ్ దుమారం

ఈవీఎం మిషన్ల పై పెద్ద దుమారమే చెలరేగుతోంది. చాలా మంది రాజకీయ నాయకులు ఈవీఎంల వినియోగంపై ఇప్పటికే పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అమెరికా సైబర్ నిపుణుడు సయ్యద్ షుజా చేసిన వ్యాఖ్యలు ఈ వాదనలకు ఊతం ఇచ్చాయి. విజ్ఞానం ఓ పక్క సౌకర్యాలు పెంచుతూనే మరో పక్క సమస్యలను కూడా తెస్తున్నది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా దుర్వినియోగపరుస్తున్నారో పరిశీలిస్తే ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యమేమీ కాదని అనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో వీటిని వినియోగించడంలేదు. 20 దేశాలలో మాత్రమే వాడుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని యంత్రాలపై ఆధారపడేలాచేయడం సమంజసం కాదంటూ చంద్రబాబు నాయుడు, మాయావతి ఇత్యాదులు బ్యాలెట్ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా పోరాడతామని అంటున్నారు. ఈవీఎంలపై అనుమానాల దృష్ట్యా వచ్చే ఎన్నికలలో బ్యాలెట్‌నే వినియోగించాలని 22 బీజేపీయేతర పార్టీల ప్రతినిధులు త్వరలో ఎన్నికల సంఘాన్ని కోరనున్నాయి. ఈవీఎంలపై ఇన్ని అనుమానాలు, ఇంత దుమారం రేగుతున్న సమయంలో ఎన్నికల సంఘం ఈ వాదనను కొట్టిపారేయకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా బ్యాలెట్ల అంశాన్ని బాధ్యతతో పరిశీలించడం అవసరం.

– **శిరందాసు నాగార్జున,** విజయవాడ

బ్యాక్ టు బ్యాలెట్ సరికాదు


ఎన్నికలసంఘం తిరిగి బ్యాలెట్‌కు పోనవసరం లేదు కానీ, వివిధ పార్టీల అనుమానాల నివృత్తికోసం కొన్ని నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి. విదేశాల్లో మాదిరిగా మనదేశంలో ప్రైవేటు సంస్థలు ఈవీఎంలను తయారు చేయడంలేదనీ, ప్రభుత్వ రంగ సంస్థలైన ఈసీఐఎల్, బీఈఎల్‌లో తయారవుతాయి కనుక అనుమానాలు అక్కరలేదని ఎన్నికల సంఘం గతంలోనే ప్రకటించింది. అలాగే, మనదేశ ఈవీఎంలో ఉపయోగించే చిప్ ఒక్కసారి మాత్రమే ప్రోగ్రామ్ అవుతుందనీ, తిరిగి చేయడం సాధ్యం కాదని కూడా అంటున్నది. ఇక రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో వివిధస్థాయిల్లో ఈవీఎంల సమర్థతపై తొలిదశ పరీక్షలు జరుపుతారనీ, కొన్ని ఈవీఎంలను ఎంచుకొని వాటిపై ప్రయోగాత్మకంగా ఓటింగ్ పరీక్ష కూడా చేస్తారని కూడా వివిధ విశ్లేషణలు చెబుతున్నాయి. కానీ, షుజా ఆరోపణల నేపథ్యంలో ఈవీఎంల సాంకేతికతపై కొత్త అనుమానాలు రేగాయి. అందువల్ల ఈవీఎంలను వ్యతిరేకిస్తున్న అన్ని పార్టీల తరఫునా అవి ఎంపిక చేసుకున్న సాంకేతిక నిపుణులను ఎన్నికల సంఘం ఢిల్లీ ఆహ్వానించి, వారికి పెద్ద సంఖ్యలో మెషీన్లను సమకూర్చి తమకు నచ్చిన రీతిలో వాటిపై పరీక్షలు జరిపి అనుమానాలను నివృత్తి చేసుకోవలసిందిగా ప్రకటించాలి. సార్వత్రిక ఎన్నికల్లోగా ఈ తుది పరీక్ష ఒక సవాలుగా కాక, సమష్టిగా జరగడం అవసరం. అధికార పార్టీ సమర్థిస్తున్నందు వల్లనో, అనేక పార్టీలు వ్యతిరేకిస్తున్నందునో ఈవీఎంలపై నిర్ణయాలు తీసుకోవడం సరికాదు.

– **ఎస్.కె.ఆనందమోహన్,** హైదరాబాద్

నాయనే ఆయన!

సామాన్యుడి వీలునామా/ దీని కింద సంతకం లేదు/ ఆస్తిపాస్తులు నేనేమీ సంపాదించలేదు/ వజ్రాలను పంచడం లేదు/ వారసత్వపు దావాల్లోకి మిమ్మల్ని దించడమూ లేదు...

■ తెలకపల్లి రవి



గమనం

యాభై ఏళ్ల కిందట బడి పిల్లాడిగా సభల్లో నేను చదివిన ఈ కవిత 'శ్రీశ్రీ యుగం' సంకలనంలోది. దాన్ని నేర్పించి చదివింప చేసిన వ్యక్తి మా నాయన నరసింహయ్య. ఆ సామాన్యుడు ఆయనేనని, నిజానికి అసామాన్యుడనీ అంతకంతకూ తెలుసుకుంటూ వచ్చాను. దాదాపు దశాబ్దిన్నర పైగా సాగుతూ వస్తున్న 'గమనం' శీర్షికలో ప్రతి వ్యాసమూ చదివి స్పందించిన ఆ ఏకైక పాఠకుడు ఈ సారి చదవడానికి లేరు!

గత శుక్రవారం కన్నుమూసిన తెలకపల్లి నరసింహయ్య గురించి అనేక ఛానళ్లు ఆంధ్రజ్యోతితో సహా పత్రికలూ సమాచారమిచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, సీతారాం ఏచూరి సహా నివాళులర్పించారు. టి.నరసింహయ్య(టిఎన్)గా దీర్ఘకాలంగా పరిచయమమైన నాకు నీ వల్ల ఇంటిపేరు తగిలిస్తున్నారని సున్నితంగా అనడం ఆయన వ్యక్తిత్వ దర్పణమే. కులగోత్రాలు, వంశనామాలు, వర్ణ వ్యత్యాసాలు పాటించక ప్రజలతో మమేకమైన శ్రామిక వర్గ యోధుల తరానికి ఒక ప్రతినిధిగానే ఆయన గురించి చెప్పుకోవడం. వందలాది మంది యువతకు జీవించడమూ పోరాడ్డమూ నేర్పిన ఆయన ఆఖరి చూపు కోసం కవి, గాయక మిత్రుడు గోరటి వెంకన్న మొదటిసారిగా తనే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ హైదరాబాద్ నుంచి కర్నూలు వచ్చానన్నారు. మా ఇంట్లో తొలిగా రాజకీయ తరగతులకు హాజరైన జ్ఞాపకాలు తలుచుకున్నారు. నాన్న చితి రగులుతుండగా ఒక డిప్యూటీ కలెక్టరు ఎక్కడి నుంచో పరుగున వచ్చి తనూ ఒక కర్ర వేసి నివాళులర్పించారు. పాలక పక్షాల్లోకి మారిపోయిన లేదా వృత్తి ఉద్యోగాలలో స్థిరపడిన ఎందరో ఆ రోజున తమపై ఆయన ప్రగాఢ ప్రభావం చెప్పి ప్రణమిల్లారు. అక్కడ చూసిన వందలాది ఉదాహరణల్లో ఇవి కొన్ని మాత్రమే. నా ఒత్తిడితో నాయన రాసిన ఆత్మకథకు ముందుమాటలో బి.వి.రాఘవులు అన్న ఈ మాటలు అందరిలో కదలాడిన స్ఫూర్తికి ప్రతిధ్వనులు. "...1970, 80 దశకాలలో అనేక ప్రతికూలతల మధ్య.. పిల్లల కోడి రెక్కల మాటున దాచుకుంటూ పిల్లలను ఎలా పెంచి పెద్ద చేస్తుందో అలా నరసింహయ్య గారు విద్యార్థులు యువకుల నుంచి కార్యకర్తలను అభివృద్ధి చేశారు. ఆయన సౌమ్యత, ఓపిక, నిలకడ, నచ్చజెప్పే సామర్థ్యం, ధీరత్వం, నిరాడంబరత, కార్యకర్తలందరికీ ఆదర్శం. తారాజువ్వలు బుస్సుమని ఎగిరి మిరుమిట్లు గొలిపి క్షణంలో మళ్లీ పతనం అయిపోతాయి. దీపం నిలకడగా నిరంతరం వెలుగునిస్తూనే వుంటుంది. అలాటి దీపమే నరసింహయ్యగారు."

కర్నూలు పక్కనే వుండే గార్గేయపురంలో 1928లో సంపన్న సనాతన కుటుంబంలో పుట్టిన నాయన 1949లో అంటే 70ఏళ్ల కిందట కమ్యూనిస్టుగా మారారు. తొలుత కాంగ్రెస్ వాదిగా మొదలై స్వీయానుభవాలకు తోడు కమ్యూనిస్టు గ్రామమైన వేంపెంటకు చెందిన మా అమ్మ టి.సి. లక్ష్మమ్మ ప్రేరణతో ఎర్ర జెండా చేతబట్టారు. ఇద్దరూ సహచరులతో కలసి కుటుంబ నేపథ్యానికి భిన్నంగా వ్యవసాయ కార్మికులలో పనిచేస్తూ దళితవాడలలో పత్రిక చదివి వినిపిస్తూ సమ్మెలు పోరాటాలు చేయిస్తూ ఉద్యమాన్ని పెంపొందించారు. 1954లో ఆ వూళ్లో భూస్వాముల కాల్పులు తీవ్ర సంచలనం సృష్టించి పార్లమెంటును తాకాయి. ఎకెగోపాలన్, సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి వంటి అతిరథ మహారథులు తరలి వచ్చారు. వారందరికీ మా నాయనమ్మ ఆతిథ్యమిచ్చేవారు. చట్టుపక్కల మొత్తం వైద్యుడుగా పేరు పొందిన మా తాతయ్య బహుముఖ బాధ్యతలతో వూరికి తలలో నాలుకగా వుండేవారు. పిల్లలు కొత్త మార్గం తొక్కడంపై విసుక్కున్నా ఎప్పుడూ అడ్డుపడ లేదు. సరికదా ఆర్థికంగా ఆదుకుంటూ వచ్చారు. అమ్మ ఉద్యమంలో సమరశీలపాత్ర వహిస్తూనే కుటుంబం నడవడానికి మిషను కుట్టడం, పాలు పోయడం చేస్తుంటే అన్నదమ్ములం ముగ్గురం తోడ్పడటం. మా మేనత్త అకాల మరణం వల్ల తన పిల్లలు ఆరుగురితో పాటు మరికొందరినికూడా అమ్మ దగ్గరపెట్టుకుంది. యాభైలలో చంద్ర రాజేశ్వరరావు ఇంట్లో మహిళా తరగతులకు హాజరైంది మొదలు ఆఖరు వరకూ ఆమె ఎక్కడ అన్యాయం, అత్యాచారం జరిగినా వెళ్లి పోరాడేది. అందరికీ అమ్మలా నిలిచిన ధీర వనిత. 2015లో అమ్మ చనిపోయినప్పుడు ప్రతివారూ తాము ఆమె వల్ల సహాయం సాంత్వనం పొందిన ఘట్టాలు చెబుతుంటే మాకే ఆశ్చర్యం వేసింది. ఈ ఏడు దశాబ్దాలలోనూ అనారోగ్యాలు, జైలు జీవితాలు, అజ్ఞాతవాసాలు, నిర్బంధాలు, ఆర్థిక సమస్యలూ, కుటుంబ బాధలూ, రాజకీయ సైద్ధాంతిక సవాళ్లు ఎన్నెన్నో చూశారు గాని అమ్మ నాయన ఆశయాలను వదలిపెట్టలేదు. మేమిద్దరం రాష్ట్ర కమిటీలో కలసి వుండటం ఒక అరుదైన అనుభవం మాకూ, ఉద్యమానికీ కూడా. మా అన్ననూ తమ్ముడిని ఇతర పిల్లలనూ కూడా అలాగే వెన్నంటి నడిపించారు. అన్నయ్య కారణంగా తర్వాత ఆర్థిక పరిస్థితి మెరుగై అన్నీ అమరినా ఆలోచనలు మారింది లేదు.

నాయన రాజకీయ అర్థశాస్త్ర బోధనలో దిట్టగా పేరొందారు. అప్పటికే పాఠాలు తీసుకుంటున్న నాయన 1966లో ముషీరాబాద్ జైలులో తరిమెల నాగిరెడ్డి సలహాలు కోరగా ఆయన సుందరయ్య దగ్గరకు తీసుకుపోతే ప్రామాణికమైన అర్థశాస్త్ర గ్రంథం ఇచ్చారు. దాన్ని చూసి నోట్సు రాసుకుని మరింత మెరుగు పెట్టుకున్నారు. తను పెద్ద డిగ్రీలు చదవకపోయినా జైలులో కీ.శే. ఓంకార్ వంటి వారికి ఆయన ఇంగ్లీషు నేర్పారు. నేనైతే పద్యాలు గేయాలు ఉపన్యాసాలు సినిమాలు అన్నీ తన దగ్గరే తొలి శిక్షణ. యూట్యూబులు లేని ఆ రోజుల్లో ఒకసారి పరీక్షల మధ్యలో (సెలవు వస్తే) జయభేరికి పంపడం నాకు గుర్తు. చంద్రపుల్లారెడ్డి, మద్దుకూరి చంద్రం వంటి వారితో సహా అందరికీ మా ఇల్లే విడిది. వారు ఆస్పత్రులకు వెళ్లే సహాయంతో పాటు ఆహారం సరఫరా కూడా ఇక్కడి నుంచే. ఉత్తరోత్తరా సిపిఎం ఏర్పడ్డాక మోటూరు ఎల్‌బిజి వంటి వారితోనూ అదే అనుబంధం అగ్ర నాయకుల నుంచి అతి సామాన్యుల వరకూ ఈనాటికీ కొనసాగుతూనే వుంది. ఈ కాలం చాలా ఉద్యమాలూ పోరాటాలు చూసింది. సిపిఎం రెండు సార్లు ఎన్నికల్లో కర్నూలులో (ఎం.ఎ గఫూర్) గెలుపుతో కొండా రెడ్డి బురుజుపై ఎర్రజండా ఎగిరింది. ఈ మొత్తం ప్రస్థానంలో ఆయన ఎలాటి పదవులూ కోరింది లేదు. తళతళలు లేని ఏదైనా చెత్తపని చేయి (డూ సమ్ డర్టీ వర్క్ దట్ వుడ్ నాట్ గ్లిట్టర్) అన్న స్టాలిన్ మార్గం అనుసరించారు. వెనకబడిన రాయల సీమ ప్రాంతంలో సాగునీటి సమస్యలపై సమగ్ర అవగాహన కలిగిన నాన్న ఎన్టీఆర్ హయాంలో నదీజలాల సంఘంలో పనిచేశారు. విలేఖరులందరూ సమస్యలపై సమాచారం ఆయన దగ్గరే తీసుకునేవారు. వారంతా నాకు ఆ విషయాలు ఇప్పటికీ చెబుతుంటారు. ఆ విధంగా తన అధ్యయనం బహుముఖీనమైంది. తొంభయ్యవ పడిలో మునిమనవల తరంలోనూ ప్రతివారినీ పేరుపేరునా గుర్తు పెట్టుకుని పలకరించడం, గుర్తు పెట్టుకుని మరీ జోకులు చదివి విని కళ్లలో నీళ్లు కారేదాకా నవ్వడం, అన్ని పత్రికల్లో పజిల్సు పరిష్కరించడం తనను చివరి రోజు వరకూ సజీవంగా వుంచాయి. ఆఖరి రాత్రి కూడా తెలంగాణ, ఎపి వార్తలు నా టాక్‌షోలు విన్నాకే పడుకున్నారు.

మా అమ్మాయి పెళ్లి చూడాలని పదేపదే వెంటపడిన నాన్న రిసెప్షన్ జరిగిన రెండు వారాల్లోపే కన్ను మూయడం సంతోషం వెంట వచ్చిన విచారం అయినా కాలధర్మం. ఆ రిసెప్షన్‌కు వచ్చిన సురవరం సుధాకరరెడ్డి తను కమ్యూనిస్టు సభ్యత్వం తీసుకున్న రోజున నాన్న తాలూకా కార్యదర్శిగా వుండేవారని గుర్తు చేశారు. ఇక అదే సందర్భంలో, 93వ ఏట కళ్లు కనిపించకున్నా ఐపాడ్‌లో వార్తలు వింటున్న నాన్న అప్‌డేటింగ్‌ను కేటీఆర్ అభినందించారు.

ప్రతిదాన్నీ సంపదతో పదవులతో కొలుస్తూ పెద్దవాళ్లను ప్రత్యేకించి కమ్యూనిస్టులను గురించి తేలిగ్గా మాట్లాడేవారికి ఇలాటివి తలకెక్కక పోవచ్చు. సరిగ్గా ఆ కారణంతోనే ఇదంతా రాయాల్సి వచ్చింది. నిష్కళంకంగా నిబద్ధంగా జీవించడం బలమే తప్ప బలహీనత కాదు. స్వాతంత్ర్య పోరాటంలోనూ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ సంఘ సంస్కరణ సామాజిక విముక్తి పోరాటాలలోనూ ఎందరో మహానుభావులు నిస్వార్థంగా పనిచేయడం వల్లనే మనం ఈ నాడు ఇలా వున్నాం. స్థిరమైన పురోగామి లక్ష్యంతో సాగించే నికరమైన గమనంలో ఆటుపోట్లు వుండొచ్చు, అవయవాలు సడలొచ్చు గాని ఆశయాలు సడలకూడదన్నదే వారి జీవితాలు మనకిచ్చిన సందేశం. నాన్నకు ప్రేమతో అన్నట్టు ఆశయాలతో ఆ తరానికి స్వరానికి అందించే అరుణాంజలి ఇది. ■



స్వాతంత్ర్య పోరాటంలోనూ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ సంఘసంస్కరణ సామాజిక విముక్తి పోరాటాలలోనూ ఎందరో మహానుభావులు నిస్వార్థంగా పనిచేయడం వల్లనే మనం ఈ నాడు ఇలా వున్నాం. స్థిరమైన పురోగామి లక్ష్యంతో సాగించే నికరమైన గమనంలో ఆటుపోట్లు వుండొచ్చు, అవయవాలు సడలొచ్చు గాని ఆశయాలు సడలకూడదన్నదేవారి జీవితాలు మనకిచ్చిన సందేశం. నాన్నకు ప్రేమతో అన్నట్టు.. ఆ తరానికి స్వరానికి అందించే అరుణాంజలి ఇది.



శ్రీవారిసేవలో 'మిస్టర్ మజ్ను' జంట

'మిస్టర్ మజ్ను' చిత్రం హీరో అక్కినేని అఖిల్, హీరోయిన్ నిధి అగర్వాల్ గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో స్వామిని దర్శించుకున్న వీరికి ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

\- తిరుమల

సీఏ ఫలితాల్లో సత్తాచాటిన మాస్టర్‌మైండ్స్

▸▸ జాతీయ స్థాయిలో 8 ర్యాంకులు కైవసం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ప్రకాశ్ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 24: జాతీయ స్థాయిలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఏ ఫైనల్, సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు మరోసారి సంచలన ఫలితాలు సాధించారని అకడమిక్ అడ్వయిజర్ మట్టుపల్లి ప్రకాశ్ వెల్లడించారు. గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఏ ఫైనల్‌లో తమ విద్యార్థులు 50 లోపు 8 ర్యాంకులు , సీఏ ఫౌండేషన్‌లో 50లోపు 19 ర్యాంకులు సాధించారని వివరించారు. సీఏ ఫైనల్‌లో తమ విద్యార్థులు కె. విజయలక్ష్మి జాతీయ స్థాయిలో 4వ ర్యాంకు, ఎం. భానుప్రసాద్ 13, పి.లక్ష్మీదీపిక 22, కె. జగదీశ్వర్‌బాబు 29, కె.పూజాజైన్ 33, టి. స్పందన 44, టి. భాగ్యలక్ష్మి 47, కె. మధురిమ 49వ ర్యాంకు సాధించారని తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్ మట్టుపల్లి ప్రకాశ్, ఛైర్మన్ మట్టుపల్లి శివప్రసాద్, మట్టుపల్లి రాధామోహన్ తదితరులు అభినందించారు.

డాక్టర్ శ్రీధర్‌రెడ్డికి ప్రధాని ప్రశంసలు



శ్రీధర్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రధాని

విజయవాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరానికి చెందిన దంత వైద్యుడు, శ్రీధర్‌రెడ్డి ఓరల్ హెల్త్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఆరుమళ్ల శ్రీధర్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసలందుకున్నారు. మంగళవారం సాయంత్రం న్యూఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి బాలకల్యాణ్ పురస్కారాన్ని డాక్టర్ శ్రీధర్ అందుకున్న విషయం తెలిసిందే. జాతీయ బాలల పురస్కారాల (నేషనల్ చిల్డ్రన్ అవార్డ్స్-2018) ప్రదానోత్సవంలో శ్రీధర్‌రెడ్డితో పాటు పురస్కార గ్రహీతలంతా గురువారం ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా గత ఇరవై సంవత్సరాలుగా చిన్నారుల కోసం తాను చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి ప్రధానికి, శ్రీధర్‌రెడ్డి వివరించారు.

చంద్రబాబుకు కాపు నేతల కృతజ్ఞతలు



అమరావతి, జనవరి24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాపులకు 5శాతం రిజర్వేషన్ కల్పించినందుకు కాపు సంఘాల నేతలు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఉండవల్లిలోని ప్రజావేదికలో సీఎం చంద్రబాబును ఏపీ కాపునాడు, ఏపీ కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఈబీసీ రిజర్వేషన్లలో 5శాతం కేటాయించి, కాపులను సీఎం ఆదుకున్నారన్నారు. సీఎంను కలిసిన వారిలో ఏపీ కాపునాడు అధ్యక్షుడు పిల్లా వెంకటేశ్వరరావు, కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ కె.మురళీమోహన్, 13 జిల్లాల ప్రతినిధులు, సభ్యులు ఉన్నారు.

అమరావతికి అంధురాలి విరాళం



సీఎం చంద్రబాబుకు విరాళం అందిస్తున్న నాగేంద్రమ్మ

అమరావతి, జనవరి24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి ఓ అంధురాలు రూ.లక్ష విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేసింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడికి చెందిన గూడూరు నాగేంద్రమ్మ తనకు గ్రామంలో ఉన్న నాలుగెకరాల భూమిపై వచ్చిన ఆదాయాన్ని రాజధాని నిర్మాణానికి అందజేసింది. ఆమె గురువారం ఉండవల్లి ప్రజావేదికలో సీఎం చంద్రబాబును కలిసింది. రాజధాని నిర్మాణానికి కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి తనను చాలా బాధించిందని, రాజధానికి తన వంతు సహాయం చేయాలన్న ఉద్దేశంతో రూ.లక్ష ఇస్తున్నట్లు ఆమె తెలిపింది. చంద్రబాబు పడుతున్న కష్టాన్ని గమనించి, ఆయనకు సహాయ, సహకారాలు అందించాలని ఆమె కోరింది. ఈ సందర్భంగా తన మూడేళ్ల మనవరాలు కుమారి ధన్వి ప్రపంచ జ్ఞాపకశక్తి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని బాలికను చంద్రబాబుకు పరిచయం చేసింది. అంధురాలైన నాగేంద్రమ్మ రాజధానికి విరాళం ఇవ్వడం అభినందనీయమని ప్రశంసించిన సీఎం బాలిక ధన్వికి ఆశీస్సులు అందజేశారు.

విపత్తుల నుంచి రక్షణకు అడవుల అభివృద్ధి: రిజ్వీ

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతమున్న ఏపీలో తుపాన్లు, సునామీ తదితర ప్రకృతి విపత్తుల నుంచి రక్షణకు అడవులను అభివృద్ధి చేస్తున్నట్టు రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణాధికారి రిజ్వీ చెప్పారు. 'ఆంధ్రప్రదేశ్ అటవీ వనరుల అభివృద్ధి, సంరక్షణ -2029'పై గురువారం రాష్ట్ర అటవీశాఖ కార్యాలయంలో మేధోమథన సదస్సు జరిగింది. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో నిపుణులైన 12మంది శాస్త్రవేత్తలు హాజరై అడవుల పెంపకం, సంరక్షణపై సూచనలు చేశారు.

టీడీపీ, వైసీపీలను ఇంటికి పంపిస్తాం: మధు

ఒంగోలు (జడ్పీ) జనవరి 24: రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయడం ద్వారా టీడీపీ, వైసీపీ పార్టీలను ఇంటికి పంపిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో సీపీఎం, సీపీఐ, జనసేన ఆధ్వర్యంలో ప్రజాభేరి రాజకీయసభ గురువారం సాయంత్రం జరిగింది. తెలుగుదేశం పార్టీ దోపిడీని వైసీపీ నిలువరించడం లేదంటూ మధు విమర్శించారు. తమ పోరాటాలను చూసే పవన్‌కళ్యాణ్ తమతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చారని పేర్కొన్నారు.

ఓటర్ల సమస్యలకు యాప్‌లతో చెక్



సాధారణ పౌరులకు ఓటర్స్ హెల్ప్‌లైన్ యాప్

దివ్యాంగుల కోసం పర్సన్స్ విత్ డిజెబిలిటీ యాప్.. నేడు ఆవిష్కరించనున్న రాష్ట్ర ఎన్నికల సంఘం

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి):సరికొత్త సాంకేతిక హంగులకు భారత ఎన్నికల సంఘం పెద్దపీట వేస్తోంది. త్వరలో లోక్‌సభ, ఏపీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఓటర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెండు యాప్‌లను రూపొందించింది. వాటిని శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆవిష్కరించనుంది. సాధారణ ఓటర్ల సమస్యల పరిష్కారానికి ఓటర్స్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్, వికలాంగుల కోసం పర్సన్స్ విత్ డిజెబిలిటీ యాప్(పీడబ్ల్యూడీ)లను రూపొందించింది. ఓటర్ల నమోదు, సవరణలు, ఫిర్యాదులు, బదిలీలు ఇలా ఓటుకు సంబంధించిన అన్ని సమస్యలనూ ఈ యాప్‌ల ద్వారా ఎన్నికల సంఘానికి చేరవేయవచ్చు. పోలింగ్ స్టేషన్ వివరాలు కూడా ఈ యాప్‌లలో ఉంటాయి. గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునేలా రూపొందించారు. ఇప్పటి వరకూ ఏపీ సీఈవో, జాతీయ ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్, ఎన్నికల కమిషన్ కాల్ సెంటర్ ఫోన్, ఎస్ఎంఎస్ ద్వారా ఫిర్యాదులను ఈసీ స్వీకరించేది. ఇప్పుడు ఓటర్ల సమస్యలు మరింత సులువుగా తెలుసుకునేందుకు, పరిష్కరించేందుకు వీలుగా ఈ యాప్‌లు రూపొందించింది. చేతిలో మొబైల్ ఫోన్ ఉంటే చాలు, ఈ యాప్‌ల ద్వారా ఎన్నికలకు సంబంధించిన ఏ సమస్యనైనా నేరుగా ఈసీకి తెలియజేయొచ్చు. అలాగే, దివ్యాంగులు ఓటు నమోదు, బదిలీ, మార్పులు, చేర్పులు పీడబ్ల్యూడీ యాప్ ద్వారా చేసుకునేలా రూపొందించింది. దివ్యాంగులు ఏ పోలింగ్‌స్టేషన్‌లో ఎన్ని గంటలకు ఓటేయబోతున్నదీ ఈ యాప్ ద్వారా తెలిపితే, రవాణా సౌకర్యం కూడా ఈసీ కల్పిస్తుంది.

ఓటర్స్ హెల్ప్‌లైన్ యాప్‌లోని అప్లికేషన్లు..

ఓటరు అప్లికేషన్ ఫామ్, ఫిర్యాదుల అప్లికేషన్, ఈవీఎంల అప్లికేషన్, ఎలక్షన్ అప్లికేషన్, రిజల్ట్ అప్లికేషన్లు ఈ యాప్‌లో ఉన్నాయి. ఈ అప్లికేషన్లలో అనేక ఆప్షన్లు ఉన్నాయి.

పీడబ్ల్యూడీ యాప్‌లో ఉన్న అప్లికేషన్లు..

ఈ యాప్‌లో రిక్వెస్ట్ ఫర్ మార్కింగ్ యాజ్ పీడబ్ల్యూడీ, రిక్వెస్ట్ ఫర్ న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్, రిక్వెస్ట్ ఫర్ ట్రాన్స్‌ఫర్, రిక్వెస్ట్ ఫర్ చేంజ్, రిక్వెస్ట్ ఫర్ వీల్ ఛైర్, బూత్ లొకేటర్, రీడ్, వ్యూ ఆర్టికల్ అప్లికేషన్లు ఉన్నాయి. వాటిలో అనేక ఆప్షన్లు ఉన్నాయి.

ఓటర్ల జాబితాపై చాలా ఫిర్యాదులు

▸▸ తుది జాబితా సవరణ మా పరిధిలో లేదు

▸▸ కేంద్ర ఎన్నికల సంఘాన్ని సంప్రదిస్తున్నాం

▸▸ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి గోపాలకృష్ణ ద్వివేది

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ఓటర్ల జాబితాలో లోపాలపై చాలా ఫిర్యాదులు ఉన్నాయి. ఇప్పటికే ఓటర్ల తుది జాబితా తయారైంది. దాన్ని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) ఆమోదించింది. ఇప్పటికీ ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు వస్తున్నాయి.. తుది జాబితా అనంతరం వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఓటర్ల జాబితాలో సవరణలపై ఈసీఐని సంప్రదిస్తున్నాం' అని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి గోపాలకృష్ణ ద్వివేది చెప్పారు. తుది జాబితాలో తప్పులు సరిచేయడం తమ పరిధిలో లేదని, సెంట్రల్ సర్వర్‌లో చేయాల్సి ఉంటుందని వివరించారు. గురువారం అమరావతి సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో ఆయన చిట్‌చాట్ చేశారు. డూప్లికేట్ ఓట్లు, వయసు, చిరునామాల్లో తప్పులపై ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరించేలా అన్ని జిల్లాల్లో యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 5న బూత్‌స్థాయిలో ఓటర్లకు గుర్తింపుకార్డులు అందజేయనున్నట్టు తెలిపారు.

ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి గవర్నర్..

శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేఠ, రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పాల్గొంటారని గోపాలకృష్ణ ద్వివేది ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తగా 50 జూనియర్ కాలేజీలు

▸▸ విశాఖలో ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం: గంటా

▸▸ ఘనంగా ఇంటర్ బోర్డు స్వర్ణోత్సవాలు



ఇంటర్ బోర్డు స్వర్ణోత్సవాల్లో ప్రసంగిస్తున్న గంటా

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారని మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. దీనిపై త్వరలోనే ప్రకటన చేస్తామన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన ఇంటర్ బోర్డు స్వర్ణోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఇంటర్ బోర్డు ప్రాంతీయ డైరెక్టరేట్ కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. వ్యవస్థను మార్చే శక్తి టీచర్, విద్యార్థి, పుస్తకం, పెన్నుకు మాత్రమే ఉందని నోబెల్ గ్రహీత మలాలా చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకమని, ఉన్నతమైన స్థానానికి వెళ్లాలంటే కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇంటర్ బోర్డు కమిషనర్ బి. ఉదయలక్ష్మి మాట్లాడుతూ 1968లో ప్రారంభమైన ఇంటర్ బోర్డు దేశంలో మిగిలిన బోర్డుల కంటే మెరుగైన పనితీరు కనబరుస్తోందన్నారు. కార్యక్రమంలో అన్నదాత సుబ్రహ్మణ్యేశ్వరరావు అంత్య ప్రాసలతో చేసిన ప్రసంగం నవ్వులు పూయించింది. సంగీత, నృత్య అకాడమీ ఛైర్మన్, సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ పాటలు ఆకట్టుకున్నాయి. స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఏయూ, శ్రీకాకుళం వర్సిటీల వీసీలు ఆచార్య నాగేశ్వరరావు, రాంజీ, ఐటీ ప్రముఖుడు బీవీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఏ ఫలితాల్లో దర్జీ కుమారుడికి మొదటి ర్యాంకు

▸▸ అభినందించిన రాహుల్ గాంధీ



షాదబ్ హుస్సేన్

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీఏ తుది పరీక్ష (పాత సిలబస్) ఫలితాల్లో రాజస్థాన్‌కు చెందిన షాదబ్ హుస్సేన్ తొలి ప్రయత్నంలోనే 800 మార్కులకు గానూ 597 మార్కులు సాధించి మొదటి ర్యాంకు దక్కించుకున్నాడు. గుజరాత్‌కు చెందిన షాహిద్ హుస్సేన్ 584 మార్కులతో రెండో ర్యాంకు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన రిషబ్ శర్మ 575 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. సీఏ (చార్టర్డ్ అకౌంటెంట్) ఫైనల్, ఫౌండేషన్, సీపీటీ ఫలితాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా బుధవారం విడుదల చేసింది. తుది పరీక్షకు 1,09,016 మంది హాజరయ్యారు. ఇక తుది పరీక్ష (నూతన సిలబస్)లో రాజస్థాన్‌కు చెందిన సిద్ధాంత్ బండారి 555 మార్కులతో మొదటి ర్యాంకు సాధించగా.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రోహిత్ కుమార్ సోని 544 మార్కులతో రెండో ర్యాంకు, గుజరాత్‌కు చెందిన ఆరోరా 541 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. ఈ పరీక్షకు మొత్తం 15,503 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక ఫౌండేషన్ పరీక్షలో మధ్యప్రదేశ్‌కు చెందిన గర్విత్ జైన్ 400 మార్కులకు గానూ 374 మార్కులతో మొదటి ర్యాంకు దక్కించుకున్నాడు. హరియాణాకు చెందిన క్షితిజ్ మిట్టల్ 370 మార్కులతో రెండో ర్యాంకు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన హార్దిక్ గాంధీ 368 మార్కులతో మూడో ర్యాంకు దక్కించుకున్నాడు. ఈ పరీక్షకు మొత్తం 50,780 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక కామన్ ప్రొఫిసియెన్సీ టెస్ట్(సీపీటీ) పరీక్షకు మొత్తం 25,037 మంది విద్యార్థులు హాజరుకాగా 9,038 మంది ఉత్తీర్ణులయ్యారు. తుది పరీక్ష (పాత సిలబస్)లో మొదటి ర్యాంకు సాధించిన షాదబ్ హుస్సేన్ తండ్రి దర్జీ కాగా, తల్లి గృహిణి. నిరుపేద కుటుంబానికి చెందిన హుస్సేన్ కోటా యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేశాడు. తన తల్లిదండ్రులు ఇప్పటివరకు కష్టపడింది చాలని, ఇకపై సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతోనే రోజుకు 13 నుంచి 14 గంటలకు కష్టపడినట్లు చెప్పాడు. కాగా, తొలి ప్రయత్నంలోనే మొదటి ర్యాంకు సాధించిన షాదబ్ హుస్సేన్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అభినందించారు.

27 నుంచి బైబిల్ మిషన్ మహోత్సవాలు

పెదకాకాని, జనవరి 24 : బైబిల్ మిషన్ 81వ మహోత్సవాలను ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో బైబిల్ మిషన్ మహోత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు భారీగా చేస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు జరిగే మహోత్సవాల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని, వీరందరికీ కావాల్సిన సదుపాయాలను పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. ఇప్పటికీ 80 మహోత్సవాలు నిర్వహించి 81వ మహోత్సవం లోకి అడుగు పెడుతున్నామని తెలిపారు.

మహిళలకు న్యాయం చేసింది చంద్రబాబే: నన్నపనేని

విజయవాడ (విద్యాధరపురం), జనవరి 24: మహిళలకు న్యాయం చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబేనని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. గురువారం విజయవాడలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ మహిళలకు అన్యాయం చేస్తోందని, మహిళలకు ఉద్యోగాలు రాకుండా అడ్డుకుంటోందని అన్నారు. యువత పెడదారి పట్టడానికి సీరియల్స్ కారణమని, కేంద్ర ప్రభుత్వం టీవీ సీరియల్స్‌లో వస్తున్న విలనిజాన్ని తగ్గించాలని కోరారు.

రమణకుమారి నియామక పత్రం విడుదల

విజయవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి నియామకానికి సంబంధించిన పత్రాన్ని పీసీసీ చీఫ్ ఎన్.రఘువీరారెడ్డి గురువారం విడుదల చేశారు. ఇప్పటివరకు ఈ పదవిలో కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన సుంకర పద్మశ్రీ ఉన్నారు.

గాంధీ మెమోరియల్ సెమినార్ కమిటీ నియామకం

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ నిర్వహించే సదస్సుల్లో భాగంగా 'మహాత్మా గాంధీ మెమోరియల్ సెమినార్'కు ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు పర్యాటక, సాంస్కృతికశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి గౌరవ ఛైర్మన్‌గా ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను నియమించింది. సభ్యులుగా ప్రొ.ఎ.రఘురామరాజు, ప్రొ.ఎం.అంజిరెడ్డి, సభ్య కార్యదర్శిగా ఏపీఎస్‌సీసీ సీఈవో డి.విజయభాస్కర్‌ను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



క్లోనింగ్‌తో 5 కోతుల సృష్టి

- వ్యాధులపై పరిశోధన కోసమే
- చైనా శాస్త్రవేత్తల అరుదైన ఘనత



బీజింగ్, జనవరి 24: అప్పట్లో క్లోనింగ్ పద్ధతిలో డాలీ అనే గొర్రె పిల్ల సృష్టించిన విషయం గుర్తుందా? జన్యు రంగంలోనే గొప్ప సంచలనం అది. 1996లో చేసిన ఆ అద్భుత సృష్టితో సమూల మార్పులు సంభవించాయి. పందులు, కుక్కలు, ఎలుకలు, పిల్లులను సృష్టిస్తూ వచ్చారు. తాజాగా, చైనా శాస్త్రవేత్తలు క్లోనింగ్ పద్ధతిలో 5 కోతులను సృష్టించారు. మానవుల, కోతుల జన్యువులు ఒకేలా ఉన్నందున వ్యాధులపై పరిశోధనకు వీటిని సృష్టించినట్లు పరిశోధకులు తెలిపారు. జన్యుపరమైన జబ్బులు, కేన్సర్, అల్జీమర్స్, నిద్రలేమి, జీవక్రియ సంబంధ వ్యాధుల పరిశోధనకు ఇవి ఉపయోగపడతాయని వెల్లడించారు. క్రిస్పర్-క్యాస్9 జన్యు పరికరంతో కోతులను క్లోనింగ్ చేసినట్లు వివరించారు. కాగా, పిండ దశలో పిల్లలకు జన్యు సవరణ చేసిందుకు నైతికతను దెబ్బతీస్తున్నారంటూ హెజియాన్ కుయ్ అనే శాస్త్రవేత్త చీవాట్లు తింటున్న నేపథ్యంలో క్లోనింగ్ ద్వారా కోతుల్ని సృష్టించినట్లు చైనా శాస్త్రవేత్తలు ప్రకటించడం గమనార్హం. గతంలోనూ చైనా శాస్త్రవేత్తలు జోంగ్ జోంగ్, హువా హువా అనే కోతులను క్లోనింగ్ ద్వారా సృష్టించారు. క్లోనింగ్ ప్రక్రియపై ఏళ్లుగా పలువురు శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతూనే ఉన్నారు.

జీవం మూలాలు వేరే గ్రహానివే

- 440 కోట్ల ఏళ్ల క్రితం భూమిని ఢీకొన్న ఓ గ్రహం
- అప్పుడే భూమిలోకి ఖనిజ సంపద, జీవ పదార్థాలు
- ఆ విధ్వంసక ఘటనతోనే జాబిల్లి జననం





రైస్ వర్సిటీ శాస్త్రవేత్తల బృందం

వాషింగ్టన్, జనవరి 24: వేల రకాల జీవాలు.. లక్షల జాతుల మొక్కలు.. అమూల్య ఖనిజ సంపద పుడమి తల్లి సొంతం. భూమాత పుడుతూనే ఖనిజాలన్నింటినీ తన కడుపులో చేర్చుకుందని మనకు తెలుసు. కానీ, మనం అనుభవిస్తున్న ఖనిజాలు, మూలకాలు, జీవ పదార్థాలన్నీ భూమి సొంతంగా సంపాదించుకున్నవి కావట. కార్బన్, నైట్రోజన్, సిలికాన్.. జీవానికి కావాల్సిన ఇతర మూలకాలన్నీ వేరే గ్రహం నుంచి వచ్చినవేనట. అంగారక గ్రహ పరిమాణంలో ఉన్న ఓ గ్రహం 440 కోట్ల ఏళ్ల క్రితం భూమిని ఢీకొనడంతో అవన్నీ మన మట్టిలో చేరాయని, ఆ విధ్వంసక ఘటనతోనే చంద్రుడు పుట్టాడని అమెరికాలోని రైస్ యూనివర్సిటీకి చెందిన భారత సంతతి ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అత్యంత వేడి, ఒత్తిడితో గ్రహం లోపలి భాగంలో జరిగిన భూ రసాయన చర్యల ఆధారంగా తాము పరిశోధనలు చేశామని వెల్లడించారు. చంద్రుడు ఏర్పడే సమయంలో సౌర వ్యవస్థలో భూమితో పాటు ఇతర గ్రహాల అస్థిరత ఎక్కువగా ఉండేదని, సల్ఫర్ ఎక్కువగా కలిగిన ఆ గ్రహం ఢీకొనడంతో భూమి కేంద్ర భాగానికి తప్ప జలావరణం, వాతావరణం, భూ ఉపరితలం ఇలా.. మిగతా ప్రాంతం అంతా మూలకాలు విస్తరించాయని వెల్లడించారు. ఆ సమయంలోనే భూమి నుంచి చంద్రుడు కూడా ఏర్పడ్డాడని పేర్కొన్నారు.

'అపోలో' చెప్పిన చంద్రుడి కథ

భూమి, థియా అనే యువ గ్రహం మధ్య విధ్వంసపూరితమైన ఘర్షణ కారణంగానే చంద్రుడు ఏర్పడ్డాడని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు గతంలోనే తేల్చారు. అపోలో అంతరిక్ష యాత్రల ద్వారా చంద్రమండలం నుంచి తెచ్చిన 7 రకాల శిలల్ని పరిశోధకులు అధ్యయనం చేశారు. ఈ శిలలకు సంబంధించిన ఆక్సిజన్ అణువుల్లోని రసాయన కూర్పు.. ఘర్షణ ప్రభావాన్ని వెల్లడించిందని వివరించారు.

మాజీ మిలిటెంట్, అమర జవాన్

వనీకి 'అశోక చక్ర'

- ఉగ్రపోరులో ప్రాణాలర్పించిన ధీశాలి



న్యూఢిల్లీ, జనవరి 24: అతడు తొలుత కశ్మీరీ మిలిటెంట్. హింసతో సాధించేది ఏదీ లేదని గుర్తించి.. ఆ భావజాలాన్ని వీడాడు. సైన్యంలో చేరి మిలిటెంట్లు, ఉగ్రవాదులపై తిరగబడ్డాడు. దేశ రక్షణలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించాడు. ప్రాణాలకు తెగించి దేశం కోసం రక్తం చిందించాడు. ఉగ్రవాదుల కాల్పుల్లో అమరుడయ్యాడు లాన్స్ నాయక్ అహ్మద్ వనీ. ఆయన త్యాగ నిరతికిగాను సైన్యంలో అత్యున్నత పురస్కారం 'అశోక్ చక్ర'ను కేంద్రం ప్రకటించింది. ఈ పురస్కారాన్ని ఆయన భార్య మహాజబీన్‌కు జనవరి 26న రాష్ట్రపతి కోవింద్ అందజేయనున్నారు.

ఉగ్రవాదం నుంచి సైన్యంలోకి

కుల్గాంలోని ఆష్ముజీ ప్రాంతానికి చెందిన వనీ.. చిన్ననాటి నుంచే వేర్పాటువాద భావజాలానికి ఆకర్షితుడై మిలిటెంట్లతో చేరాడు. హింస అనేది నిరర్థక చర్య అని గుర్తించి, లొంగిపోయాడు. 2004లో కశ్మీర్‌లోని 162వ టెర్రిటోరియల్ ఆర్మీ బెటాలియన్‌లో చేరారు. దక్షిణ కశ్మీర్‌లో ఈ బెటాలియన్ నిర్వహించిన ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని ఉగ్రవాదులను అంతమొందించారు. రెండు సార్లు 'సేనా పురస్కారం' అందుకున్నారు.

తలలో, శరీరంలో బుల్లెట్లు దిగినా..

గత నవంబరు 25న హీరాపూర్ గ్రామంలో భద్రతా దళాలు ఉగ్రవాదుల ఏరివేత చర్యలు చేపట్టాయి. దళాల రాకను పసిగట్టిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. సైన్యం దీటుగా స్పందించింది. భద్రతా దళంలో సభ్యుడైన వనీ.. షోపియాన్ జిల్లా లష్కరే తాయిబా విభాగ అధిపతితో పాటు మరో విదేశీ ఉగ్రవాదిని మట్టుబెట్టారు. శరీరంలో, తలలో బుల్లెట్లు దిగినా.. పోరు కొనసాగించారు. దేశ రక్షణ కోసం చివరి వరకూ పోరాడారు.

ఆర్మీ చీఫ్ రావత్‌కు 'విశిష్ట' పురస్కారం




కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న పాకిస్థాన్‌కు భారతసైన్యం సత్తా తెలియజేస్తూనే.. చైనా సరిహద్దుల్లో శాంతి నెలకొల్పేందుకు విశేష కృషిచేస్తున్న ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ విశిష్ట పురస్కారం అందుకోనున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా 'పరమ విశిష్ట సేవా మెడల్-పీవీఎస్ఎం' అందజేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డును రావత్‌కు జనవరి 26న అందజేస్తారు. లెఫ్టినెంట్ జనరల్ భట్ 'అతి విశిష్ట సేవా మెడల్' అందుకోనున్నారు.

ఎప్పటికీ ఈవీఎంలే వాడతాం

మళ్లీ బ్యాలట్ ప్రశ్నే లేదు.. బెదిరింపులకు, ఒత్తిళ్లకు లొంగం

- సూచనలు, సలహాలివ్వండి
- గెలిస్తే 'ఎస్', ఓడితే 'నో' సరికాదు
- సీఈసీ అరోడా తీవ్ర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జనవరి 24: భవిష్యత్తు ఎన్నికల్లో ఈవీఎంనే వినియోగిస్తామని ప్రధాన ఎన్నికల అధికారి(సీఈసీ) సునీల్ అరోడా ప్రకటించారు. మళ్లీ బ్యాలట్ పద్ధతిని అమలుచేసే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. ఈవీఎంలలో అవకతవకలు, ట్యాంపరింగ్ జరుగుతున్నాయంటూ కొన్ని ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో అరోడా ఈ విషయం కరాఖండిగా చెప్పారు. గురువారం ఇక్కడ జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడారు. "బెదిరింపులకు, గద్దింపులకు భారత ఎన్నికల సంఘం భయపడదు. మళ్లీ చెపుతున్నా. ఇది నా ఒక్కడి మాట కాదు. ప్రస్తుత భవిష్యత్తు సీఈసీలు ఇదే వైఖరిని అవలంబిస్తారు. మళ్లీ బ్యాలట్‌లను ఉపయోగించే సమస్యేలేదు" అని అరోడా చెప్పారు. బ్యాలట్ పెట్టెలను దుండగులు ఎత్తుకుపోవడం, ఓట్ల లెక్కింపులో తీవ్ర జాప్యం, పోలింగ్ సిబ్బందిపై వేధింపులు వంటి ఘటనలను పునరావృతం కారాదని ఆయన అన్నారు. ఈవీఎంలకు స్వస్తి చెప్పాలంటూ ఎవరైనా బెదిరించినా, అదిలించినా, ఒత్తిళ్ల పెంచినా వినే ప్రసక్తి లేదని సునీల్ అరోడా చెప్పారు. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని, 2014 సార్వత్రిక ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ ఇటీవల ఒక సైబర్ నిపుణుడు ఆరోపించిన నేపథ్యంలో సీఈసీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈవీఎంలకు స్వస్తి చెప్పాలంటూ ఇటీవల కోల్‌కతాలో ప్రతిపక్షాలు డిమాండ్ చేసిన నేపథ్యంలో అరోడా ఈ విధంగా స్పందించారు.

పది రాష్ట్రాల్లో వినియోగం

గత ఐదేళ్లలో పది రాష్ట్రాల ఎన్నికల్లో ఈవీఎంలను విజయవంతంగా ఉపయోగించామని ఆయన తెలిపారు. ఎన్నికల్లో 'ఎక్స్'కు అనుకూలంగా ఫలితం వస్తే ఈవీఎం సరిగా పనిచేస్తున్నట్లు, 'వై'కి అనుకూలంగా వస్తే ఈవీఎంను తప్పుబట్టడం సరికాదని అరోడా అన్నారు. ఇదిలావుండగా, వచ్చే సార్వత్రిక ఎన్నికలలో బ్యాలట్ పేపర్ల ద్వారా పోలింగ్ నిర్వహించాల్సిందిగా ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఈసీని కోరారు.

గోపీనాథ్ ముండే మృతిపై లోతైన దర్యాప్తు చేయిస్తాం

ఎన్సీపీ మహారాష్ట్ర అధ్యక్షుడు జయంత్

ముంబై, జనవరి 24: గోపీనాథ్ ముండే మరణంపై ఎన్సీపీ కూటమి అధికారంలోకి వచ్చాక లోతైన దర్యాప్తు జరిపిస్తామని ఆ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ అన్నారు. ముండే మృతిపై సుజా ఆరోపణలు చేసిన నేపథ్యంలో పాటిల్ గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు. 2014లో కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వారం రోజులకే ఢిల్లీలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గోపీనాథ్ మృతి చెందారు. ఆయన మృతికి కారణమెవరో తెలుసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

కిషన్‌రెడ్డి ప్రతిష్ఠను దిగజార్చడానికే..: బీజేపీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ప్రతిష్ఠను దిగజార్చడానికే కాంగ్రెస్ పార్టీ తప్పుడు ఆరోపణలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి, కర్ణాటక ఎన్నికల ఇంచార్జి వన్నాల శ్రీరాములు మండిపడ్డారు. కిషన్‌రెడ్డిపై ఆరోపణలను పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు.

అఖిలేశ్‌పై ఈడీ నజర్?

- గోమతి ప్రాజెక్టు కేసులో బిగుస్తున్న ఉచ్చు!
- పలు రాష్ట్రాల్లో దాడులు, సోదాలు
- ఈడీ విచారణకు చంద్రకళ గైర్హాజరు



లఖ్‌నవూ, జనవరి 24: సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ చుట్టూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఉచ్చు బిగుస్తోందా? అవుననే అంటున్నాయి తాజా పరిణామాలు. గోమతి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు కేసులో ఈడీ వర్గాలు గురువారం లఖ్‌నవూ, ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్ రాష్ట్రాల్లో దాడులు చేపట్టాయి. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 15 వందల కోట్లు. ఇందులో భారీగా అవకతవకలు జరిగాయని గుర్తించిన యోగి సర్కారు 2017లో సీబీఐ విచారణకు ఆదేశించింది. అదే సంవత్సరం సీబీఐ కేసు నమోదవ్వగా.. మనీలాండరింగ్ కోణంపై ఈడీ దృష్టిసారించింది. ఈ క్రమంలోనే గురువారం దాడులు నిర్వహించింది. ఈ ప్రాజెక్టు కోసం 2013లో సీఎం హోదాలో అఖిలేశ్ 14 మందికి మైనింగ్ లీజులు కట్టబెట్టారని ఇప్పటికే సీబీఐ నిగ్గుతేల్చింది. కాగా.. మైనింగ్, మనీలాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారిణి చంద్రకళ గురువారం నాటి ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. అయితే.. ఈడీ కోరిన పలు డాక్యుమెంట్లను ఆమె తన న్యాయవాది ద్వారా పంపించారు. 2012-16 మధ్యకాలంలో జరిగిన మైనింగ్ కుంభకోణానికి సంబంధించి ఈడీ అధికారులు గురువారం మరో రెండు కేసులు నమోదు చేశారు.

ఇక దూకుడే..!


వెనకడుగు వేసే ప్రసక్తే లేదు.. మాయావతి, అఖిలేశ్‌లకు తేల్చిచెప్పిన రాహుల్

- గౌరవముందంటూ స్నేహహస్తం
- ప్రియాంక రాకతో ఎస్పీ- బీఎస్పీ వ్యూహంలో మార్పు!
- మోదీ ఓ విద్వేష చిహ్నం.. సాగనంపడం ఖాయం: రాహుల్

రాయ్‌బరేలీ, జనవరి 24 : సోదరి ప్రియాంకను అనూహ్యంగా తెరపైకి తీసుకురావడం ద్వారా ఎన్నికల పోరును రసవత్తరం చేసిన కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ ఒక్క బీజేపీకే కాక ఉత్తరప్రదేశ్‌లోని ప్రధాన ప్రాంతీయ పక్షాలైన ఎస్పీ, బీఎస్పీలకూ ఓ సవాల్ విసిరారు. "ఇక మీదట వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. గుజరాత్ ఎన్నికల్లో వెనకడుగు వెయ్యలేదు, యూపీలోనూ ఆ ప్రశ్నే లేదు" అని తేల్చిచెప్పారు. ఇది మోదీ-షాలకు ఎంత బలమైన సంకేతమో మాయావతీ, అఖిలేశ్‌లకూ అంతే పెద్ద హెచ్చరిక. అదే సమయంలో ఆయన ఎస్పీ-బీఎస్పీ పట్ల తన గౌరవాన్ని ప్రదర్శిస్తూ- "వారిద్దరూ అంటే నాకు గౌరవం. పరస్పర సహకారానికి నేను సిద్ధమే. లక్ష్యం మోదీని ఓడించడమే" అన్నారు. యూపీలో అన్ని సీట్లకూ పోటీచేస్తామని కరాఖండీగా చెప్పారు. "యూపీ అన్నింటికీ కేంద్ర బిందువు. ప్రియాంకకూ ఇది సవాల్" అన్నారాయన. అటు ప్రియాంక రాకపై ఎస్పీ బీఎస్పీలు మౌనం దాల్చాయి. కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపడమే కాక- ఆమె రాక కొన్ని వర్గాల ఓటర్లను బలంగా ప్రభావితం చేయగలదని విశ్లేషకులంటున్నారు. ముఖ్యంగా అగ్రవర్ణ ఓట్లు. పది శాతం రిజర్వేషన్‌తో ఆ వర్గానికి బీజేపీ చేరవయ్యే ప్రయత్నం చేస్తోంది. దాన్ని ప్రియాంక కౌంటర్ చేయగలరని కాంగ్రెస్ నమ్ముతోంది. ఇక బీఎస్పీకి అనుకూలంగా ఉన్న ఎస్సీ, ఎస్టీలు, ముస్లింలు ఒకప్పుడు కాంగ్రెస్‌కు విధేయంగా ఉన్నవారే. పాత ఓటుబ్యాంకును మళ్లీ తనవైపు తిప్పుకోడానికి ప్రియాంకను తురుపుముక్కగా కాంగ్రెస్ ప్రయోగిస్తోంది. యాదవులు సహా ఓబీసీలు ఎస్పీవైపు ఉన్న స్థితిలో ఆమె ఆ వర్గాలపై ఎంతమేర ప్రభావం చూపగలరన్నది ఆసక్తికరం.

మోదీపై రాహుల్ విమర్శల దాడి

ప్రధాని నరేంద్ర మోదీ విద్వేష రాజకీయాలకు చిహ్నంగా మారారని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ఆయన ప్రభుత్వాన్ని తొలగించి తీరుతామని, ఎవరూ ఈ విషయంలో తమను అడ్డుకోలేరన్నారు. గురువారం రాయ్‌బరేలీలో ఆయన పర్యటించారు. "నరేంద్రమోదీ అంటేనే విద్వేషానికి సజీవ రూపం. ఈ తరహా రాజకీయాలకు నిలువెత్తు చిహ్నం" అని రాహుల్ పేర్కొన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నట్టు దేశమంతా తిరిగి చెబుతున్న మోదీ, రాఫెల్ స్కాంపై సీబీఐ రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించగానే, ఆ సంస్థ చీఫ్ అలోక్ వర్మకు అర్ధరాత్రి వేళ ఉద్వాసన పలికారని విమర్శించారు. పెద్ద నోట్ల రద్దును.. దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణంగా రాహుల్ అభివర్ణించారు.



నానమ్మతో ఒప్పులకుప్ప!

- నలభైఏళ్ల కిందటి ప్రియాంక ఫోటో
- ఇన్‌స్టాలో షేర్ చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 24: ప్రియాంక గాంధీ వాద్రా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెడుతున్నట్లు వార్తలొస్తున్న క్షణం నుంచీ ఒక మాట పదే పదే దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. అది... ప్రియాంకకు- ఆమె నానమ్మ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి చాలా దగ్గర పోలికలున్నట్లు..! నిజానికి ఇద్దరూ పెరిగిన వాతావరణం విభిన్నమైనప్పటికీ కనుముక్కు తీరు, ముఖ కవళికలు ఇందిరను స్ఫురణకు తెస్తుండడం దీనికి కారణం. ఈ విషయాన్ని గ్రహించిన కాంగ్రెస్ గురువారం నాడు ఓ ఫోటోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. 40 ఏళ్ల కిందటి నాటిదా ఫోటో. తమ ఇంటి ఆవరణలో నానమ్మతో ఒప్పులకుప్ప ఆడుతున్న ప్రియాంక చిన్ననాటి ఫోటో అది. ఫ్యామిలీ ఆల్బమ్‌లో నుంచి ప్రత్యేకంగా తీసి మరీ షేర్ చేయడం విశేషం. "శక్తిసంపన్నులైన మహిళలు తమలా శక్తిసంపన్నులనే ప్రోత్సహిస్తారు.." అని హెడ్డింగ్ పెట్టడంతో పాటు "నానమ్మ లానే మనవరాలు కూడా..", "కుటుంబం- ప్రేమ- మహిళా సాధికారికత" అన్న ట్యాగ్‌లైన్లు కూడా పెట్టారు. ప్రియాంకలో ఇందిరను చూడవచ్చన్న సర్వజనాభిప్రాయానికి బలం చేకూర్చి- గాంధీ-నెహ్రూ కుటుంబానికి ఆదరణ ఎప్పటికీ ఉంటుందని చెప్పడమే ఈ ఫోటో పెట్టడం వెనుక ఆంతర్యమని అంటున్నారు.

రాహుల్.. ఇటలీ వెళ్లిపో!

- మా భూములు మాకు ఇచ్చేయ్
- గౌరీగంజ్‌లో రైతుల ఆందోళన

న్యూఢిల్లీ, జనవరి 24: సొంత నియోజకవర్గం అమేఠీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి చేదు అనుభవం ఎదురైంది. 'తిరిగి ఇటలీ వెళ్లిపో! ఇక్కడుండే అధికారం నీకు లేదు' అంటూ రైతులు నినదించారు. రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ కోసం లాక్కొన్న తమ భూములు తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడానికి రాహుల్ అమేఠీ వెళ్లిన సందర్భంలో.. గౌరీగంజ్ పట్టణం సమ్రాట్ సైకిల్ ఫ్యాక్టరీ సమీపంలో రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. అమేఠీలో సైకిల్ ఫ్యాక్టరీ కోసం ప్రభుత్వం 1986లో రైతుల నుంచి 65.57ఎకరాలు సేకరించి జైన్ బ్రదర్స్‌కు లీజుకిచ్చింది. ఆ తర్వాత కంపెనీ మూతపడింది. డెట్స్ రికవరీ ట్రైబ్యునల్ 2014లో రూ.20.10కోట్లకు దీన్ని వేలంవేయగా స్టాంపు డ్యూటీగా రాజీవ్‌గాంధీ చారిటబుల్ ట్రస్ట్ రూ.లక్షన్నర చెల్లించింది.

త్వరలో టోల్ ప్లాజాల మూసివేత!

- పన్ను వసూలుకు కొత్త విధానం
- వాహనాల్లో 'ఆన్-బోర్డు యూనిట్'
- ప్రయాణం ముగిశాక ఆటోమేటిగ్గా మీ అకౌంట్ నుంచి ట్యాక్స్ బదిలీ
- ఢిల్లీ - ముంబై హైవేపై అమలు



న్యూఢిల్లీ, జనవరి 24: త్వరలో జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరంలేదు. వాహనాల రద్దీతో టోల్‌గేట్ల వద్ద పడిగాపులు పడే బాధా ఉండదు. భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) దేశవ్యాప్తంగా హైవేలపై టోల్ ప్లాజాలను దశలవారీగా ఎత్తివేయాలని భావిస్తోంది. వీటి స్థానంలో టోల్ ట్యాక్స్ వసూలుకు కొత్తవిధానం ప్రవేశపెట్టనుంది. ఈ వ్యవస్థలో వాహనాల్లో 'ఆన్-బోర్డు యూనిట్ పరికరం' అమరుస్తారు. ఇది 'రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీ'తో పనిచేస్తుంది. దీని ద్వారా ప్రయాణం ముగియగానే వాహన యజమాని ఖాతా నుంచి టోల్ సొమ్ము ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. ఈ విధానాన్ని ఇప్పటికే ఢిల్లీ-ముంబై హైవేపై ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే కేంద్ర రవాణాశాఖ నుంచి టోల్ ప్లాజాల ఎత్తివేతపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో

1 నుంచే ఈడబ్ల్యూఎస్ కోటా

న్యూఢిల్లీ, జనవరి 24: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో.. ఆర్థిక బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు ఉద్దేశించిన 10% రిజర్వేషన్ వచ్చే నెల 1 నుంచి అమల్లోకి రానుంది. ఫిబ్రవరి 1న గానీ, తర్వాత గానీ నోటిఫై అయ్యే అన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఈ కోటా అమలవుతుందని కేంద్ర సిబ్బంది శాఖ గురువారం ఆదేశాలు జారీచేసింది. ఈ కోటా అమలు విధివిధానాలకు సంబంధించిన మార్గదర్శకాలను సవివరంగా ఆ తర్వాత విడుదల చేస్తామని తెలిపింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సంబంధించిన రిజర్వేషన్‌పై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మార్గదర్శకాలు విడుదల చేస్తుందని పేర్కొంది. కుటుంబాల ఆదాయం/ఆస్తుల ధ్రువీకరణ పత్రాలను రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో తహశీల్దారు ర్యాంకుకు తక్కువ గాని అధికారులు నియమ నిబంధనలకు అనుగుణంగా ధ్రువీకరించాలని స్పష్టం చేసింది.

1978 తర్వాత స్థిరపడినవారికి కోటా వర్తించదు: గుజరాత్

అహ్మదాబాద్, జనవరి 24: గుజరాతీయులకే ఈడబ్ల్యూఎస్ కోటా దక్కేలా ఆ రాష్ట్రప్రభుత్వం కీలక నిబంధన విధించింది. 1978 తర్వాత రాష్ట్రంలో స్థిరపడినవారికి ఈ కోటా వర్తించదని స్పష్టం చేసింది. కాగా.. 4 దశాబ్దాలుగా గుజరాత్‌లో నివసిస్తున్నవారికి కోటా వర్తించకపోవడం అన్యాయమని ఉత్తర భారతీయ వికాస్ పరిషత్ అధ్యక్షుడు మహేశ్‌సింగ్ కుశ్వాహ్ పేర్కొన్నారు.

గడువు పెంచేది లేదు: ట్రాయ్

న్యూఢిల్లీ, జనవరి 24: పాత కేబుల్ విధానం నుంచి కొత్త పద్ధతిలోకి మారడానికి జనవరి 31 వరకూ విధించిన గడువును పెంచేది లేదని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) గురువారం స్పష్టం చేసింది. గడువు పెంచబోతున్నట్టు వచ్చిన వార్తలన్నీ అవాస్తవాలని పేర్కొంది. గడువు పెంచడానికి సరైన కారణమేదీ కనిపించడంలేదని పునరుద్ఘాటించింది. ఇప్పటికే 40 శాతం వినియోగదారులు తమకు కావల్సిన చానెళ్లను ఎంపిక చేసుకున్నారని, జనవరి 31 నాటికి మొత్తం పూర్తి కాబోతోందని చెప్పింది.

విశ్వంలో ఇస్రో వేదిక

పీఎస్ఎల్వీ-సీ44 ప్రయోగం విజయవంతం

శ్రీహరికోట(సూళ్లూరుపేట), జనవరి 24: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రయాణంలో మరో మైలురాయి చేరింది. పీఎస్ఎల్వీ-సీ44 రాకెట్‌ను గురువారం అర్ధరాత్రి విజయవంతంగా ప్రయోగించి రోదసిలో తొలిసారిగా ఒక తాత్కాలిక వేదికను ఏర్పాటు చేసింది. మన దేశానికి చెందిన శాస్త్రవేత్తలు, విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలు చేసుకునేందుకు ఇది 6 నెలల పాటు ఉపయోగపడనుంది. ఈ రాకెట్ ద్వారా తొలుత రక్షణ రంగానికి చెందిన మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఆపై రాకెట్‌లోని నాలుగో దశను వ్యర్థంగా వదిలేయకుండా మరింత ఎత్తులోకి తీసుకెళ్లి అంతరిక్ష పరిశోధనలకు వేదికగా ఉపయోగపడేలా తీర్చిదిద్దింది. ఈ దశలో కలాంశాట్-వీ2 అనే బుల్లి ఉపగ్రహాన్ని ఉంచింది. నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్ అంతక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి గురువారం అర్ధరాత్రి 11.37 గంటలకు ఈ ప్రయోగాన్ని చేపట్టారు. డీఆర్డీవోకు చెందిన 700 కిలోల మైక్రోశాట్-ఆర్, విద్యార్థులు తయారు చేసిన 1200 గ్రాముల కలాంశాట్-వీ2ను తీసుకుని పీఎస్ఎల్వీ-సీ44 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం మొదలైన 13.30 నిమిషాలకు 277కి.మీ. ఎత్తుకు వెళ్లింది. అక్కడ రాకెట్ నాలుగో దశ నుంచి మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహం విడిపోయి.. భూమధ్య రేఖకు 96 డిగ్రీల వాలులోని సూర్యానువర్తన ధ్రువకక్ష్యలోకి చేరుకుంది. ఆపై నాలుగో దశ ఇంజన్‌ను 1.42 గంటలకు 450కి.మీ. ఎత్తుకు చేర్చారు. అంతరిక్షంలో ఒక తాత్కాలిక ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేశారు.

శత్రువుల రాడార్‌లను చిత్తు చేసే క్షిపణి

- యాంటీ రేడియేషన్ మిసైల్ పరీక్షించిన డీఆర్‌డీవో.. దూర శ్రేణి క్షిపణి ప్రయోగమూ విజయవంతం



న్యూఢిల్లీ/ఇస్లామాబాద్, జనవరి 24: భూమిపై ఉన్న శత్రువుల నిఘా, రాడార్ లక్ష్యాలను ఛేదించే కొత్తతరం యాంటీ రేడియేషన్ క్షిపణి(ఎన్‌జీఏఆర్ఎం)ని భారత్ విజయవంతంగా పరీక్షించింది. సుఖోయ్ యుద్ధ విమానం నుంచి ఈ క్షిపణిని ప్రయోగించింది. ఒడిశాలోని బాలాసోర్‌లో జనవరి 18న ఈ క్షిపణిని పరీక్షించినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. గగనతలం నుంచి ఉపరితలంపై ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగే తొలి స్వదేశీ క్షిపణి ఇదే కావడం గమనార్హం. ఈ క్షిపణి 100కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. కాగా, ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల దూరశ్రేణి క్షిపణిని డీఆర్‌డీవో గురువారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలో ఐఎన్ చెన్నై యుద్ధనౌకపై నుంచి లాంగ్ రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్(ఎల్ఆర్ఎస్ఏఎం)ను ప్రయోగించింది. ఈ ప్రయోగంలో భాగంగా తక్కువ ఎత్తులో ఎగురుతున్న లక్ష్యాన్ని ఈ క్షిపణి విజయవంతంగా ఛేదించింది. ఈ క్షిపణి ప్రయోగాన్ని భారత విజయాల్లో కీలక మైలురాయిగా రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. ఈ ప్రయోగాన్ని చేపట్టిన డీఆర్‌డీవో, భారత నేవీని ట్విటర్ వేదికగా అభినందించారు. మరోవైపు ఉపరితలం నుంచి ఉపరితలంపై లక్ష్యాలను ఛేదించగల స్వల్పశ్రేణి బాలిస్టిక్(ఖండాంతర) క్షిపణి నాసర్‌ను పాకిస్థాన్ విజయవంతంగా పరీక్షించింది.

సీబీఐ డైరెక్టర్ ఎంపిక

చర్చలు అసంపూర్ణం

న్యూఢిల్లీ జనవరి 24: సీబీఐ కొత్త డైరెక్టర్ ఎంపికపై జరిగిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశ చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. గురువారం రాత్రి ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, లోక్‌సభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేలతో కూడిన కమిటీ ఈ ఎంపిక వ్యవహారాన్ని చర్చించింది. కొత్త డైరెక్టర్ పదవి కోసం కేంద్రం 70-80 పేర్ల దాకా సూచించిందని ఖర్గే మీడియాకు చెప్పారు. "పేర్ల జాబితాను మాత్రమే ఇచ్చారు. ఎవరి సర్వీసెంతి, వారి అర్హతలేంటి, సమర్థత ఎంత.. మొదలైన వివరాలు ఇవ్వాలని నేను, సీజే ప్రధానిని కోరాం. ఎవరి పేరుపైనా చర్చ జరగలేదు" అని వెల్లడించారు. సమావేశం అసంపూర్తిగా ముగిసిందని, బహుశా వచ్చే వారమే మరోమారు జరగవచ్చని తెలిపారు.

పౌరుష ప్రతాపాలకు ప్రతీకలుగా నిలిచిన ఎంతోమంది వీరనారీమణులు మనకు చరిత్రలో కనిపిస్తారు! తాజా 'మణికర్ణిక' కూడా ఝాన్సీ రాణి కథే. ఆ పాత్రలోని 'రాజసం' ఆమె వస్త్రధారణలోనూ కనిపిస్తుంది. నవతరం కూడా థ్రెడ్ వర్క్‌తో భారీగా, బ్యూటీఫుల్‌గా రాజసం ఉట్టిపడేలా కనిపించొచ్చు. ఆ తరహా బ్లౌజ్‌లివి...

నవతరం రాజసం









అవంతీబాయి

నలుపు రంగు 'రా సిల్క్' బ్లౌజ్ మెడ అంచుల్లో పువ్వుల డిజైను కొత్త అందాన్ని తెచ్చి పెట్టింది. ఫ్లోరల్ స్లీవ్స్‌తో వినూత్న లుక్‌తో అలరించవచ్చు.

ధర: **రూ.12,000**



సొగసు



మనోయి

చిలకాకుపచ్చ సిల్క్ బ్లౌజ్ మీద బంగారం, నీలం రంగు ఎంబ్రాయిడరీ వర్క్ ఆధునికత ఉట్టిపడేలా చేసింది. ఈ బ్లౌజ్‌లో ఆత్మవిశ్వాసంతోపాటు అందమూ తొణికిసలాడేలా చేయవచ్చు!

ధర: **రూ. 6,990**



ఝాన్సీ

ఆకుపచ్చని 'రా సిల్క్' బ్లౌజ్‌కు, మెడ చుట్టూ, చేతుల మీద ఎంబ్రాయిడరీ చేసిన గులాబీ రంగు పువ్వులు ఆకర్షణను తెచ్చిపెట్టాయి. ఈ బ్లౌజ్‌లో సున్నితత్వంతోపాటు హుందాతనం కూడా ఒలకపోయచ్చు!

ధర: **రూ. 7850**







సౌజన్యం: houseofblouse.com

లవ్లీ 'లేయర్'

మెడ నిండుగా ఉండాలంటే...'లేయర్ జ్యువెలరీ' ఎంచుకోవాలి! ఈ తరహా స్టయిల్‌లో నెక్లెస్ మొదలుకుని ఉంగరాల వరకూ విభిన్న ఆభరణాలు ధరించి అదరగొట్టేయొచ్చు.

లేయర్ నెక్లెస్: ఒక దాని కింద ఒకటి, వరుస హారాలు అమర్చి తయారుచేసే ఈ రకం నెక్లెస్ మెడలో నిండుగా



కనిపిస్తుంది. సన్నటి చైన్లే అయినా ఐదు లేదా ఆరు ఉండటం వల్ల భారీ లుక్ కూడా వస్తుంది. వేడుకలు, సంబరాల్లో ఈ రకం నగ పట్టు చీరలు, ఫ్యాన్సీ చీరలు రెండింటి మీదకూ సూటవుతుంది.

లేయర్ బ్యాంగిల్స్: ఇది కూడా కొత్త ట్రెండే! పెద్ద సైజు మొదలుకుని చిన్న సైజు వరకూ మోచేతి దిగువ నుంచి ముంజేతి వరకూ ధరిస్తే... లేయర్ బ్యాంగిల్ స్టయిల్ అంటారు. ఇందుకోసం మధ్యస్తంగా ఉండే గాజులు ఎంచుకోవాలి. అన్ని గాజులూ ఒకే రకంగా ఉండాలి. రాళ్ల పొదిగినవైనా, సాదావైనా అన్నీ అవే ఉండాలి. లేయర్ బ్యాంగిల్స్ టీనేజీ అమ్మాయిలకు చక్కగా నప్పుతాయి.

లేయర్ బ్రేస్‌లెట్స్: గాజులు వేసుకోవటానికి ఇష్టపడని వాళ్ల కోసమే ఈ స్టయిల్. ఫ్యాన్సీ డ్రస్సులను ఇష్టంగా ధరించే అమ్మాయిలకు లేయర్ బ్రేస్‌లెట్లు బాగా నప్పుతాయి. ఒకే చేతికి వేసుకునే ఈ బ్రేస్‌లెట్లు స్కర్ట్‌లు, మినీలు వేసుకునే వాళ్లకు సూటవుతాయి.

నగధగ

లేయర్ రింగ్స్: ఒకే ఒక భారీ ఉంగరం బదులు సైజులవారీగా ఉంగరాలు ధరించటం లేటెస్ట్ ఫ్యాషన్. ఎలాంటి వస్త్రధారణకైనా ఈ రకం ఉంగరాల స్టయిల్ బాగుంటుంది. కొన్ని సాదా, మరికొన్ని రాళ్ల పొదిగినవి...ఇలా ప్రయోగాలు చేసి నప్పిన ఉంగరాలను లేయర్లుగా ధరించాలి.



- మంజులా రావు
మంజుల జ్యువెల్స్, హైదరాబాద్.

ప్రత్యేకం



త్యాగరాయ... సేవారత్నం

ఆమె సంగీతరత్నం.
దేవదాసి అయినా... స్వాభిమాన రత్నం!
త్యాగరాజ ఆరాధనలో తరించిన సాధురత్నం.
అవమానించిన వారిపై పోరాడిన ధీరరత్నం!
తిరువైయారులో త్యాగరాజ ఆలయం కోసం... ఆస్తులు అమ్మేసిన అపురూప త్యాగరత్నం.
త్యాగయ్యకూ... తద్వారా తెలుగు భాషకూ... చరిత మరువని సేవ చేసిన ఘనకీర్తి రత్నం!
ఆమె... బెంగుళూరు నాగరత్నం!!
ఆ అనుపమాన స్త్రీ జాతి రత్నం జీవితాధారిత నవల 'త్యాగరత్న' నుంచి కొన్ని భాగాలు...

ఆ రోజు ఆరాధన చివరిరోజు. సుందర బృందావనం నిర్మాణం తరువాత ఇది త్యాగరాజుల వారి మొదటి ఆరాధన. వేదిక మీద పక్కవాద్యం వారు అప్పటికే వచ్చి కూర్చున్నారు. గాయకులు ఇంకా రాలేదు. అప్పుడు బెంగుళూరు నాగరత్నమ్మ గారు వేదిక ఎక్కారు.

ఏం... ఆడవాళ్ళు పాడకూడదా?

నాగరత్నమ్మ గారు వేదిక మధ్యభాగంలో ఆసీనులై... "నేను త్యాగరాజు మహాస్వాముల రచనలను పాడి, ఆ పుణ్యాత్మునికి నాదనైవేద్యాన్ని అర్పించడానికి ఇక్కడికి వచ్చాను" అని ప్రకటించారు. కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. పక్కవాద్యం వారు పరస్పరం ముఖాలు చూసుకున్నారు. అప్పుడు వైద్యనాథ భాగవతార్ వేదిక మీదికి వచ్చి "మహిళలు పాడడానికి, పూజ చేయడానికి ఇక్కడ అవకాశం లేదు. అది సంప్రదాయానికి విరుద్ధం. వేదిక దిగి, కార్యక్రమాలకి అనుకూలం కలిగించండి" అన్నారు.

"మహిళలు పాడకూడదని త్యాగరాజు చెప్పారా? ఎందుకు పాడకూడదు? మేమేమైనా మైలనా?"

"వాదవివాదాలు ఇక్కడ వద్దు. ఇది మా నిర్ణయం. వీణ ధనమ్మాళ్ ఒకసారి ఇలాగే పట్టుబట్టారు. అలాంటివారికే దేవాలయంలో పూజకు అవకాశం ఇవ్వకుండా, ఉత్సవమూర్తి దర్శనం చేయించి, వెనక్కు పంపడం జరిగింది. అందువల్ల మాట్లాడకుండా వేదిక దిగి వెళ్ళండి."

"నేను పాడి తీరతాను. ఏం చేస్తారు?" అని అలాగే కూర్చున్నారు నాగరత్నమ్మ.

పక్కవాద్యం వారు "మేము మహిళలకు పక్కవాద్యం వాయించం" అని వేదిక నుంచి దిగిపోయారు. ఇది నాగరత్నమ్మ గారి స్వాభిమానాన్ని గాయపరిచింది. వేదిక దిగి, నేరుగా తాము బస చేసిన సత్రానికి వెళ్ళిపోయారు. ..."ఇది నాకు జరిగిన అవమానం కాదు. మొత్తం స్త్రీ లోకానికి... అందులోనూ దేవదాసీ సమాజానికి చేసిన అవమానం. త్యాగరాజు గారి వ్యక్తిత్వానికి మసిపూసే ప్రయత్నం. ఇలాంటివారికి బుద్ధి చెప్పాలి. త్యాగరాజు గారి బృందావనం, ఆరాధనకు సంబంధించిన పనులన్నీ నేను చేస్తున్నప్పుడు లేనటువంటి మడి, సంప్రదాయం ఉన్నట్టుండి ఇప్పుడు ఎలా, ఎక్కడి నుంచి వచ్చాయి? నేను అంటరానిదాన్ని. నా డబ్బు మాత్రం మైల కాలేదు" అంటూ ఆవేశపడ్డారు. మరొక వేదిక ఏర్పరచి, ఎవరి దయాదాక్షిణ్యాలు లేకుండా తానే ఆరాధన నిర్వహించాలని నిర్ణయించుకున్నారు.

కలసి వచ్చిన దేవదాసీలు!

మద్రాసు చుట్టుపక్కల ఉన్న దేవదాసీలను వెదికించి, వాళ్ళనంతా ఒకచోట చేర్చారు. నగరంలో వందకు పైగా దేవదాసీ కుటుంబాలు దొరికాయి. వాళ్ళల్లో అనేకులు గాయకులు, నర్తకీమణులు, హరికథలు చెప్పడంలో ప్రసిద్ధి చెందినవాళ్ళు ఉన్నారు. సముదాయంలోని ప్రతి ఒక్కరినీ కలిసి, నాగరత్నమ్మ గారు తిరువైయారులో తమకు జరిగిన అవమానాన్ని అర్థమయ్యేలా వివరించారు. ఇంతటి అవమానం మరొకసారి కలగకూడదనకుంటూ, దానిని మన కళ ద్వారానే ప్రతిఘటించాలని అందరినీ ఉత్సాహపరిచారు. ఆమె కల నిజమయ్యే పుష్య మాస బహుళ పంచమి రోజు దగ్గరికి వచ్చేసింది.

త్యాగరాజుల ఆరాధనకు మొత్తం తిరువైయారు అలంకరించుకుంటోంది. ప్రత్యర్థి వర్గాలైన చిన్నకచ్చి, పెరియకచ్చి గుంపులు ఎప్పటిలా పరస్పరం పోటీ పడుతూ, తమ తమ ప్రతిష్ఠలు పెంచుకోవడానికి సంగీత క్షేత్రంలో దిగ్గజాలను ఆహ్వానించారు. ఈ రెండు వర్గాలకు తోడు... ఈసారి ఆరాధనలో దేవస్థానం ఆవరణలో మరొక వేదిక నిర్మాణమైంది. దేవస్థానం ఆవరణ నాగరత్నమ్మ గారి స్థలం కావడం వల్ల దీన్ని ఎవరూ అడిగే పరిస్థితి లేదు. నాగరత్నమ్మ గారి బృందంలోని మహిళల చేత సంగీత కార్యక్రమాలు ఉంటాయి అనే ప్రకటన ఉన్న కరపత్రాలను అన్నిచోట్లా పంచారు. ...దాంతో, పరస్పరం పోట్లాడుకుంటున్న రెండు గుంపులవారు ఇప్పుడు అనివార్యంగా చేతులు కలిపారు. ఎలాగైనా దీన్ని ఆపాలని వారు చట్టంలోని అవకాశాలను వెతకసాగారు. నాగరత్నమ్మగారు సొంత స్థలంలో, సొంత ఖర్చులతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం వల్ల దాన్ని ఆపడానికి సాధ్యం కాదని తెలిసిన తరువాత చేతులు ముడుచుకొని కూర్చోవాల్సి వచ్చింది...



త్యాగరత్న (నవల)

కన్నడ మూలం: 'కపిల హరిదళు కడలిగె' (కపిలానది ప్రవహించెను కడలికి)
రచన: ఆచార్య మలెయూరు గురుస్వామి
తెలుగు అనువాదం: రంగనాథ రామచంద్రరావు
పుస్తక రూపకల్పన: మోదుగుల రవికృష్ణ
ప్రచురణ: సన్రాజు బాల చందర్, 'సంస్కృతి', గుంటూరు.
ప్రతులకు: ఫోన్:9440320580, 70938 00678
పేజీలు: 297 **వెల:** రూ. 250

నాదస్వరానికి తొలి అవకాశం ఆమె వల్లే!

రోజులు గడిచే కొద్దీ నాగరత్నమ్మ గారి వేదిక దగ్గర జనులు కిక్కిరిసిపోవడంతో తోపులాటలు పెరుగుతూ పోయాయి. చిన్నకచ్చి, పెరియకచ్చి సభ్యులు జనులను తమ వైపు ఆకర్షించడానికి విందు భోజనాలు ఏర్పాటుచేశారు. భోజన సమయానికి అక్కడికి వెళ్ళి, పొట్ట పగిలేలా తిని, దేవదాసీల కార్యక్రమానికి వచ్చి హాజరయ్యేవారు రసికులు. అప్పటివరకు త్యాగరాజ ఆరాధనలో నాదస్వరం వాయించడానికి కళాకారులకు వేదిక మీద అవకాశం ఇవ్వలేదు. తమ సేవకూ అవకాశం ఇవ్వమని అనేకసార్లు విన్నవించినా, వాద్యాన్ని వారు నోటబెట్టుకొని ఊదడం వల్ల ఎంగిలి, మైలి అనే కారణం చూపి తిరస్కరించేవారు.

ఆరాధనలో... ఆమె గానామృతం

ఆ రోజు ఆరాధన చివరి రోజు. సరిగ్గా బ్రాహ్మీ ముహూర్తానికి లేచి, నాగరత్నమ్మ గారు కావేరీ నదిలో మునిగి, ఆ తడి బట్టలతోనే దేవాలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేశారు. తరువాత మండపంలోని ఒక స్తంభానికి ఆనుకొని, కళ్ళు మూసుకొని కూర్చున్నారు. ఎంతసేపయినా కళ్ళు తెరవనే లేదు. కళ్ళ నుంచి ధారాపాతంగా నీరుకారుతోంది. తడిబట్టలతోనే వేదిక మీదికి వచ్చి కూర్చున్నారు. సర్వాభరణ భూషితురాలై కచ్చేరీలలో కనిపించే ఆమె సన్యాసిలా, దైవత్వపు ప్రతీకలా కనిపించారు.

ఆ రోజు నాలుగైదు గంటల పాటు జరిగిన కచ్చేరీలో నాగరత్నమ్మగారు ఒక్కరే పాడారు. కచ్చేరీ ముగిసేవరకు చుక్క మంచినీరునూ తాగకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. భావోద్వేగంతో పాడుతూ ఉంటే శ్రోతలలోని మహిళల కళ్ళు తడి అయ్యాయి. ఒక్కొక్క కృతి ముగిసినప్పుడు నాగరత్నమ్మ గారు త్యాగరాజు గారి సమాధికి రెండు చేతులూ జోడించి నమస్కరించి, తరువాత శ్రోతలకు నమస్కరించి ఒకటి రెండు ఘడియలు ఏదో ధ్యానం చేస్తున్నట్టు కూర్చుని, అనంతరం తరువాతి కృతిని పాడడం మొదలుపెట్టేవారు. మంగళం పాడి ముగించినప్పుడు శ్రోతల జయజయధ్వానాలు, కరతాళధ్వనులు తిరువైయారు అంతటా ప్రతిధ్వనించినట్లు అనిపించింది. నాగరత్నమ్మ గారు లేచి చేతులు జోడించిన భంగిమలోనే మౌనంగా వేదిక దిగి వచ్చి, నేరుగా త్యాగరాజుల సమాధి దగ్గరకు వెళ్ళారు. సాష్టాంగప్రణామం చేసి, అదే భంగిమలో కొద్దిసేపు ఉండి, పైకి లేచి తదేక దృష్టితో త్యాగరాజు గారి విగ్రహాన్ని చూస్తూ నిలుచున్నారు. ఆమె నోరు మాత్రం "అంతా నీ దయ... అంతా నీ దయ..." అని మెల్లగా పలవరిస్తోంది. అక్కడి నుంచి బయలుదేరి సత్రం దారి పట్టారు. ఆమె బయటకు రావడం కోసమే ఎదురు చూస్తున్న శ్రోతలు ఆమె కాళ్ళకు నమస్కరించడానికి ఎదురుచూస్తూ, ఒకరి మీద ఒకరు పడసాగారు. "అయ్యో! త్యాగరాజు గారి క్షేత్రంలో నా కాలు తాకి, నాకు పాపం చుట్టకండి" అని తప్పించుకోవడానికి ఎంత ప్రయత్నించినా సమూహాన్ని నియంత్రించడం సాధ్యం కాలేదు. ఎలాగో సత్రానికి వచ్చి చేరారు.



తిరువైయారులో త్యాగరాజ సమాధి



అక్కడి శిలాఫలకం

...ఆభరణాలను విక్రయించి, తగినంత డబ్బుతో నాగరత్నమ్మ గారు తిరువైయారు చేరారు. సూర్వి కుటుంబం వారు అడిగినంత సొమ్మిచ్చి, త్యాగరాజుల వారి సమాధి చుట్టూ ఉన్న విశాలమైన స్థలాన్ని సొంతం చేసుకొని, అవసరమైన కట్టడాల నిర్మాణంలో మునిగిపోయారు. ఒంటి మీద నూలు చీర తప్ప మరేమీ లేదు. త్యాగయ్య గారి చిత్రం ఉన్న ఒక లాకెట్ మాత్రం కంఠాన్ని అలంకరించి ఉంది. ...సమాధి చుట్టూ ఉన్న విశాలమైన ప్రదేశం ఇప్పుడు నాగరత్నమ్మగారి యాజమాన్యంలోకి వచ్చింది.

స్థలం ఆమెది! సేవ అందరిదీ!!

త్యాగరాజ ఆరాధన కోసం దశాబ్దాల నుంచి జరుగుతున్న త్రికోణ పోటీ రోజులలో కృష్ణస్వామి అనే ఐ.ఏ.ఎస్. అధికారి కావేరి నది ప్రత్యేక అధికారిగా తంజావూరుకు వచ్చారు. ...ఆయన అక్కడికి వచ్చి చేసిన మొదటి పని ఏమిటంటే, ఈ మూడు గుంపులనూ ఒక్కటి చేసి, పెద్ద స్థాయిలో ఒకే వేదికపై ఆరాధనను జరిపించడం! ...రెండు గుంపుల వారి షరతులనూ విన్న కృష్ణస్వామి గారు, నాగరత్నమ్మ గారితో... "ఏమమ్మా! మీ షరతులు ఏమైనా ఉన్నాయా?" అన్నారు. ...తన సంపదనంతా క్షేత్రం అభివృద్ధి కోసం త్యాగం చేసిన నాగరత్నమ్మ గారు ఆరాధనను తమ అధీనంలోకి తీసుకోవడానికి ఏమేమి డిమాండ్లను ప్రతిపాదిస్తారో అని అందరూ కుతూహలంతో ఉన్నారు. సభ మధ్యన లేచి నిలబడ్డ నాగరత్నమ్మ గారు అందరినీ చూసి, రెండు చేతులను జోడించారు... "నేను ఎలాంటి డిమాండ్ మీ ముందు పెట్టడం లేదు. సమాధి చుట్టుపక్కల ఉన్న స్థల యాజమాన్యం చట్టప్రకారం నాదై ఉండొచ్చు. ఇక్కడ 'నాది' అన్నది కేవలం వ్యావహారికమైంది. అయితే, అదంతా త్యాగయ్య గారిది. దాన్ని ఇక్కడ సమావేశమైన మహాజనులు ఎలా కావాలన్నా వాడుకోవచ్చు. దాని మీద నా హక్కు ఏదీ లేదని స్పష్టం చేస్తున్నాను. నాది ఒకటే విన్నపం. త్యాగయ్య గారి ఆరాధన మహోత్సవం ఇక్కడ నిరంతరం జరగాలి. ఇక్కడ ఎక్కువ, తక్కువ లేకుండా అందరికీ సమానమైన అవకాశాలుండాలి. ఈ దేవదాసికి తమతో పాటు సేవ చేసే అవకాశం ఇవ్వాలి. అదేవిధంగా నాకొక్కదానికే కాదు, త్యాగయ్య గారి సేవకు వచ్చేవారు ఎవరైనా వారిని ప్రేమతో చూడాలి. అంతే. నా కోరిక ఇంత మాత్రమే!" అన్నారు నాగరత్నమ్మ గారు. ఆమె అలా చెప్పగానే సభ చప్పట్లు కొట్టి, ఆమె అభిప్రాయాన్ని స్వాగతించింది.



'విద్యాసుందరి' బెంగుళూరు నాగరత్నమ్మ (1872-1952)

ప్రత్యేకం



ఈనెల 31న మెహెర్ బాబా అమరతిథి స్వర్ణోత్సవాలు

అవతార పురుషుడి...
అంతిమ సందేశం

ప్రపంచంలో ఎన్నో మతాలున్నాయి. ఎందరో అవతార పురుషులున్నారు. ఒక్కో మతానికి ఒక్కో అవతార పురుషుడు ఉన్నారు. అయితే "మతాలు వేరైనా భగవంతుడు ఒక్కడే. ప్రతి యుగంలో భూమిపై అవతరిస్తున్న పరాత్పరుడు ఒక్కడే. మనం మతం వెనుక కాకుండా, ఈ మతాలు ఘోషించే సత్య సూక్తం వైపు కదిలి వెళ్ళాలి" అన్నది మెహెర్ బాబా మానవాళికి ఇచ్చిన సందేశం.

అవతార్ మెహెర్ బాబా భౌతికంగా నేడు మన మధ్యన లేరు. కానీ, ఆయన తన భక్తులతో నిత్య సహచరునిగా ఉన్నారు. ఆరాధించేవారు పిలిస్తే ప్రతిక్షణం పలుకుతున్నారు. మనస్సులో అనుకున్నదే తడవుగా వారికి మరింత చేరువగా ఉంటున్నారు. మెహెర్ బాబా సమస్త మానవాళి కోసం భౌతికంగా అనేక బాధలు అనుభవించారు. అనేకసార్లు ఏకాంతవాసం, ఉపవాసాలతో శరీరాన్ని ఎన్నో కష్టాలకు గురిచేశారు. 1940ల్లోనే సుమారు పది సంవత్సరాల కాలంలో 75 వేల మైళ్ళ దూరం ప్రయాణించారు. రవాణావ్యవస్థ అంతంత మాత్రంగానే ఉన్న ఆ రోజుల్లో కాలినడకన బాబా ఆసేతు హిమాచలం పర్యటించారు. కుష్ఠు రోగులను ఆదుకోడానికీ, అంటరానితనం నిర్మూలన కోసం బాబా 1927లోనే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కోల్‌కతాలో కరువు వచ్చినప్పుడు, ఎందరో అన్నార్తులను ఆయన ఆదుకున్నారు. తన ఆస్తిని సేవా కార్యక్రమాల కోసం అమ్మేశారు. సుమారు రెండున్నర ఏళ్ళు శిష్య బృందంతో 'నవజీవనం' పేరిట భిక్షాటనతో జీవనం గడిపారు. 1950 వరకూ విస్తృతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

విపత్తులోనూ వీడని మౌనం

మెహెర్ బాబా 1925 జూలై 10 నుంచి భౌతిక దేహం వదిలే వరకూ... 44 సంవత్సరాలు కఠిన మౌనంలో ఉన్నారు. ఆ దీక్షలో ఉంటూనే 13 సార్లు అమెరికా, యూరోపియన్ దేశాలలో పర్యటించారు. ఎందరో పాశ్చాత్యులు యేసు ప్రభువును మెహెర్ బాబాలో దర్శించుకున్నారు. ఆయన తన సంజ్ఞల ద్వారా 'భగద్వచనం', 'సర్వం-శూన్యం' తదితర పలు ఆధ్యాత్మిక గ్రంథాలను మానవాళికి అందజేశారు. ఒకసారి అమెరికాలోని ఒక్లహోమా అనే ప్రాంతంలో, మరోసారి మహారాష్ట్రలోని సతారా పట్టణ సమీపంలో బాబా ప్రయాణిస్తున్న కారు తీవ్ర ప్రమాదానికి గురయింది. ఆయన దేహం కుడి ఎడమ భాగాలు దాదాపు నుజ్జయ్యాయి. ఆ స్థితిలోనూ బాబా మౌనం విడనాడకుండానే తమకు సహకరించారని వైద్యులు వెల్లడించారు.

ఇదే చివరి దర్శనం

తన దేహత్యాగం గురించి మెహెర్ బాబా ముందుగానే అనేక సంకేతాలు ఇచ్చారు. 1969 ఏప్రిల్ 10 నుంచి జూన్ 10 వరకూ పుణేలో భక్తులకు తన ప్రత్యేక దర్శన కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కానీ, జనవరి ప్రారంభంలో బాబా ఆరోగ్యం బాగా క్షీణించింది. తక్షణ వైద్య పరీక్షల కోసం పుణే తీసుకెళ్ళాలని వైద్యులు సూచించారు. అందుకు బాబా అంగీకరించలేదు. ఆయన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా దర్శన కార్యక్రమాన్ని వాయిదా వేయాలని సన్నిహితులు సలహా ఇస్తే, "మౌనావతారునిగా నేను ఇచ్చే ఈ దర్శనం చిట్ట చివరిది, అనన్య సామాన్యమైనది. ఈ సారి నా భక్తులకు పడుకుని దర్శనమిస్తాను. అలా చేస్తే బాగుండదా?" అని ప్రశ్నించారు. "జనవరి నెలాఖరుకల్లా అంతా బాగుంటుంద"న్నారు.

నేను ఈ శరీరాన్ని కాదు!

జనవరి 29 నుంచి బాబా తీవ్రమైన ఫిట్స్‌తో బాధపడ్డారు. వీటివల్ల మంచం మీద ఆయన ఎగిరెగిరి పడేవారు. జనవరి 30వ తేదీ రాత్రి భావూజీ అనే తన సన్నిహిత మండలి సభ్యుడిని పిలిచి "ఇది గుర్తుంచుకోండి! నేను ఈ శరీరాన్ని కాదు. నేను భగవంతుణ్ణి!" అని స్పష్టంగా ప్రకటించారు. "బాబా ఈ మాటల్ని నా హృదయానికి తాకేలా, తన సంజ్ఞలతోకాక, తన స్పష్టమైన స్వరంతో అన్నారు" అని భావూజీ గుర్తు చేసుకున్నారు. "బాబా గొంతు చాలా నీరసంగా వుంది. కానీ ఆయన మాటలు నా చెవులకు చాలా స్పష్టంగా వినిపించాయి" అని తెలిపారు జనవరి 30న బాబా సుమారు నాలుగు గంటలు బాగానే విశ్రాంతి తీసుకున్నారు. కానీ ఫిట్స్ తరచూ తీవ్రంగా వచ్చాయి. "నేను మరో 7 రోజుల తర్వాత నూరు శాతం బాగవుతాను. ఆపైన ఈ బాధలు నాకు ఉండవు!" అని బాబా మరో ఆరాధకుడు ఏరుచ్‌తో బాబా అన్నారు. కానీ ఆ మర్నాడు, జనవరి 31వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో వచ్చిన తీవ్రమైన ఫిట్స్ బాబాను కుదిపి వేశాయి. దాంతో ఆయన శ్వాస స్తంభించింది.

చెక్కు చెదరకుండా ఏడు రోజులు

బాబా భౌతిక దేహాన్ని ముందుగా బాబా నిర్ణయించిన మెహెరాబాద్‌లోని సమాధి ప్రాంగణానికి తీసుకొచ్చారు. ఆయన ప్రేమికుల దర్శనార్థం అక్కడ ఏడు రోజులపాటు ఉంచారు. ఆ ఏడురోజులూ... రాత్రింబవళ్ళు బాబాను ఆరాధకులు దర్శించుకున్నారు. సాధారణ మానవులకు తుదిశ్వాస వదిలిన కొన్ని గంటల్లోపే అంత్యక్రియలు నిర్వహిస్తారు. అలా కానిపక్షంలో మానవ దేహంలో అనేక విపత్కర మార్పులు సంభవిస్తాయని అందరికీ తెలుసు. కానీ బాబా దేహం వదిలిన ఏడు రోజుల తర్వాత కూడా ఆయన శరీరంలో ఎలాంటి మార్పులూ లేవు. ఆయన ముఖం చిరునవ్వులు చిందిస్తూ, ప్రశాంతంగా ఉంది. దేశ, విదేశాల్లో బాబా ఆరాధకులు ఎందరో ఆయన దేహత్యాగం గురించి ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకొని హుటాహుటిన మెహెరాబాద్‌కు తరలివచ్చారు. 'మాకు బాబా దర్శనం ఇప్పించండ'ని టెలిగ్రామ్‌ల ద్వారా విజ్ఞప్తులు చేసుకున్నారు. బాబా దేహాన్ని అలా ఏడు రోజులు ఉంచాలని మొదట ఎవరూ అనుకోలేదు. స్థానిక వైద్యులు తక్షణం సమాధి కార్యక్రమం చేపట్టాలనీ, లేదంటే బాబా దేహం పాడైపోగలదని హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ, భక్తుల ఒత్తిడులకి ప్రాధాన్యం ఇవ్వాల్సి వచ్చింది. ఏ రోజు బాబా దేహంలో మార్పులు వస్తే ఆనాడు సమాధి కార్యక్రమం నిర్వహించాలనీ, అంతవరకూ వచ్చే భక్తుల కోసం వేచి చూడాలని ఆరాధక మండలి వారు అనుకున్నారు. అలా బాబాను దర్శించుకున్న అశేష జనవాహినిలో ఈ వ్యాస రచయిత కూడా ఉన్నాడు. అప్పుడు నా వయస్సు పది సంవత్సరాలు. మెహెర్ బాబాని సమాధిలో వుంచిన నాల్గవ రోజు నుంచి ఏడవ రోజు దాకా మా అమ్మ సుశీలా కృష్ణతో బాబా సమాధి ప్రాంగణంలో గడిపాను. ఏడవ రోజున- 1969 ఫిబ్రవరి ఏడో తేదీ, మధ్యాహ్నం 12-15 నిముషాలకు, బాబా సమాధి కార్యక్రమాన్ని ఆయన ఆరాధకుల సమక్షంలో నిర్వహించారు. పార్శీయుడైన బాబాకు, జొరాస్ట్రియన్ క్యాలెడర్ ప్రకారం ఆ రోజున జన్మదినం, ఇదంతా కాకతాళీయంగా మనకు కనిపిస్తుంది. కానీ, అవతారునికి అంతా అవగతమే! నాటి నుండీ ప్రతి ఏటా జనవరి 31న అవతారుడి అమరతిథి వేడుకలను బాబా ప్రేమికులు ఘనంగా జరుపుకొంటున్నారు. ఈ నెల 31న బాబా అమరతిథి (50వ) స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయి. మెహెర్ బాబా మధ్యాహ్నం 12 గంటల సమయంలో భౌతిక దేహత్యాగం చేశారు. కాబట్టి ఆయన భక్తులందరూ మెహెరాబాద్‌లోని బాబా సమాధి దగ్గర ఆ రోజు మధ్యాహ్నం 12 నుండి 12-15 గంటల వరకూ మౌనావతారుడైన మెహెర్‌బాబాను స్మరిస్తూ మౌనం పాటిస్తారు.

• డాక్టర్ మల్లాది కృష్ణానంద్

పూజలు లేని మందిరం 'భూకైలాస్'

మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రానికి సుమారు 5 కి.మీ. దూరంలో గల మెహెరాబాద్‌లో, చిన్న కొండ మీద మెహెర్ బాబా సమాధి వుంది. ఈ సమాధిని 1930ల్లోనే మెహెర్ బాబా స్వీయ పర్యవేక్షణలో చాలా నిరాడంబరంగా నిర్మించారు. ఇక్కడ ఎలాంటి సంప్రదాయ కర్మకాండలూ, పూజలూ, క్రతువులూ ఉండవు. అర్చక స్వాములు ఉండరు. సిఫార్సు లేఖలు, ప్రత్యేక రుసుము, విరాళాల కోసం హుండీలు ఉండవు. ఎంతటివారైనా మౌనంగా క్యూలో నిల్చుని బాబాని దర్శించుకుంటారు. సమాధికి సుమారు రెండు కి.మీ. మేర నూరేళ్ళు పైబడిన రావి, మర్రి వృక్షాల మీద నుంచి పక్షులు చేసే కిలకిలరావాలు మాత్రమే వినిపిస్తాయి. బాబా భక్తులు ఈ ప్రాంగణాన్ని 'భూకైలాస్' అని పిలుచుకుంటారు. మెహెర్‌బాబా తానేమీ మహత్యాలు చేయననీ, కోరికలతో తన వద్దకు రావడం శుద్ధ దండుగ అనీ స్పష్టం చేశారు. అయితే, "ఇక్కడ ఉన్న ఈ మహా నిశ్శబ్దంలోనే మీ అవసరాలు తీరతా"యని భరోసా ఇచ్చారు. ప్రశాంతమైన మెహెర్ బాబా ఆలయం ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకూ దర్శనానికి వచ్చినవారందరికీ స్వాగతం పలుకుతుంది.

స్వామి మనతోనే ఉన్నారు!

(గత వారం తరువాయి...)

"కొందరు మాత్రమే ఇలా స్వామి దయను ఎందుకు పొందగలుగుతున్నారు? అందరికీ ఎందుకు దొరకడం లేదు?" అని నన్ను కొందరు వ్యక్తులు అడిగారు. సమాధానం చాలా చిన్నది. మీ గత జన్మ తాలూకు బ్యాంక్ బ్యాలెన్స్ ఎంత? మీరు చేసిన మంచి పనులేమిటి? మీరు ముందుకు ఏం తీసుకువచ్చారు? ఇప్పుడు మీరేం చేస్తున్నారు? భగవాన్ ఆశీస్సులు పొందడానికీ, ఆయన దయకు అర్హులు కావడానికీ మీ పట్ల మీరు నిజాయతీగా ఉండడం అవసరం. దేవుడు మిమ్మల్ని ఎల్లప్పుడూ గమనిస్తూనే ఉంటాడు. 'సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ' అనే ఆయన బాటను అనుసరించండి. దేవుడు మీతోనే ఉంటాడు. స్వామి చేసిన అద్భుతాలు ఆయన సర్వవ్యాపకత్వాన్ని చాటి చెబుతాయి.

అదేమిటో... స్వామితో సన్నిహితంగా ఉన్నా, ఆయనతో ఫోటోలు తీయించుకోవాలని నేనెప్పుడూ తాపత్రయ పడలేదు. అందుకే, ఆయనతో ఫోటోలేవీ నా దగ్గర లేవు. కొడైకెనాల్‌లో ఒకసారి ఆయనతో దిగిన ఫోటో ఒక్కటే నా దగ్గర చిరస్మరణీయ జ్ఞాపకంగా మిగిలింది. భౌతికమైన రూపం నుంచి స్వామి నిష్క్రమించిన తరువాత కూడా అద్భుతాలు ఎన్నెన్నో జరుగుతూనే ఉన్నాయి.

(మరిన్ని అనుభవాలు వచ్చేవారం...)

కూర్పు: రెంటాల జయదేవ

స్మరణ



సద్గురువాణి



యోగా అంటే ఐక్యత!

ఇతరులను కలిసినప్పుడు ఆదుర్దాగా ఉంటుంది. దాన్ని జయించడం ఎలా? ఈ సమస్య కొందరికి తరచూ ఎదురవుతూ ఉంటుంది. ఎవరినైనా కలిసినప్పుడు వారితో సుముఖంగా ఉండడానికి గాభరాపడుతూ ఉంటారు. 'ఇది మానసిక సమస్యా? లేక సమాజంలో ఇమడలేకపోతున్నానా?' అనే సంశయాలు ఎదురవుతాయి. 'ఈ పరిస్థితి నుంచి బయటపడడానికి ఏం చెయ్యాలి?' అనే ప్రశ్న వెంటాడుతూ ఉంటుంది.

మీరు 'యోగ అనే మాటను కచ్చితంగా వినే ఉంటారు, 'యోగా' అంటే... అందరూ వెంటనే అదేదో శరీరాన్ని వంచడం, తిప్పడం అనుకుంటారు. కానీ అది కాదు! 'యోగా' అంటే అర్థం ఐక్యత. యోగా లేక ఐక్యత అంటే అర్థం ఏమిటంటే, మీరు ఎరుకతో మీకు వ్యక్తిగతంగా ఉన్న సరిహద్దులను చెరిపివేసే ప్రయత్నం చేస్తున్నారని! అప్పుడు మిమ్మల్నీ, ఈ విశ్వాన్నీ వేరువేరుగా భావించే అవకాశం ఉండదు, 'అంతా ఒకటే!' అనిపిస్తుంది. అప్పుడు విశ్వంతో పోటీ పడుతున్నామనే భావన మీకు రాదు. దీనికోసం మీరు యోగా చేయాలి, లేకపోతే అన్ని రకాల ఆలోచనలూ, మనోభావాలూ, ఉద్దేశాలతో మీ బుర్ర వక్రమై పోతుంది.

మీరు కొంచెం సుముఖంగా ఉంటే, మీరు మీ వ్యక్తిగతమైన హద్దులను చెరిపేస్తే, అది సులువు అవుతుంది. మరో వ్యక్తిని కూడా మీలో భాగం చేసుకోవడం చాలా సులభం అవుతుంది. అక్కడ ఉన్నవారు పురుషుడైనా, స్త్రీ అయినా, పిల్లవాడైనా, ఇక సమస్య ఉండదు. మీరు అందరితో, అన్నింటితో, ఏ విధమైన హద్దులు లేకుండా సంభాషించగలరు, ఎందుకంటే మీరు హద్దులను చెరిపేశారు. మీరు మీ హద్దులను దృఢం చేసుకుంటేనే సమస్య. అక్కడ ఉన్నది పురుషుడైతే ఒక రకమైన సమస్య, స్త్రీ అయితే మరో రకమైన సమస్య ఉంటాయి. మీరు కృషిచేసి, స్థిమితంగా ఉండే స్థితిలో మిమ్మల్ని నిలబెట్టుకొనే సమయం ఆసన్నమైంది- అది కేవలం మనిషిగానే కాదు, ఇతరులతోనే కాదు, మొత్తం జీవంతో! మీలో స్థిమితత్వం లోపిస్తే, మీ పూర్తి శక్తిని, సామర్థ్యాన్ని, మీరు ఎప్పటికీ తెలుసుకోలేరు.

ప్రతి జీవిలో ఒకరకమైన ప్రతిభ ఉంటుంది. కానీ దాన్ని తెరవకుండానే, అనుభూతి చెందకుండానే 99 శాతం వ్యక్తులు జీవిస్తారు, మరణిస్తారు కూడా! అది పూర్తిగా తెరుచుకోవాలి, మీలో సామర్థ్యం, ప్రతిభ ఉంటే, అవి తెరుచుకుంటే మీ జీవితం స్థిమితంగా ఉంటుంది. దాని కోసం 'యోగా' అనే సాంకేతికత ఉన్నది. అది మీ శారీరక, మానసిక, శక్తిపరమైన ఒడిదొడుకులకు పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తుంది. మీరు దీన్ని ఓ స్థాయికి తీసుకువెళితే ఎవరితోనైనా స్థిమితంగానే ఉంటారు. ఆందోళనలో అన్నీ వక్రంగా కనబడతాయి. అందుకే స్థిమితంగా ఉండడం చాలా ముఖ్యం, లేకపోతే మీరు జీవితాన్ని ఉన్నది ఉన్నట్టు చూడలేరు.



• సద్గురు జగ్గీవాసుదేవ్

ముల్లోకాల తల్లి!

నవ జీవనవేదం



కాళిదాసు రచించిన 'శ్యామలా దండకం' అర్థాన్ని జీవితానికి ఉపయోగపడే విధంగా చెప్పుకుంటున్నాం. ఇప్పుడు మరొక శ్లోకం అర్థం తెలుసుకుందాం.

హేమకుంభోపమోత్తుంగ వక్షోజభారావనమ్రే త్రిలోకావనమ్రే

బంగారపు కలశాల్లా ప్రకాశిస్తున్న వక్షోజాల భారం కారణంగా నీ నడుము వంగి ఉందమ్మా! వక్షోజాలను అంత ఉన్నతంగా వర్ణించడంలో ఉద్దేశం ఆ తల్లి జగత్తునంతా పోషిస్తుంది. బంగారపు కలశాలతో పోల్చడంలో ఉద్దేశం భగవత్ కటాక్షం బంగారంలాంటిది అని. బంగారం ఉంటే అన్నీ వస్తాయి. బంగారం ఉంటే మిగతా లోహాలు ఏవైనా కొనుక్కోవచ్చు. భగవత్ కటాక్షం కూడా అంతే. భగవత్ కటాక్షం ఒక్కటుంటే చాలు, అన్నీ సమకూరుతాయి. 'త్రిలోకావనమ్రే'.. అంటే 'మూడు లోకాలు నీకు వంగి నమస్కరిస్తున్నాయమ్మా!' అని అర్థం. నడుము గురించి వర్ణిస్తూ మూడు లోకాల గురించి చెప్పడమేమిటి అని అనిపించవచ్చు. ఇక్కడ మూడు లోకాలు అంటే నడుం దగ్గర పడే మూడు ముడతలు! ఇంతకు ముందు శ్లోకంలో చెప్పుకున్నాం. 'వల్లీవలిచ్ఛేద' అని. ఆ మూడు ముడతలు మూడు లోకాలు. వక్షోజాల భారం కారణంగా నడుము వంగి మూడు ముడతలు ఏర్పడినట్టుగా, నీ ముందు మూడు లోకాలు వంగుతున్నాయమ్మా! అని భావం. ఈ వర్ణన శృంగారభరితం కావచ్చు, అశ్లీలం మాత్రం కాదు.

లసద్వృత్తగంభీర నాభీసరస్తీ రశైవాలశంకాకరశ్యామరోమావలీభూషణే
మంజుసంభాషణే

'లసద్వృత్తగంభీర నాభీ'.. అంటే ప్రకాశిస్తున్న వృత్తాకారంలో ఉన్న, లోతైనటువంటి నాభి. ఆ నాభి ఒక చెరువు, మడుగు అయితే చుట్టూ నాచు ఉంటుంది. శైవలం అంటే నాచు. నాభి చెరువులా ఉంటే మరి నాచు ఉండాలి కదా అని అనుమానమస్తోందమ్మా! ఎందుకు అంటే 'శంకాకరశ్యామరోమావలీ'.. 'నాభి నుంచి పైభాగంలో ఉన్న నల్లటి రోమాలు నాచులా కనిపిస్తోందమ్మా!' అని అర్థం. ఏమిటీ దీని భావం? 'మంజుసంభాషణే'...కాస్త మంజులమైన సంభాషణల్లోకి వెళ్లి ఆలోచించగలిగితే తత్వం అర్థమవుతుంది. అమ్మవారిని ప్రార్థించేటప్పుడు కష్టం పోవాలని కోరుకోవద్దు. కష్టాన్ని ఎదుర్కొనే ధైర్యం ఇమ్మని అడగాలి. కనకధారాస్తవం గురించి తెలుసుకున్నా, శ్యామలా దండకం అర్థం తెలుసుకున్నా కోరికలు తీరడానికి కాదు. వాటి వల్ల జ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞానం ఎంత గొప్పది అంటే... పిల్లలు పుట్టినా పుట్టకపోయినా, ఉద్యోగం ఉన్నా, పోయినా, డబ్బు ఉన్నా, లేకపోయినా సంతోషంగా ఉంటారు.



• డా. గరికిపాటి నరసింహారావు

దేవుణ్ణి మరచిపోతే...

"నా ప్రజలు నన్ను మరచిపోయారు!"- ఇది యిర్మీయా ప్రవక్త ద్వారా దేవుడు తన ప్రజల మీద చేసిన అభియోగం... ఆయన వెల్లడించిన తన హృదయ విషాదం! (యిర్మీయా18:15). విశేషమేమిటంటే, 'నన్ను మరచిపోయా'రన్న ఆరోపణ చేసేటప్పుడు కూడా మానవాళిని 'నా ప్రజలు!' అంటూ సంబోధించక మానలేనంత దయామయుడు ఆ దేవుడు. ఆయన ఈ మాటలన్నది దాదాపు మూడు వేల ఏళ్ళ క్రితం. కానీ ఈ రోజుల్లో మనుషులు తమను కన్న తల్లిదండ్రులను, తోబుట్టువులను, తమ సంతానాన్ని కూడా మర్చిపోయేంత స్వార్థపరులుగా మారడం దేవుడికి మరెంత క్షోభ కలిగిస్తున్నదో ఆలోచించండి. మతిమరుపు ఒక భయంకరమైన 'ఆత్మీయ రోగం'! మతిమరుపు ముసుగులో దైవ వ్యతిరేకమైన, అమానవీయమైన స్వార్థం, క్రూరత్వం, విచ్చలవిడితనం లాంటి మరింత ప్రమాదకరమైన లక్షణాలు దాగివుంటాయి. అయితే అవే మన ఈనాటి మన సామాజిక జీవనాన్ని శాసించడం బాధ కలిగిస్తోంది. నిజానికి 'మరచిపోవడం' పూర్తిగా జంతు లక్షణం. 'గుర్తుపెట్టుకోవడం' దేవుడు మానవాళికి మాత్రమే ప్రసాదించిన ఒక గొప్ప సద్గుణం. "దేవుణ్ణీ, దేవుని కృపను జ్ఞాపకం ఉంచుకోండి" అనే మాటను బైబిల్‌లో మోషేతో సహా ఎంతో మంది పదే పదే వాడారు. "ఆయన చేసిన ఉపకారాల్లో దేనినీ మర్చిపోవద్దు" అన్నది దావీదు రాసిన అద్భుతమైన కీర్తనలోని ఒక పంక్తి (103:2). వాగ్దాన దేశమైన కానానులో సమృద్ధిలో జీవిస్తూ, తమ ఔన్నత్యానికి కారణమైన దేవుని మరచిపోయి, విచ్చలవిడితనానికి అలవాటు పడి, పర్యవసానంగా అన్నీ పోగొట్టుకొని- బానిసలుగా బబులోను దేశంలోని చెరకు వెళ్లిన యూదులు- అక్కడి నదుల ఒడ్డున కూర్చొని దేవుడు తమకు స్వాస్థ్యంగా ఇచ్చిన సీయోనును జ్ఞాపకం చేసుకొంటూ పాడిన పాట, "నిన్ను మరచిపోతే మా కుడి చేతికి ఉన్న ప్రావీణ్యాన్నీ, నేర్పునూ మేము మరచిపోయినట్టే!" అంటూ చేసిన పశ్చాత్తాప ప్రార్థన మనసును కదిలించేస్తుంది (కీర్తన 137:1, 5).

దైవమార్గం



'దేవుణ్ణి మర్చిపోవడం అనేది' ఒక ఆత్మీయ జాడ్యంగా ఆరంభమవుతుంది. సామాజిక, కుటుంబ రంగాలకు కూడా విస్తరించే ఈ 'మతిమరపు' చాలా అనర్థాలకు కారణమవుతుంది. తల్లిదండ్రులను దేవుని ప్రతినిధులుగా, దేవుని తర్వాత దేవుడంతటి వారుగా భావించి వారికి కుటుంబవ్యవస్థలో అత్యున్నత స్థానాన్ని మన సమాజం ఇచ్చింది. వృద్ధాప్యంలో వారిని గాలికి వదిలేసి, రోడ్లమీదికి ఈడ్చడం లేదా దిక్కులేనివాళ్ళలాగా వారిని వృద్ధాశ్రమాల్లో చేర్చుతున్న ఈనాటి సామాజిక దౌర్బల్యం వెనుక ఈ 'మతిమరపు' అనే మహమ్మారి ఉంది. దేవుణ్ణే మర్చిపోయిన మనిషి జీవితంలో తల్లిదండ్రులనూ, తోబుట్టువులనూ, ఆప్తులనూ, స్నేహితులనూ, తనకు అండగా నిలబడిన వాళ్లనూ కూడా అవలీలగా మరచిపోతాడు. మన గుండె నిముషానికి 72 సార్లు కొట్టుకోవడం వెనుక దేవుని మహా కృప ఉంది. అలాంటి దేవుణ్ణి కూడా మనం మరచిపోగలిగితే... అలాంటి సామాజిక వ్యవస్థకు భవిష్యత్తు ఉండదు. అందుకే "నీ తల్లినీ, తండ్రినీ సన్మానిస్తే నీవు దీర్ఘాయుష్మంతుడివి అవుతావు!" అన్న దేవుడి దీవెనలో ఎంతో పరమార్థం ఉంది. గతానికీ, భవిష్యత్తుకూ వంతెన లాంటి తల్లిదండ్రుల తరాన్ని... సమాజాన్ని పటిష్ఠం చేసే ఒక మహా సాధనంగా దేవుడు ఏర్పాటు చేశాడు. మన పిల్లలకు సభ్యత, సంస్కారం, దైవ భయం, దైవ నియమాల మహోన్నతత్వాన్ని నేర్పించేంత సమయం, ఓపిక... పనుల్లో పూర్తిగా తల మునకలై ఉన్న, తల్లిదండ్రులమైన మనకు లేవు. అవి నేర్పించకపోతే మన పిల్లలు తమ తెలివితేటలు, చదువు వల్ల ప్రయోజకులు అవుతారేమో కానీ జీవితంలో అతి ప్రధానమైన శాంతికి దూరం అవుతారు. ఈ రోజుల్లో అదే జరుగుతోంది. ఒకనాటి ఉమ్మడి కుటుంబాల్లో భాగమైన తల్లిదండ్రులు, పెద్దలు, వృద్ధులైన దగ్గర, దూరపు బంధువులు సాధించిన గొప్ప విజయం ఏమిటంటే... సామాజిక ఒత్తిడిలో కూడా దేవుడికీ, కుటుంబ శాంతికీ దూరం కాకుండా తమ గుర్తింపును, ప్రత్యేకతను కాపాడుకున్నారు. మన సమకాలీన తరాన్ని వాళ్లంతా కలిసి నిర్మించారు. కాని 'అలాంటి తరాన్ని భావితరాలకు అందించడంలో మన వంతు బాధ్యతను ఎంత వరకూ నెరవేస్తున్నాం?' అనే ప్రశ్నను మనం తప్పక వేసుకోవాలి. 'నన్ను మరచిపోకండి!' అని దేవుడు చెప్పడం వెనుక, 'మీ తరాన్నీ, దాని ప్రాశస్త్యాన్నీ, విలువల్నీ, మీ కుటుంబ శాంతిని కాపాడుకోండి!' అనే ఆయన హృదయ స్పందన ఉంది. ఎవరితోనూ సంబంధం లేకుండా ఎవరి బతుకు వాళ్ళు బతకడమే సరైన విధానమైతే జంతువులకు, మనిషికీ తేడా ఏమిటి? ప్రతి విశ్వాసికి జీవనాడి లాంటి, 'నిన్నువలె నీ పొరుగువాణ్ణి ప్రేమించు!' అనే దేవుడి ఉపదేశమే సమాజాన్ని 'ప్రేమభరితమైన లోకం'గా మార్చుతుంది. మరి దేవుడి ఈ ఉపదేశం గుర్తుండాలంటే ముందు దేవుడు గుర్తుండాలి, ఆ దేవుడు ఎలాంటివాడో తెలియాలి కదా! అందుకే దేవుణ్ణి మరచిపోనివాడు తల్లిదండ్రులనూ, ఇతరులనూ, తన సామాజిక బాధ్యతలనూ తప్పకుండా గుర్తుంచుకుంటాడు.

• సుశీల్ సందేశ్

సందేశం

అన్నీ ఆయనే!

"మేము మానవుణ్ణి శ్రమ కోసం పుట్టించాం. అతడు తనను 'ఎవరూ అదుపు చేయలేరు!' అని అనుకుంటున్నాడా? నేను అపార ధనరాశుల్ని ఖర్చు పెట్టానని అతను అంటాడు. తను ఎవరూ గమనించలేరని అతను భావిస్తున్నాడా? మేము అతనికి రెండు కళ్ళనూ, ఒక నాలుకనూ, రెండు పెదవులనూ మేము ప్రసాదించలేదా? ఇంకా స్పష్టమైన రెండు (మంచి, చెడు) మార్గాలను అతనికి చూపించాం. (అంతిమ దివ్య ఖుర్‌ఆన్ 90: 4-10)

"భూమినీ, ఆకాశాన్నీ, వాటి మధ్య ఉన్న సమస్త జీవరాశుల్నీ ఆరు రోజుల్లో సృష్టించి, ఆ తరువాత అధికార సింహాసనంపై అధిష్ఠించినవాడు ఆ అల్లాహ్. ఆయన తప్ప మీకు మరెవరూ సహాయకులూ, సంరక్షకులూ లేరు. ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా సిఫారసు చేసేవారు కూడా ఎవరూ లేరు. మరి ఇప్పుడైనా మీరు స్పృహలోకి వస్తారా? నింగి నుంచి నేల వరకూ సమస్త విశ్వ వ్యవహారాలకు సంబంధించిన నిర్ణయాలు ఆయనే తీసుకుంటాడు. వాటి వివరాలు మీ లెక్క ప్రకారం వెయ్యి సంవత్సరాలకు సమానమైన ఒక దినంలో ఆయన సన్నిధికి చేరుతాయి.



ఆయన అంతర్-బాహ్య విషయాలన్నీ తెలిసినవాడు, మహా శక్తిమంతుడు, అమిత దయామయుడు. ఆయన ప్రతిదాన్నీ సముచిత రీతిలో అద్భుతంగా సృష్టించాడు. తరువాత అతనిలో ఆత్మను ప్రవేశపెట్టాడు. ఒకసారి ఆలోచించండి! మీకు ఆయన చెవులు ఇచ్చాడు, కళ్ళు ఇచ్చాడు, హృదయాన్ని ఇచ్చాడు. కానీ మీరు మాత్రం ఆయనకు చాలా తక్కువగా కృతజ్ఞత చూపుతున్నారు." (అంతిమ దివ్య ఖుర్‌ఆన్ - సజ్దా 32: 49)

"మేము మానవుణ్ణి నాణ్యమైన మట్టితో సృష్టించాం. తరువాత అతణ్ణి ఒక సురక్షితమైన ప్రదేశంలో బిందువుగా మార్చాం. ఆ తరువాత ఆ బిందువును నెత్తుటి ముద్దగా రూపొందించాం. తిరిగి ఆ నెత్తుటి ముద్దను మెత్తటి పిండంగా చేశాం. ఆ తరువాత దాన్ని ఎముకలుగా మార్చాం. ఆ ఎముకలపై మాసం కప్పాం. ఆపైన అందులో ప్రాణం పోసి ఒక నూతన సృష్టినే ఉనికిలోకి తెచ్చాం. కాబట్టి అల్లాహ్ ఎంతో శుభకరుడు. ఆయన నిర్మాతలందరిలో గొప్ప ప్రతిభాశాలి.

(అంతిమ దివ్య ఖుర్‌ఆన్- మోమినూన్ 23: 12-14)

• మహమ్మద్ వహీదుద్దీన్

డైలీ సుడోకు - 434

7	9			5			2	
		2	7					4
	8							
				7	8	4		9
	6						7	
1		4	3	2				
							6	
6					7	3		
	3			4			9	2

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 433 సమాధానం

6	[illegible]	[illegible]	[illegible]	9	[illegible]	[illegible]	8	[illegible]
8	5	[illegible]	4	[illegible]	[illegible]	[illegible]	2	[illegible]
[illegible]	1	[illegible]	[illegible]	[illegible]	5	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	4	3	[illegible]	8	6	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	7	5	[illegible]	2	4	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	9	[illegible]	[illegible]	[illegible]	1	[illegible]
[illegible]	6	[illegible]	[illegible]	[illegible]	3	[illegible]	4	8
[illegible]	3	[illegible]	[illegible]	8	[illegible]	[illegible]	[illegible]	7

మార్పు సత్యం... నిత్యం


ధర్మ వ్యాపకుల్లో, ధర్మ స్థాపకుల్లో రెండు రకాలవారు ఉంటారు. తాము వ్యాపింపజేసిన ధర్మఫలాన్ని తాము బతికి ఉండగానే కనులారా చూడాలనుకొనేవారు ఇందులో మొదటివారు. తాము చూసినా, చూడకపోయినా తమ తదనంతరమైనా ఫలితాలను ఇస్తుందని అనుకొనేవారు రెండోరకం. మొదటి వారిలో, తాము చూడాలనే కోరిక ఉంది కాబట్టి, దాని ఫలితంగా వారిలో నిరాశో, తొట్రుపాటో, తొందరపాటో కనిపిస్తుంది. ఎందరెందరో ప్రవక్తల్లో, ధర్మ ప్రచారకుల్లో, సంస్కరణవాద రాజకీయవేత్తల్లో, తత్త్వవేత్తల్లో ఇలాంటి తొట్రుపాటును చూస్తాం. అలాంటివారిలో ధర్మబోధి ఒకడు.

వైశాలికి చెందిన మహా భిక్షువు సంఘవర్ధనుడు. ఆయన దగ్గర వందలాది మంది శిష్యులు ఉండేవారు. ధర్మ ప్రబోధాలు నేర్పడంలో, ఆచరించేలా చేయడంలో ఆయన నేర్పరి. ఆయన శిష్యులు కూడా తమ విద్యానంతరం దేశం నలుమూలలకూ పోయి, సత్యాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధిస్తూ, ప్రజల్ని అకుశల కర్మల నుంచి కుశల కర్మలవైపు మళ్ళించే పనిలో నిమగ్నమై ఉండేవారు. అలాంటి సంఘవర్ధనుడి శిష్యుల్లో ధర్మబోధి ప్రముఖుడు. అతడు చురుకైనవాడు. ప్రజ్ఞాని. ఎప్పుడూ కుశల కర్మల ధ్యాసలోనే ఉండేవాడు. ఈ లోకాన్ని అతి తొందరగా మంచి పనుల వైపు మళ్ళించాలని ఉవ్విళ్ళూరేవాడు. "మిత్రులారా! ధర్మవ్యాప్తిలో నిర్లక్ష్యం చూపకండి" అంటూ తోటి విద్యార్థుల్ని ఎప్పుడూ హెచ్చరిస్తూ ఉండేవాడు. విద్యాభ్యాసం ముగిశాక, గురువుగారి దగ్గర సెలవు తీసుకొని, ధర్మాన్ని వ్యాప్తి చెయ్యడానికి ధర్మబోధి బయలుదేరాడు. పుష్కర కాలం గడిచింది. వెళ్ళిన ఊరికే వెళ్తూ, కొత్త కొత్త ప్రాంతాలకు పోతూ, చెప్పిన ధర్మప్రబోధం మళ్ళీ మళ్ళీ చెబుతూ, కాలికి బలపం కట్టుకొని అవిశ్రాంతంగా ప్రబోధిస్తూ గడిపాడు ధర్మబోధి. కానీ, ప్రజల్లో పెద్దగా మార్పు అతడికి కనిపించలేదు. వారికి తనలా ధర్మబుద్ధి అలవడినట్టు కనిపించలేదు. అకుశల కర్మలు తగ్గి, కుశల కర్మలు పెరిగినట్టుగా దృష్టాంతాలు కనబడలేదు. ఇంతకాలం నేను చేసిన ధర్మప్రబోధాల వల్ల ఫలితం ఏమిటి? మార్పు కనిపించకపోతే ఈ ప్రబోధాలు ఎందుకు? ఇన్ని చెప్పినా ప్రజలు అనైతిక మార్గం నుంచి మళ్ళడం లేదు అనుకొని అతడు నిరాశ పడ్డాడు.

ధర్మబోధి తీవ్ర నిరాశతో గురువుగారి దగ్గరకు వచ్చి, తన గోడు వెళ్ళబోసుకున్నాడు. గురువు చిరునవ్వు నవ్వి-

"ఇటురా!" అంటూ ఒక మొక్క దగ్గరకు తీసుకుపోయి, - "ఇది పెరుగుతుందా? లేదా?" అని అడిగాడు. "ఆచార్యా! పెరుగుతూనే ఉంటుంది" అన్నాడు ధర్మబోధి. "ఏదీ? నువ్వు దీనివైపే చూస్తూ ఉండు. దీని పెరుగుదల నీకు కనిపిస్తుందా? ఈ క్షణంలో, ఈ ఘడియలో, ఈ పూటలో ఎంత పెరిగిందో గుర్తించి, చెప్పగలవా?" అని గురువు ప్రశ్నించాడు . "ఆచార్యా! చెప్పలేను. దీని పెరుగుదలను ఇంత తక్కువ కాల వ్యవధిలో గుర్తించలేను. కానీ, ఇది పెరుగుతుంది అనేది సత్యం" అన్నాడు ధర్మబోధి. "నాయనా! నీ ప్రబోధాల ఫలితాలు కూడా అలాంటివే. వాటిని వ్యాప్తి చేయడం మన కర్తవ్యం. నువ్వు చూసినా, చూడకపోయినా... ఫలితం మాత్రం తప్పకుండా ఉంటుంది. అకుశల కర్మలూ, చెడ్డ భావాలూ తంపరలుగా వచ్చి పడే సమయంలో... ధర్మం రూపం ధరించడానికి సమయం పడుతుంది. నువ్వు నిరాశ పడడం వల్ల మరింత ప్రమాదం ఉంది. ఈ మాత్రం నీతి కూడా వ్యాప్తి కాకపోతే... కుశల కర్మలకు సమాజం మరింత దూరంగా పోతుంది. నిరాశ వద్దు. నీ ప్రయత్నం నువ్వు చెయ్యి!" అన్నాడు గురువు. గురువు పాదాలకు నమస్కరించి, నిరాశను వదిలి, దానికి కారణమైన కోరికను త్యజించి, పరిపూర్ణ విశ్వాసంతో కదిలాడు ధర్మబోధి.

ధర్మపథం



• బొర్రా గోవర్ధన్

సాయం చేయడానికి చేతిలో డబ్బు అవసరం లేదు. స్పందించే మనసు, ఆదుకోవాలన్న తపన ఉంటే చాలు అని నిరూపించాడు కేరళకు చెందిన ఒక ఆటోడ్రైవర్. అతని కథేంటంటే...

అతని దారి... మానవత్వపు రహదారి

గుడ్ సర్వీస్



సుశాంత్

కేరళ రాష్ట్రంలోని నిలంబూర్ పట్టణం అది. ఓ సామాన్య ఆటోడ్రైవర్‌గా సుశాంత్ అక్కడివారికి సుపరిచితుడు. ఒకరోజు తన స్నేహితుడు రోడ్డు ప్రమాదానికి గురై హాస్పిటల్‌లో ఉన్నాడని సుశాంత్ కబురొచ్చింది. హుటాహుటిన బయలుదేరాడు. ఆపరేషన్ చేయకపోతే ప్రాణాలకే ప్రమాదమని డాక్టర్లు చెప్పేశారు.

అతని కుటుంబం వద్ద డబ్బు లేదు. పోనీ తాను సాయం చేద్దామన్నా ఆర్థిక స్తోమత సరిపోదు. ఇక తెలిసిన వాళ్లను, తెలియని వాళ్లనూ సాయం అడిగాడు. ఆఖరికి అప్పులు కూడా చేశాడు. స్నేహితుని ఆపరేషన్ సక్సెస్ అయింది. కానీ ఇదే పరిస్థితి తనకే వస్తే లేదా తనవారికే వస్తే? ఏమీ చేయలేని పరిస్థితి. రోజుకు 500 నుంచి 1000 రూపాయలు సంపాదించే తనకు ఇల్లు గడవడమే కష్టంగా ఉంటుంది. ఇలాంటి వారిని ఆదుకోవాలంటే ఎలా?

మొదట్లో తిట్టారు!

సుశాంత్‌కు ఫేస్‌బుక్ ఖాతా ఉంది. తన అభిప్రాయాలను వెల్లడిస్తూ పోస్టులు పెట్టడం అతనికి అలవాటు. "ప్రభుత్వ పాలనలోని లోపాలను ఎత్తిచూపుతూ ఇప్పటివరకూ 500 వీడియోల వరకూ పెట్టి ఉంటానేమో! ఈ విషయంలో నన్ను తిట్టేవాళ్లూ ఉన్నారు. మెచ్చుకుంటున్నవాళ్లూ ఉన్నారు. అప్పుడే అర్థమైంది. సోషల్ మీడియా ఎంత ప్రభావం చూపిస్తుందో అని! అందుకే నా ఆలోచనను సోషల్ మీడియా ద్వారా చేస్తే బాగుంటుందనిపించింది" అని చెప్పాడు సుశాంత్. అందుకే ఎవరికైనా సాయం కావాలని తెలిస్తే వారి దగ్గరికి వెళ్లి, వీడియో తీసి తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. సుశాంత్ పోస్ట్ చేసిన తొలి వీడియోకు మిశ్రమ స్పందన వచ్చింది. కొంత మంది తిట్టారు. అంతా ఉత్తిదే నాటకాలాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు మరికొందరు. కానీ సుశాంత్ ఇవేమీ పట్టించుకోలేదు. క్రమంగా స్పందన వచ్చింది. అవసరమైన వారికి సుశాంత్ ద్వారా సాయం అందడం మొదలైంది.

అక్కడే నిద్ర!

ఎవరికైనా సాయం కావాలని తెలిసిన మరుక్షణం సుశాంత్ స్వయంగా ఆ ప్రాంతానికి బయలుదేరతాడు. వారి పరిస్థితులను వివరంగా తెలుసుకొని వీడియోను షూట్ చేస్తాడు. దూరప్రాంతాలైతే ఒక్కోసారి ప్రయాణ ఖర్చులు తడిసి మోపెడయ్యేవి. కానీ అతను ఎప్పుడూ నిరుత్సాహపడలేదు. ఆటో నడపడమే కాదు ఇతర ఖర్చుల కోసం చిన్న చిన్న ఉద్యోగాలూ చేసేవాడు. వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు తన సొంత ఖర్చులు తగ్గించుకునేవాడు. ఒకవేళ రాత్రిపూట అక్కడే ఉండిపోయే పరిస్థితి వస్తే, బస్టాండ్‌లో లేదా రైల్వే స్టేషన్లో విశ్రాంతి తీసుకోవడానికి కూడా వెనుకాడేవాడు కాదు. కానీ ఇంత చేస్తున్నా కొంతమంది నుంచి అతను ఇప్పటికీ తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నాడు. అయినా సరే తన దారిలో దూసుకెళ్తానని చెబుతున్నాడీ ఆటోవాలా.

కోటిన్నర సాయం!

సుశాంత్ ఇంటర్ పూర్తి చేసుకొని, పై చదువులకు వెళదామనుకునే ప్రయత్నాల్లో ఉన్న రోజులవి. కానీ తండ్రి హఠాన్మరణంతో కుటుంబ భారం అతనిపై పడింది. చదువు మానేసి ఆటోడ్రైవర్‌గా బతుకుబండిని నడపడం మొదలుపెట్టాడు. అందుకే తనలానే ఆపదలో ఉన్నవారికి ఏదో రకంగా సాయం అందించాలన్నది సుశాంత్ ఉద్దేశం. ఈ సోషల్ మీడియా ద్వారా సుశాంత్‌కు తన ఆశయాన్ని నెరవేర్చుకునే అవకాశం వచ్చింది. అతను పోస్ట్ చేసిన వీడియోలకు కొంత మంది దాతలు స్పందించారు. ఇప్పటివరకూ కోటిన్నర వరకూ సేకరించి అవసరమైన వారికి సాయం అందించగలిగాడు సుశాంత్. కానీ రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. మనుషులందరూ మంచివాళ్లే అనుకునే సుశాంత్‌కు కాస్త ఎదురుదెబ్బ తగిలింది.

మోసం చేశారు!

సుశాంత్‌కు ఓ రోజు ఫోన్ వచ్చింది. ఓ పిల్లాడికి కిడ్నీ మార్పిడి చేయాలి, లేదంటే చనిపోతాడని అతని తల్లితండ్రులు ఫోన్‌లో భోరుమన్నారు. సుశాంత్ వారి దగ్గరకు వెళ్లి వీడియో తీసి ఎప్పటిలానే తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశాడు. దాతలు కూడా వెంటనే స్పందించి డబ్బులు అందజేశారు. కిడ్నీ శస్త్రచికిత్స విజయవంతమై ఆ పిల్లాడు క్షేమంగా బయటపడ్డాడు. అయితే కొన్ని రోజులకు మరో ఫోన్ కాల్ వచ్చింది. ఇది కిడ్నీ మార్పిడి చేయించుకున్న ఆ పిల్లాడి కుటుంబం దగ్గర్లో ఉంటున్న వ్యక్తి నుంచి! పిల్లాడి ఆరోగ్య పరిస్థితి నిజమే, కానీ స్వార్థం కోసం అతని తల్లితండ్రులు అనుకున్న దానికంటే ఎక్కువ వసూలు చేశారని అతను చెప్పాడు. వారికి శస్త్రచికిత్స కోసం 20 లక్షలు అవసరమయ్యాయి. కానీ, వారి ఖాతాలోకి ఇంకా అధిక మొత్తం రావడంతో పిల్లాడి తల్లితండ్రులు అత్యాశపడ్డారు. సాధారణంగా సుశాంత్ ఈ విషయం గురించి బాధిత కుటుంబాలతో ముందస్తుగానే ఒప్పందం చేసుకుంటాడు. ఎక్కువ డబ్బు వసూలు అయితే ఇతరులకు సహాయం అందిస్తామని హామీ తీసుకుంటాడు. కానీ ఆపరేషన్ అయ్యాక మిగిలిన డబ్బులతో ఏకంగా స్థలంతో పాటు కారు కూడా కొనుగోలు చేశారని ఆ వ్యక్తి ద్వారా సుశాంత్‌కు తెలిసింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



సుశాంత్ ఫేస్‌బుక్ పేజీ

షాక్ అయ్యాను!

"మనుషుల్లో కూడా ఇలాంటివారు ఉంటారని తెలిసి షాక్ అయ్యాను. కొన్ని సార్లు నమ్మకం వమ్ము అయినంత మాత్రాన మానవత్వం లేదని అనుకోవడం తప్పు. కొంత మంది చెడ్డవాళ్ల వల్ల మంచివాళ్లకు అపకారం జరగకూడదు" అని అంటాడు సుశాంత్. ఎప్పుడూ ఫేస్‌బుక్‌లో బాధితుల అకౌంట్ నంబర్ ఇచ్చే సుశాంత్ ఈ సారి మాత్రం ఓ జాయింట్ అకౌంట్ ఓపెన్ చేస్తానని చెప్పాడు. ఎన్ని కష్టాలొచ్చినా సరే, ఈ మంచి పనిని మాత్రం ఆపనంటున్న సుశాంత్ ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రసిద్ధుడయ్యాడు.









మా ఫ్యామిలీ మార్క్ సినిమా

- అఖిల్



వెంకి అట్లూరి, భోగవల్లి ప్రసాద్, అఖిల్, నిధి అగర్వాల్

"వెంకీ అట్లూరి నాకు 'మిస్టర్ మజ్ను' కథను 2015లో చెప్పారు. దాదాపు ఎనిమిది నెలల క్రితం టీమ్ అయ్యాం. నేను ఇప్పటిదాకా పనిచేసిన వాళ్లల్లో యంగెస్ట్ టీమ్ ఇదే. ఏ రోజూ పనికి వెళ్తున్నట్టు అనిపించలేదు. స్నేహితులను కలవడానికి వెళ్తున్నట్టుగానే అనిపించింది. వెంకీ ప్యాషనేట్ ఫిల్మ్ మేకర్. మా తాతగారిమీద, నాన్నగారి మీద అతనికున్న అభిమానానికి ఈ సినిమా నిదర్శనం. ఆద్యంతం ప్రేక్షకులను రంజింపజేసేలా ఉంటుంది. పూర్తిగా మా ఫ్యామిలీ మార్కు చిత్రమిది. ఎక్కడైనా చిన్న చిన్న గొడవలుంటాయి. మేం వాటన్నిటినీ దాటేసి ఈ సినిమా చేశాం" అని అఖిల్ అక్కినేని అన్నారు. ఆయన హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీయస్‌యన్ ప్రసాద్ నిర్మించిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. శుక్రవారం విడుదల కానున్న ఈ సినిమా గురించి చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌ను నిర్వహించారు. నిర్మాత మాట్లాడుతూ "సినిమా బాగా వచ్చింది. గ్యారంటీగా హిట్ అవుతుంది. నిర్మాతలు హీరోలను బాగా చూసుకుంటారు కానీ మా అఖిల్ నన్ను బాగా చూసుకున్నాడు. ప్రతి 30 ఏళ్లకు ఒకసారి అక్కినేని ఫ్యామిలీకి 'మజ్ను' అనే టైటిల్‌తో ఓ హిట్ వస్తుంది. ఇప్పుడు 'మిస్టర్ మజ్ను'తో మరో హిట్ సిద్ధంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "అఖిల్ ప్లే బోయ్ కేరక్టర్ అని, రామ్‌కామ్ చిత్రమని ఎక్కడో వార్తలు వినిపించాయి. ఈ సినిమాలో అలాంటివి ఉండవు. తొలి 20 నిమిషాలే అఖిల్ నాటీగా కనిపిస్తాడు. ఆ తర్వాత అఖిల్, నిధి మధ్య పుట్టే ప్రేమ, ఫ్యామిలీ ఎమోషన్స్ మెండుగా ఉంటాయి. ఓ ట్రూ ఎమోషన్‌ని చెబుతున్నాం. మజ్ను ఓ ట్రూ లవర్ కథ ఇది. దిల్‌రాజు మనవడు ఇందులో సెకండాఫ్‌లో కనిపిస్తాడు. మా చిత్రంలో నవ్వు, బాధ, ఆలోచన.. అన్నీ కలగలిసి ఉంటాయి. నిధి చాలా బాగా నటించింది. సాంకేతిక నిపుణులందరి ప్రతిభా మా సినిమాకు హెల్ప్ అయింది. 2011లో ఈ కథను రాసుకున్నప్పుడే 'మిస్టర్ మజ్ను' అనే టైటిల్‌ని, అక్కినేని వారసుడితోనే తీయాలనే విషయాన్ని దృష్టిలో పెట్టుకున్నాను. అలాగే జరిగినందుకు ఆనందంగా ఉంది. మా సినిమా పోస్టర్స్ చూసి చాలా మంది 'బచ్‌నా ఏ హసీనో' 'ఆరెంజ్' సినిమా పోలికలున్నాయని అన్నారు. అయితే ఆ సినిమాలతో మా 'మిస్టర్ మజ్ను'కు ఎలాంటి సంబంధం లేదు" అని అన్నారు. ఈ సినిమాలో నటించడం పట్ల నాయిక నిధి ఆనందం వ్యక్తం చేశారు.



ప్రియా ప్రకాశ్ వారియర్, రోషన్, గురురాజ్, అల్లు అర్జున్

నాకు దక్షిణాది అంటే పిచ్చి ప్రేమ!

- అల్లు అర్జున్

"నేను పుట్టింది చెన్నైలో. పెరిగింది హైదరాబాద్‌లో. కన్నడిగులు, మలయాళీలు నన్ను అభిమానిస్తున్నారు. నాకు దక్షిణాది అంటే పిచ్చి ప్రేమ. అందుకే నేను 'సౌతిండియన్ యాక్టర్' అని రాసుకుంటా. దక్షిణాదివాడినని చెప్పుకోవడానికి గర్వపడతాను" అని అల్లు అర్జున్ అన్నారు. ప్రియా ప్రకాశ్ వారియర్, రోషన్ జంటగా నటించిన 'లవర్స్ డే' ఆడియో వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆడియో సీడీలను విడుదల చేశారు. ఒమర్ లులు దర్శకత్వం వహించిన 'ఒరు అడార్ లవ్' చిత్రం తెలుగులో 'లవర్స్ డే' పేరుతో విడుదల కానుంది. ఎ.గురురాజ్, సి.హెచ్.వినోద్‌రెడ్డి నిర్మాతలు. అల్లు అర్జున్ మాట్లాడుతూ "మన చిత్రాలను అన్ని భాషల్లోనూ ఆదరిస్తున్నారు. మలయాళ పరిశ్రమను ఈ చిత్రం ద్వారా తెలుగు పరిశ్రమకు ఆహ్వానిస్తున్నాను. నిర్మాతల్లో ఒకరైన వినోద్‌రెడ్డి 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సమయంలో పరిచయం. అప్పుడు కొన్ని గొడవలు జరిగాయి. 'అంతకు ముందు ఎలా ఉన్నాడో, వినోద్ ఇప్పుడు కూడా అలాగే ఉన్నాడు. అతను మీకు అభిమాని' అని మా బన్నీవాసు చెప్పారు. అప్పుడు నా కోసం నిలిచిన వినోద్ కోసం ఇప్పుడు ఇక్కడికి వచ్చా. ఇలా ఎంతకాలం నిలుచోగలనో తెలియదు కానీ, అవకాశం ఉన్న ప్రతిసారీ నాకోసం నిలుచున్న ప్రతి ఒక్కరి కోసం వచ్చి నిలుచుంటా" అని అన్నారు. నిర్మాతలు ఎ.గురురాజ్, వినోద్ రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా యువతకు తప్పకుండా నచ్చుతుంది. కథ మీద పూర్తి నమ్మకంతో ఉన్నాం. ఫిబ్రవరి 14న చిత్రాన్ని విడుదల చేస్తాం" అని చెప్పారు. "అల్లు అర్జున్‌గారంటే నాకు చాలా ఇష్టం. ఆయనతో స్టేజ్ మీద నిలుచుంటానని ఎప్పుడూ అనుకోలేదు. ఈ సినిమా విడుదల కాకముందే తెలుగువారు ఎంతో సపోర్ట్ చేస్తుండటం ఆనందంగా ఉంది" అని ప్రియా ప్రకాశ్ వారియర్ చెప్పారు. ఈ సినిమాలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని హీరో రోషన్, దర్శకుడు ఒమర్ లులు, మలయాళ నిర్మాత ఔసుపచ్చన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు అడ్డాల చంటి, అశోక్‌రెడ్డి గుమ్మకొండ, అలీ తదితరులు పాల్గొన్నారు.



దీపికా పడుకోన్

అలా అనుకున్నారా!



రణ్‌వీర్ సింగ్

దీపికా పడుకోన్ పారిస్ నుంచి తిరిగొచ్చారు. పారిస్ అనగానే హనీమూన్ ట్రిప్ నుంచి అనుకుంటే పొరపాటే. ఆ ట్రిప్ గత నెలలోనే జరిగిపోయింది. ఆ తర్వాత యధావిదిగా పనిలో పడిపోయారు. మధ్యలో వ్యక్తిగత పనులతో ఆమె పారిస్ వెళ్లారు. ఆ పనులు ముగించుకుని బుధవారం రాత్రి ముంబైకి చేరుకున్నారు. బ్లాక్ హూడీ డ్రెస్, సన్‌గ్లాస్, రూబీరెడ్ కలర్ లిప్‌స్టిక్‌తో దీప్ ప్రత్యక్షమైతే.. 'గల్లీబాయ్' షూటింగ్ ముగించుకుని పసుపురంగు చొక్కా, విచిత్రమైన కళ్లజోడు, గ్రే కలర్ టోపీ ధరించి నిజంగానే గల్లీ బాయ్‌లా తయారై వచ్చి భార్యకు స్వాగతం పలికారు రణ్‌వీర్ సింగ్. ఆ వీడియో క్లిప్‌ను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీగా షేర్ చేశారు రణ్‌వీర్. ప్రస్తుతం ఆయన గల్లీబాయ్ సినిమాతో బిజీగా ఉన్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా వచ్చే నెల 14న ఈ చిత్రం విడుదలకానుంది.



క్షమాపణ చెప్పేది లేదు

- కంగనా రనౌత్

"లక్ష్మీబాయి నా బంధువు కాదు. ఆమె భారతదేశ ముద్దుబిడ్డ.'. 'మణికర్ణిక: క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రంలో రాణి లక్ష్మీబాయి గురించి తప్పుగా చూపించడం లేదని ముందే చెప్పాం. ఇప్పటికీ అదే మాట మీద ఉన్నాం. అందుకు కర్ణిసేన మాకు మద్దతుగా నిలవాలి కానీ కెరీర్ నాశనం చేస్తామని హెచ్చరించడం, సవాళ్లు విసరడం సరైన పద్ధతి కాదు. తప్పు లేకుండా నేను ఎవరికీ క్షమాపణ చెప్పడం జరగదు" అని కంగనా రనౌత్ అన్నారు. ఆమె కీలక పాత్ర పోషించిన చిత్రమిది. క్రిష్ జాగర్లమూడి, కంగన సంయుక్తంగా దర్శకత్వం వహించారు. శుక్రవారం దాదాపు 50 దేశాల్లో విడుదల కానుంది సినిమా. ఇందులో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి వ్యక్తిత్వాన్ని తప్పుగా చూపించారంటూ కర్ణిసేన సంఘాలు కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. సినిమా విడుదల ఆపకపోతే కంగన కెరీర్‌ను నాశనం చేస్తామంటూ కార్యకర్తలు బెదిరింపులకు దిగుతున్నారు. దీనిపై కంగనా మాట్లాడుతూ "నేనూ రాజ్‌పుత్‌నే. తప్పు చెయ్యనప్పుడు ఒకరికి భయపడాల్సిన అవసరం లేదు. నేను భయపడే టైప్ కాదు. తప్పు లేకుండా మరొకరికి క్షమాపణ చెప్పింది లేదు. సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ ఇచ్చినప్పటికీ బెదిరింపులకు పాల్పడితే కర్ణిసేన కార్యకర్తలను నాశనం చేస్తాను' అని ఘాటుగా స్పందించారు. ఆమె వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కర్ణిసేన సంఘాలకు కంగనా క్షమాపణ చెప్పాలనీ, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు బెదిరించారు. క్షమాపణ చెప్పేది లేదంటూ కంగన తేల్చి చెప్పారు. ఇదిలా ఉండగా కర్ణిసేన కార్యకర్తలు సినిమా రిలీజ్ నిలిపివేయాలంటూ ముంబై హైకోర్టులో పిటీషన్ వేశారు. అయితే సినిమాను ఆపలేమంటూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. సినిమాపై వస్తున్న ఆరోపణలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని కోర్టు చిత్రబృందానికి ఆదేశించింది.

ప్రేమికుని మహా తంత్రం



మోహన్‌లాల్

మనుషుల్లో ఉండే రాక్షసత్వాన్ని పోగొట్టడానికీ, ప్రతీకారాన్ని తీర్చుకోవడానికీ, తన ప్రియురాల్ని కాపాడుకోవడానికీ ఓ వ్యక్తి ఎటువంటి తంత్రం ఉపయోగించాడన్న కథాంశంతో రూపొందిన మలయాళ చిత్రాన్ని 'మహా తంత్రం' పేరుతో తెలుగులో అనువదిస్తున్నారు. మోహన్‌లాల్, నయనతార, ముఖేశ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఫాజిల్ దర్శకత్వం వహించారు. వర్మ సమర్పణలో కె. కస్తూరి, సి.హెచ్.సరోజా గంగారామ్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయనీ, మహా శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామనీ నిర్మాతలు చెప్పారు.

నవ్వుల నవాబులు



'హైదరాబాద్ నవాబ్స్' చిత్రం అప్పట్లో ఎంతటి ప్రేక్షకాదరణ పొందిందో తెలిసిందే. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'హైదరాబాద్ నవాబ్స్ 2' సిద్ధమవుతోంది. ఈ చిత్రం టీజర్ లాంచ్ వేడుక గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ చిత్రాన్ని ఉటోపియా ఎంటర్‌టైనర్స్ తెరకెక్కిస్తోంది. ఆర్.కె. అలియాస్ మామా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గురించి ఆర్.కె. మాట్లాడుతూ "మా 'హైదరాబాద్ నవాబ్స్'కి గొప్ప ట్రాక్ రికార్డ్ ఉంది. ఆ సినిమాకు పలు ప్రశంసలు దక్కాయి. లాభాలు తెచ్చిపెట్టిన చిత్రమది. ఆ సినిమాకు ఏమాత్రం తగ్గకుండా తాజా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం" అని అన్నారు. ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్వించడానికి సిద్ధమవుతున్నట్టు ఇతర నటీనటులు తెలిపారు. ఈ చిత్రంలో అజీజ్ నాజర్, అలీ రజ, కె.బి. జాని, అక్బర్ బిన్ తబర్ అద్నాన్ షాజిద్ ఖాన్ (గుల్లు), రఘు కారుమంచి, డా.హరి, నీరు సింగ్, ఫరా, సూఫీ ఖాన్, పూజా కేల్కర్, హుసేన్, సఫీ ఖాద్రీ, సమైరా, మోహిత్, రాజేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

పెళ్లి చేసుకోవాలనుకొంటే..



రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి

సాయి ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఎక్కువగా భ్రమలో బతుకుతూ, పగటి కలలు కంటుంటాడని కంపెనీ అతన్ని ఉద్యోగం నుంచి తొలగిస్తుంది. పెళ్లి చేసుకోవాలనుకుంటే... ఓ సమస్య ఎదురవుతుంది. అది జరగాలంటే ఓ దొంగను పట్టుకోవాలనేది అతనికిచ్చిన టాస్క్. ఆ టాస్క్‌ను సాయి గెలిచాడా లేదా? ఆ దొంగ ఎవరు? అన్నది తెరపైనే చూడాలంటున్నారు ప్రశాంత్ కుమార్. రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి కీలక పాత్రధారులుగా ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మిఠాయి'. ప్రభాత్ కుమార్ నిర్మాత. ఫిబ్రవరి 22న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఇద్దరు స్నేహితుల నేపథ్యంలో నడిచే చిత్రమిది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. సాయి క్యాంరెక్టర్‌లో రాహుల్ రామకృష్ణ చక్కగా నటించారు. ఈ మధ్యన విడుదల చేసిన ప్రచార చిత్రాలు, పాటలకు విశేష స్పందన లభిస్తోంది" అని చెప్పారు.

విధానాలు స్పష్టమైతే భారత్‌కు ఎలక్ట్రిక్ కార్లు

కియా

న్యూఢిల్లీ: భారత మార్కెట్లోకి ఎలక్ట్రిక్ కార్లను సైతం ప్రవేశపెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు దక్షిణ కొరియా ఆటో సంస్థ కియా మోటార్స్ తెలిపింది. ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) విషయంలో ప్రభుత్వ విధానాలపై స్పష్టత లభించిన వెంటనే ఈ టెక్నాలజీ కార్లను భారత్‌కు తీసుకొస్తామని కియా మోటార్ ఇండియా మార్కెటింగ్, సేల్స్ విభాగాల అధిపతి మనోహర్ భట్ తెలిపారు. కియా మోటార్స్ అనుబంధ విభాగమైన కియా మోటార్స్ ఇండియా.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో తన ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. త్వరలోనే ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఈ ఏడాది ద్వితీయార్థంలో తొలి మోడల్‌ను మార్కెట్లోకి విడుదల చేసేందుకు సంస్థ సిద్ధమవుతోంది.

మూడేళ్లకే ఉద్యోగం మారేస్తున్నారు

హోదా, పని ప్రదేశంలోనూ మార్పునకే మిలీనియల్స్ ఓటు

ముంబై: మిలీనియల్స్‌లో 60 శాతం మంది ఎప్పటికప్పుడు కొత్త ఉద్యోగాలనే కోరుకుంటున్నాయని, గత 3 నుంచి 10 సంవత్సరాల మధ్య కాలంలో వారు స్వల్ప కాల వ్యవధిలోనే అంతకన్నా మెరుగ్గా భావించే ఉద్యోగంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని ఇండీడ్ (ప్రపంచ స్థాయిలో ఉద్యోగాల సెర్చ్ ఇంజన్) సర్వేలో తేలింది. తాము గత మూడు నుంచి పదేళ్లకాలంలో కనీసం మూడు సార్లు ఉద్యోగాలు మారినట్టు 56 శాతం మంది చెప్పారని ఆ నివేదిక తెలిపింది. చాలా మంది పనిచేసే ప్రదేశాన్ని కూడా ఒక వస్తువుగానే పరిగణిస్తున్నారని, తమకు సంతృప్తికరంగా ఉన్నంత వరకే దానిలో ఉంటున్నారని ఆ సర్వే తేల్చింది. తాము పని చేస్తున్న ఉద్యోగం తమ అంచనాలకు అనుగుణంగా లేకపోవడం (30 శాతం), పని ప్రదేశంలో పరిస్థితులపై అసంతృప్తి (29 శాతం), మరో కంపెనీలో తమకు అంతకన్నా మెరుగైన పాత్ర లభించడం (38 శాతం) తరచుగా ఉద్యోగాలు మారడానికి కారణాలుగా వారు పేర్కొన్నారు. అలాగే కొత్త నైపుణ్యాలు సముపార్జించుకునేందుకు ఉద్యోగంలో మార్పు చక్కని అవకాశమని 49 శాతం మంది, తమ రెజ్యూమ్‌లో ఎన్ని మార్పులు కనిపిస్తే అంత మెరుగైన అవకాశం లభిస్తుందన్న ఆశ అని 43 శాతం మంది చెప్పారు. చిన్న కంపెనీలతో పోల్చితే 200 నుంచి 500 మంది పని చేసే మధ్యశ్రేణి కంపెనీల్లోనే ఈ ధోరణి ఎక్కువగా ఉన్నట్టు పేర్కొంది. అయితే కంపెనీలు భిన్న వైఖరిని ప్రకటిస్తున్నాయి. తరచుగా ఉద్యోగాలు మారడం వారిలోని అనిశ్చిత వైఖరికి, కంపెనీపై విశ్వాస రాహిత్యానికి నిదర్శనమని యాజమాన్యాలు అంటున్నాయి. 87 శాతం యాజమాన్యాలు స్వల్పకాలంపాటే ఉద్యోగాలు చేసిన చరిత్ర గల అభ్యర్థులను అసలు ఇంటర్వ్యూకు ఎంపిక చేయడంలేదని తెలిపాయి.



చందా కొచర్‌పై సీబీఐ కేసు

వీడియోకాన్ అధిపతి వేణుగోపాల్ ధూత్‌పైనా నమోదు

ఐసీఐసీఐ బ్యాంకు మాజీ అధిపతికి మరిన్ని కష్టాలు



న్యూఢిల్లీ: ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ చీఫ్ చందా కొచర్, ఆమె భర్త దీపక్ కొచర్‌తోపాటు వీడియోకాన్ గ్రూపు అధినేత వేణుగోపాల్ ధూత్‌లపై సీబీఐ ఉచ్చు బిగించింది. వీడియోకాన్‌కు గతంలో ఐసీఐసీఐ బ్యాంక్ మంజూరు చేసిన రుణం విషయంలో క్విడ్ ప్రోకో (నీకిది నాకది) ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసింది. ఈ రుణం కారణంగా బ్యాంక్‌కు రూ.1,730 కోట్ల నష్టం వాటిల్లిందని సీబీఐ అధికారులు అన్నారు. అంతేకాదు, వీడియోకాన్‌కు రూ.1,875 కోట్ల విలువైన ఆరు రుణాలకు క్లియరెన్స్ ఇచ్చిన కమిటీల్లో సభ్యులుగా ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత సీఈఓ సందీప్ భక్షి, సంజయ్ ఛటర్జీ, జరీన్ దరువాలా, రాజీవ్ సభర్వాల్, కేవీ కామత్, హోమీ ఖుస్రోఖాన్‌లనూ విచారించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు.

ధూత్, కొచర్‌ల కార్యాలయాల్లో సోదాలు

బుధవారం రాత్రి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ అధికారులు.. ముంబై, ఔరంగబాద్‌లో వేణుగోపాల్ ధూత్, దీపక్ కొచర్‌లకు చెందిన కార్యాలయాల్లో గురువారం ఉదయం సోదాలు జరిపారు. ఈ ఆరోపణలకు సంబంధించి సీబీఐ 2017 డిసెంబరులోనే ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించింది. 2009 జూన్-2011 అక్టోబరు మధ్యకాలంలో వీడియోకాన్ సంస్థలకు ఇచ్చిన రూ.1,875 కోట్ల విలువైన ఆరు రుణాల్లో అవకతవకలు జరిగినట్లు దర్యాప్తు ఏజెన్సీ గుర్తించింది. ఇప్పటికే దివాలా పరిష్కార చర్యలు ఎదుర్కొంటున్న వీడియోకాన్ గ్రూపునకు ఐసీఐసీఐ బ్యాంక్ మంజూరు చేసిన పలు రుణాలు ఎన్‌పీఏలుగా మారాయి.

ఇదీ కేసు నేపథ్యం

వీడియోకాన్ గ్రూపు 2012లో ఎస్‌బీఐ నేతృత్వంలోని 20 బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ.40 వేల కోట్ల రుణం సేకరించింది. ఈ కన్సార్షియంలో భాగమైన ఐసీఐసీఐ బ్యాంక్ ధూత్ సంస్థలకు రూ.3,250 కోట్ల రుణం మంజూరు చేసింది. ఈ రుణ మంజూరులో వీడియోకాన్ చీఫ్ వేణుగోపాల్ ధూత్ నుంచి చందా కొచర్ కుటుంబం అనుచిత లబ్ధి పొందిందని, వీరి మధ్య క్విడ్‌ప్రోకో జరిగిందన్న ఆరోపణలొచ్చాయి. ఈ ఆరోపణలపై సీబీఐతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెబీ కూడా దర్యాప్తు చేస్తున్నాయి. సీబీఐతోపాటు పలు దర్యాప్తు దర్యాప్తు ఏజెన్సీలు, నియంత్రణ మండళ్లు వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు ప్రత్యక్షంగా విచారించాయి.

ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేయాలి..

దేశీయ బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న మోసాల్లో చందా కొచర్ కేసు చాలా చిన్నదని ప్రజావేగు అరవింద్ గుప్తా అన్నారు. ఐసీఐసీఐ-వీడియోకాన్ రుణ వ్యవహారంలో క్విడ్ ప్రోకో జరిగిందని బయటి ప్రపంచానికి తెలియజేసింది ఇతనే. ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి రుణం తీసుకున్న చాలా కంపెనీలు దివాలా తీసినప్పటికీ, వీడియోకాన్‌కు రుణ మంజూరు విషయంలో మాత్రం కొచర్ అనుచిత లబ్ధి పొందేందుకు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారని ఆయన అన్నారు. బ్యాంక్ షేర్‌హోల్డర్‌గా తన పరిశీలనలు మిగతా వారికీ తెలియాలనే ఈ విషయాల్ని బయటపెట్టానని గుప్తా పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న ఈ తరహా అక్రమాల్ని వెలికితీసేందుకు ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేయాలని ఆయన కోరారు.



మార్కెట్లోకి బెంజ్ వీ-క్లాస్

ప్రారంభ ధర రూ.68.40 లక్షలు

ముంబై: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్.. భారత మార్కెట్లోకి మల్టీ పర్పస్ వెహికిల్ (ఎంపీవీ) వీ-క్లాస్‌ను విడుదల చేసింది. స్పెయిన్‌లో తయారయ్యే ఈ కారును రెండు వేరియంట్ల (ఎక్స్‌ప్రెషన్, ఎక్స్‌క్లూజివ్)లో అందుబాటులోకి తెచ్చింది సంస్థ. ఎక్స్‌ప్రెషన్ ధర రూ.68.40 లక్షలు కాగా.. ఎక్స్‌క్లూజివ్ వేరియంట్ రూ.81.90 లక్షలకు లభించనుంది. 2.2 లీటర్ డీజిల్ ఇంజన్‌తో కూడిన ఈ కారును బీఎస్-6 ప్రమాణాలతో రూపొందించారు. ఈ కారును ఇప్పటికే ప్రపంచంలో 90కి పైగా దేశాల్లో విక్రయిస్తున్నట్లు మెర్సిడెజ్ బెంజ్ తెలిపింది. భారత విలాస కార్ల మార్కెట్‌లో 40 శాతానికి పైగా మార్కెట్ వాటా కలిగిన బెంజ్ వరుసగా నాలుగేళ్ల నుంచి నం.1 కంపెనీగా కొనసాగుతోంది. గత ఏడాది ఈ సంస్థ ఇండియాలో 15,538 వాహనాలను విక్రయించగలిగింది. ఈ ఏడాదిలో విడుదల చేయనున్న పది కొత్త మోడళ్లలో వీ-క్లాస్ మొదటిదని సంస్థ తెలిపింది. ఇండియన్ మార్కెట్లోకి లగ్జరీ ఎంపీవీని ప్రవేశపెట్టడం సంస్థకు ఇది రెండో సారి. ఆశాజనక విక్రయాలు లేని కారణంగా గత లగ్జరీ ఎంపీవీ మోడల్ ఆర్-క్లాస్‌ను 2011లో మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంది.

రాణా వారసుడిగా రవ్‌నీత్!

దాయిష్ బ్యాంక్ ఇండియా సారథికి యెస్ బ్యాంక్ పగ్గాలు

ముంబై: ప్రస్తుతం దాయిష్ బ్యాంక్ ఇండియాకు సారథ్యం వహిస్తున్న రవ్‌నీత్ సింగ్ గిల్.. యెస్ బ్యాంక్ కొత్త ఎండీ, సీఈఓగా నియమితులయ్యారు. ఈనెల 31తో సీఈఓగా పదవీకాలం ముగియనున్న రాణా కపూర్ స్థానంలో గిల్‌ను ఎంచుకున్నట్లు యెస్ బ్యాంక్ బోర్డు ప్రకటించింది. ఈ ఏడాది మార్చి 1న లేదా అంతకంటే ముందే ఆయన తమ బ్యాంక్ పగ్గాలు చేపడతారని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. గిల్ నియామకానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా ఆమోదం తెలిపింది. రాణా కపూర్ పదవి నుంచి వైదొలిగాక గిల్ బాధ్యతలు చేపట్టేంత వరకు బ్యాంక్‌కు ఎవరు సారథ్యం వహిస్తారనే విషయంపైన మాత్రం స్పష్టత లేదు. అయితే, ఈనెల 29న సమావేశం కానున్నట్లు బోర్డు తెలిపింది. ఈ భేటీలో తాత్కాలికంగా ఎవరికైనా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. దేశంలోని ఐదో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ అయిన యెస్ బ్యాంక్ ప్రమోటర్లలో రాణా కపూర్ ఒకరు. ఆయనకు సీఈఓగా రెండో టర్మ్‌ను నిరాకరించిన ఆర్‌బీఐ.. ఫిబ్రవరి 1కల్లా కొత్త సారథిని నియమించుకోవాలని గత ఏడాది సెప్టెంబరులో బ్యాంక్ బోర్డును ఆదేశించింది. ఇందుకు ఆర్‌బీఐ ప్రత్యేక కారణాలేం తెలుపలేదు. అయితే, బ్యాంక్‌లో కార్పొరేట్ గవర్నెన్స్ సమస్యలు తలెత్తడంతోపాటు ఈమధ్యకాలంలో బ్యాంక్ మొండి బకాయిలను తక్కువ చేసినట్లు ఆర్‌బీఐ గుర్తించింది. గత కొంతకాలంగా చోటు చేసుకుంటున్న వరుస ప్రతికూల పరిణామాలు బ్యాంక్‌పై ఒత్తిడి పెంచాయి. ఆ కారణంగానే ఆర్‌బీఐ రాణా కపూర్‌కు రెండో టర్మ్‌ను నిరాకరించినట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. దాంతో బ్యాంక్ కొత్త సారథిని వెతికేందుకు బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) మాజీ చైర్మన్ టీఎస్ విజయన్, ఎస్‌బీఐ మాజీ చైర్మన్ ఓపీ భట్‌లతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది బోర్డు. అయితే ఓపీ భట్‌తోపాటు పలువురు ఈ కమిటీ నుంచి అర్ధంతరంగా వైదొలిగారు. అయినప్పటికీ బ్యాంక్ బోర్డు ఆర్‌బీఐ గడువు తేదీలోగా కొత్త సారథిని నియమించుకోగలిగింది.

ఎవరీ గిల్..?

బ్యాంకింగ్ రంగంలో 3 దశాబ్దాల అనుభవం ఉన్న రవ్‌నీత్ సింగ్ గిల్ 2012 ఆగస్టు నుంచి డాయిష్ బ్యాంక్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలో విద్యనభ్యసించిన గిల్.. హిందూ కాలేజ్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

షేర్లు జూమ్

కొత్త సీఈఓ నియామక వార్తల నేపథ్యంలో యెస్ బ్యాంక్ షేర్లు భారీగా పుంజుకున్నాయి. బీఎస్ఈ ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఒకదశలో 19 శాతం ఎగబాకి రూ.234.90 వద్దకు చేరుకున్న షేర్ల ధర చివర్లో 8.39 శాతం లాభంతో రూ.213.85 వద్ద స్థిరపడ్డాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ట్రేడింగ్ నిలిచిపోయేసరికి 9.20 శాతం లాభంతో రూ.215.40 వద్ద స్థిరపడింది. రెండు ఎక్స్ఛేంజ్‌లలోని బ్లూచిప్ షేర్లలో యెస్ బ్యాంక్ టాప్ గైనర్‌గా నిలిచింది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులో రూ.3,839.42 కోట్లు పెరిగి రూ.49,460.42 కోట్లకు చేరుకుంది. బీఎస్ఈలో బ్యాంక్‌కు చెందిన 1.18 కోట్ల షేర్లు ట్రేడవగా.. ఎన్ఎస్ఈలో 12 కోట్లకు పైగా షేర్లు చేతులు మారాయి.



యెస్ బ్యాంక్ లాభంలో 7% క్షీణత

డిసెంబరు త్రైమాసికంలో యెస్ బ్యాంక్ నికర లాభం 6.96 శాతం క్షీణించింది. ఈ త్రైమాసికానికి బ్యాంకు రూ.1,001.85 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతకు ముందు ఏడాది ఇదే త్రైమాసికంలో బ్యాంకు రూ.1,076.87 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొండి పద్దుల కోసం కేటాయింపులు రూ.550 కోట్లుగా ఉన్నాయి. కాగా సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 41.2 శాతం పెరిగి రూ.2,666.4 కోట్లకు చేరుకుంది. మొత్తం రుణాలు 42.2 శాతం పెరిగి రూ.2,43,885 కోట్లకు చేరాయి. కాగా స్థూల మొండి పద్దులు (ఎన్‌పీఏ) 1.72 శాతం నుంచి 2.1 శాతానికి ఎగబాకాయి. నికర ఎన్‌పీఏలు కూడా 0.93 శాతం నుంచి 1.18 శాతానికి పెరిగాయి.

లక్ష్యాలను నిర్దేశించుకోండి

ప్రపంచ దేశాలకు ఐఎంఎఫ్ సలహా

దావోస్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టీనా లగార్డే గట్టి సందేశాన్ని ఇచ్చారు. ప్రపంచ వృద్ధి రేటును తగ్గించినప్పటికీ సూర్యుడు ఇంకా వెలుగులు విరజిమ్ముతూనే ఉన్నాడని, ఆయా దేశాలు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. అంతర్జాతీయ వృద్ధి రేటు అంచనాలను తగ్గించినప్పటికీ ప్రపంచంలోనే పెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా భవిష్యత్ అంచనాలను సవరించలేదని ఆమె పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యుఈఎఫ్)లో క్రిస్టీనా మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థలను చక్కదిద్దేందుకు అమెరికా, చైనాలు కొన్ని చర్యలు తీసుకుంటుండటంతో వృద్ధి బాటలో సాగే అవకాశాలున్నాయని, అందుకే ఆ దేశాల వృద్ధి రేటును సవరించలేదని తెలిపారు. చైనా ఆర్థిక వ్యవస్థ స్వల్పంగా మందగమనంలో సాగటం మంచిదేనని ఆమె వ్యాఖ్యానించారు. అత్యంత వేగంగా వృద్ధి చెందితే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ, కృష్ణబాబు

క్రూయిజ్ పర్యాటకానికి పెద్దపీట

విశాఖ పోర్టులో క్రూయిజ్ టెర్మినల్

- **రూ.77 కోట్లతో ఏర్పాటు**
- **కేంద్ర షిప్పింగ్ శాఖ సెక్రటరీ గోపాలకృష్ణ**

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): భారత్‌లో అంతర్జాతీయ క్రూయిజ్ పర్యాటకానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్ర షిప్పింగ్ శాఖ సెక్రటరీ గోపాలకృష్ణ తెలిపారు. గురువారం నాడిక్కడ విశాఖపట్నం పోర్టుకు వచ్చిన తొలి అంతర్జాతీయ క్రూయిజ్ 'సిల్వర్ డిస్కవరర్'కు పోర్టు చైర్మన్ కృష్ణబాబుతో కలిసి ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. దేశంలో క్రూయిజ్ పర్యాటకం ఒక పరిశ్రమగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రభుత్వపరంగా మౌలిక వసతులు సమకూర్చడంతో పాటు విధానాలను సరళీకత్రం చేస్తున్నామన్నారు. గత ఏడాది పోర్టు చార్జీలను గణనీయంగా తగ్గించామని, అన్ని పోర్టుల్లో ఒకే విధానం అమల్లోకి తీసుకువచ్చామని, దానివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. విదేశీ పర్యాటకులు రావాలంటే ఆధునిక వసతులతో కూడిన అంతర్జాతీయ టెర్మినళ్లు అవసరమని, వాటిని మేజరు పోర్టుల్లో ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. క్రూయిజ్ పర్యాటకానికి ముంబై హబ్‌గా ఉంటుందని, అక్కడి పోర్టులో నిర్మిస్తున్న భారీ టెర్మినల్ ఈ ఏడాది చివరి నాటికలాల్ల పూర్తవుతుందన్నారు. మరోవైపు చెన్నై పోర్టులో క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణం పూర్తికావొచ్చిందని, కొచ్చిన్‌లో ఆరు నెలల్లో క్రూయిజ్ టెర్మినల్ అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు.కాగా విశాఖపట్నం పోర్టులో కూడా రూ.77 కోట్లతో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌కు టెండర్లు సిద్ధం చేస్తున్నారని గోపాలకృష్ణ వెల్లడించారు. క్రూయిజ్‌లలో వచ్చే పర్యాటకులు విలాసాలకు ఎక్కువగా ఖర్చు చేస్తారని, అందుకు తగిన సౌకర్యాలు స్థానికంగా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

పాత పోర్టులు బెస్ట్..

పాత పోర్టుల్లో ప్రస్తుతం కార్గో వ్యాపారం తగ్గిందని, అటువంటి చోట్ల ప్రత్యామ్నాయంగా క్రూయిజ్ పర్యాటకం అభివృద్ధి చేస్తే బాగుంటుందని గోపాలకృష్ణ అభిప్రాయపడ్డారు. పోర్టుల్లో ఈ-వీసా, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి పనులు సులువుగా జరిగేలా చూడాల్సి ఉందన్నారు. తూర్పుతీరంలో విశాఖపట్నం క్రూయిజ్ పర్యాటకానికి ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖపట్నం పోర్టు చైర్మన్ కృష్ణబాబు మాట్లాడుతూ.. రాబోయే ఐదేళ్లలో క్రూయిజ్ పర్యాటకం పదింతలు అభివృద్ధి సాధిస్తుందన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎలాంటి సదుపాయాలు ఉంటాయో.. వాటిని టెర్మినల్‌లోను కల్పిస్తామని పేర్కొన్నారు. విశాఖ క్రూయిజ్ టెర్మినల్‌ను డిజైన్ ఖరారైన 18 నెలల్లో పూర్తిచేస్తామన్నారు. సిల్వర్ డిస్కవరర్‌లో వచ్చిన పర్యాటకులు విశాఖపట్నం, భీమిలి, సింహాచలం వంటి ప్రాంతాల సందర్శనపై ముక్కువ చూపించారని కృష్ణబాబు తెలిపారు.

బీఎస్-6 నిబంధనలు సవాలే..

- **టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్**
- **తెలుగు రాష్ట్రాల్లోకి 'హారియర్' విడుదల**



హారియర్‌ను విడుదల చేస్తున్న మయాంక్ పరీక్ (కుడి)

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్ స్టేజ్ (బీఎస్) 6 నిబంధనలు దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమకు సవాలుగా మారాయని టాటా మోటార్స్ ప్రెసిడెంట్ (ప్యాసెంజర్ వాహనాల బిజినెస్ యూనిట్) మయాంక్ పరీక్ అన్నారు. 2020 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా ఈ నిబంధనలు అమల్లోకి వస్తున్నాయని, అప్పటి నుంచి బీఎస్-6 నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాహనాల రిజిస్ట్రేషన్ మాత్రమే జరుగుతుందని తెలిపారు. ఈలోపే బీఎస్-4 నిబంధనలతో తయారైన కార్లను విక్రయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. మరోవైపు కొత్త నిబంధనలకు అనుగుణంగా వాహనాలను అప్‌గ్రేడ్ చేయడానికి కంపెనీలు తీవ్రంగా కసరత్తు చేస్తున్నాయన్నారు. గురువారంనాడిక్కడ 'హారియర్' ఎస్‌యూవీని తెలుగు రాష్ట్రాల్లోకి విడుదల చేసిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఎస్-6 ప్రమాణాలతో తెచ్చే కార్ల ధరలు కూడా పెరుగుతాయని చెప్పారు. ఈ కార్లకు అవసరమైన ఇంధన సరఫరాను పెంచేందుకు చమురు కంపెనీలతో మాట్లాడుతున్నామన్నారు. బీఎస్-6 నిబంధనలకు అనుగుణంగా తమ కంపెనీకి చెందిన అన్ని కార్లను అప్‌గ్రేడ్ చేయకపోవచ్చని ఆయన అన్నారు. వీటిలో నానో కూడా ఒకటని చెప్పారు. బీఎస్-6కు ఈ కారును అప్‌గ్రేడ్ చేయకపోతే 2020 ఏప్రిల్ నుంచి ఉత్పత్తి, అమ్మకాలు నిలిచిపోతాయి.

హారియర్ ధర రూ.12.69 లక్షలు

ప్రీమియం మిడ్‌సైజ్ స్పోర్ట్స్ యుటిలిటీ (ఎస్‌యూవీ) హారియర్‌ను టాటా మోటార్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.12.69 లక్షలు(ఎక్స్‌షోరూమ్-హైదరాబాద్).

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి (కిలో)	రూపాయితో ఒక డాలర్ విలువ	ముడి చమురు
86.63	18.30	150	355		
36,195.10	10,849.80	32,340	38,685	71.07	60.64
		మేలిమి 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)			

అమెరికా విపణిలోకి డాక్టర్ రెడ్డీస్ అనస్థీషియా ఔషధం

న్యూఢిల్లీ: అమెరికా మార్కెట్లోకి ప్రొపోఫోల్ ఇంజెక్ట్ ఎమల్షన్ అనే ఔషధాన్ని విడుదల చేసినట్టు దేశీయ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ప్రకటించింది. సాధారణ అనస్థీషియాగా, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న వారికి మత్తు కలిగించేందుకు ఈ నూతన మందు ఉపయోగపడుతుందని సంస్థ వెల్లడించింది. ఇది డిప్రివాన్ (ప్రొపోఫోల్) ఇంజెక్టబుల్ ఎమల్షన్ జనరిక్ వెర్షన్. ఈ ఔషధం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు డిస్ట్రిబ్యూషన్‌ను నియంత్రించనున్నట్లు, ఈ ఔషధ విక్రయం విషయంలో హోల్‌సేలర్లు, డిస్ట్రిబ్యూటర్ల నుంచి ఐడీ స్లిప్ నిబంధనను అనుసరిస్తున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో కంపెనీ పేర్కొంది. గురువారం బీఎస్ఈలో ట్రేడింగ్ ముగిసేసరికి రెడ్డీస్ షేర్ ధర 0.78 శాతం పెరిగి రూ.2,666.20కు చేరుకుంది.

'జెట్'కు నిబంధనల సడలింపుపై ఏ ప్రతిపాదనా అందలేదు: సెబీ

న్యూఢిల్లీ: లిస్టెడ్ ఎయిర్‌లైన్స్ జెట్ ఎయిర్వేస్‌కు నిబంధనల సడలింపు కోరుతూ తమకు ఎలాంటి ప్రతిపాదనా అందలేదని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ స్పష్టం చేసింది. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న జెట్ ఎయిర్వేస్‌కు నిధులు సమకూర్చే విషయంలో నిబంధనలు సడలించాలని గల్ఫ్ ఎయిర్‌లైన్స్ ఎతిహాద్ కోరుతోందన్న వార్తల నేపథ్యంలో సెబీ ఈ వివరణ ఇచ్చింది. జెట్‌లో ఎతిహాద్‌కు 24 శాతం వాటా ఉంది.

మైనర్ రికవరీ

టెక్ వ్యూ

నిఫ్టీ నెగిటివ్ ధోరణిలోనే ప్రారంభమైనా 10800 వద్ద రికవరీ సాధించి సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం 18 పాయింట్ల లాభంతో డే గరిష్ఠ స్థాయిలో ముగిసింది. మార్కెట్ మరోసారి కన్సాలిడేషన్ ట్రెండ్‌లో పడినట్టు కనిపిస్తోంది. మరోసారి 20, 50 డిఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. వచ్చే వారంలో కూడా పాజిటివ్ ట్రెండ్‌లో ఉండాలంటే శుక్రవారం నాటి ముగింపు కీలకం.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 10900 మద్దతు : 10800

* ప్రధాన నిరోధం 10900. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయికన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. మరో ప్రధాన నిరోధం, టార్గెట్ 11000.
* ప్రధాన మద్దతు స్థాయి 10800కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి, స్వల్పకాలిక మద్దతు స్థాయి 10700.
* బ్యాంక్ నిఫ్టీ పాజిటివ్ ట్రెండ్‌లో పయనించినట్టయితే ప్రధాన నిరోధం 27550. మరింత అప్‌ట్రెండ్ కోసం అంతకన్నా పైన బలంగా క్లోజ్ కావాలి.

■ వి.సుందర్ రాజా

ప్రథమార్ధం మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య బహుళ పంచమి
నక్షత్రం : ఉత్తర

ఆర్ద్ర, స్వాతి, శతభిషం నక్షత్ర జాతకులు, కన్య, మకర రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10849.80 (-18.30)

ట్రెండ్ మార్పు వేళలు : 10.41; 12.26

ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 9.50 నుంచి 1.05 మధ్య మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. 1.30 నుంచి చివరి వరకు మరోసారి నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.05 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపికన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

నిరోధం : 10890, 10925

మద్దతు స్థాయిలు : 10810, 10785

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	33,380	33,300	-	33,150	32,360
క్రితం ముగింపు	33,440	33,200	33,430	33,100	32,440
22 క్యారెట్లు	30,910	30,850	-	30,710	30,890
క్రితం ముగింపు	30,970	30,800	30,750	30,670	30,970
వెండి (కిలో)	39,900	40,300	-	40,000	42,100
క్రితం ముగింపు	40,000	40,300	40,000	40,000	42,500

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	402	చిత్తూరు	423
వరంగల్	404	చెన్నై	430
విజయవాడ	417	నమక్కల్	420
గోదావరి	417	బెంగళూరు	415
విశాఖపట్నం	417	ముంబై	457

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	77	విజయవాడ	78
కరీంనగర్	78	గుంటూరు	79
వరంగల్	77	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	77	చిత్తూరు	88
కర్నూలు	77	నెల్లూరు	88
విశాఖపట్నం	75	అనంతపురం	80
గోదావరి	76		

మార్కెట్‌కు రిలయన్స్ దన్ను

87 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్



ముంబై: కొనుగోళ్లు, అమ్మకాల నడుమ గురువారం భారీ ఆటుపోట్ల మధ్య ట్రేడైన మార్కెట్ చివరి కొనుగోళ్ల మద్దతు వల్ల ఒక మోస్తరు లాభాలతో ముగిసింది. ప్రధానంగా మార్కెట్ దిగ్గజాల్లో అగ్రగామి ఆర్ఐఎల్, ఐటీసీ, యెస్ బ్యాంకు ఈ రికవరీకి అండగా నిలిచాయి. రిజర్వ్‌బ్యాంకు లిక్విడిటీ మెరుగుదలకు చర్యలు తీసుకోవడంతో పీఎస్‌యూ బ్యాంకులు లాభాల్లో ట్రేడవుతున్నాయి. రంగాలవారీగా రియల్ఎస్టేట్, ఐటీ మంచి లాభాలు ఆర్జించాయి. చెప్పుకోదగ్గ ఉత్ప్రేరకాలు, పరిణామాలేవీ లేకపోవడం వల్ల కేవలం కార్పొరేట్ రంగం త్రైమాసిక ఫలితాలపైనే మార్కెట్ కదలికలు ఆధారపడి ఉన్నాయని, గురువారం అవి కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల భారీ ఆటుపోట్లు చోటు చేసుకున్నాయని ఎంకే వెల్త్ మేనేజ్‌మెంట్ పరిశోధన విభాగం అధిపతి జోసెఫ్ థామస్ అన్నారు. కాగా రూపాయి బలహీనత, ఫలితాల అండతో ఐటీ షేర్లు బలంగా ప్రదర్శిస్తున్నాయని ఆశికా గ్రూప్ ఈక్విటీ పరిశోధన విభాగం ప్రెసిడెంట్ పరాస్ బోత్రా చెప్పారు. రోజంతా భారీ ఆటుపోట్ల నడుమ సెన్సెక్స్ 260 పాయింట్ల మేరకు ఊగిసలాడి ఒక దశలో 36000కన్నా దిగజారింది. కాని చివరి క్షణంలో లభించిన కొనుగోళ్ల మద్దతు వల్ల 86.63 పాయింట్ల లాభంతో 36195.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 18.30 పాయింట్ల లాభంతో 10849.80 వద్ద క్లోజయింది.

➡ సెన్సెక్స్ షేర్లలో ఆర్ఐఎల్ గరిష్ఠంగా 1.61 శాతం లాభంతో మూడు నెలల గరిష్ఠ స్థాయిలో ముగిసింది. కొత్త సీఈఓ నియామకం వార్తలతో యెస్ బ్యాంక్ షేరు భారీగా 8.39 శాతం లాభపడింది.

➡ ఐటీసీ, టీసీఎస్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, హీరో మోటోకార్ప్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, వేదాంత, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, మహీంద్రా లాభాల్లో ముగిశాయి.

➡ నష్టపోయిన షేర్లలో టాటా మోటార్స్, సన్ ఫార్మా, కోటక్ బ్యాంక్, కోల్ ఇండియా, బజాజ్ ఆటో, ఓఎన్‌జీసీ, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్ అండ్ టీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, మారుతి, బజాజ్ ఫైనాన్స్ ఉన్నాయి.

ఎడెల్‌వీస్ ఫైనాన్షియల్ లాభంలో 18% వృద్ధి

న్యూఢిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి ఎడెల్‌వీస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.258.35 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం (రూ.218.64 కోట్లు)తో పోల్చితే 18.16 శాతం వృద్ధి నమోదైంది. సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం 25.46 శాతం పెరిగి రూ.2,224.23 కోట్ల నుంచి రూ.2,790.69 కోట్లకు చేరుకుంది.

పీవీఆర్ ఆదాయం రూ.857 కోట్లు

న్యూఢిల్లీ: మల్టీప్లెక్స్ చెయిన్ ఆపరేటర్ పీవీఆర్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.857.37 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.55.38 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.560.46 కోట్ల ఆదాయంపై రూ.29.16 కోట్ల నికర లాభాన్ని సంస్థ ఆర్జించింది. చెన్నైకి చెందిన ఎస్‌పీఐ సినిమాస్‌ను కొనుగోలు చేసిన నేపథ్యంలో ఆర్థికఫలితాలను పోల్చి చూడలేమని సంస్థ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 123 స్క్రీన్లను సంస్థ జతచేసుకుంది. దీంతో 64 నగరాల్లో స్క్రీన్ల సంఖ్య 748కి పెరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గృహ రుణాలను అందిస్తున్న హెచ్‌డీఎఫ్‌సీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ)లో కార్యకలాపాలను విస్తరిస్తోంది. కడపలో 13వ శాఖను ప్రారంభించినట్లు హెచ్‌డీఎఫ్‌సీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ వ్యాపార అధిపతి రాజన్ టాండన్ తెలిపారు. ఆర్థికంగా వెనుకబడినవర్గాలు, తక్కువ ఆదాయ గ్రూపులకు సబ్సిడీతో ముడిపడిన రుణాలను ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింది హెచ్‌డీఎఫ్‌సీ అందిస్తోందని వివరించారు. మైనింగ్ కార్యకలాపాలు విస్తరిస్తున్నందున కడప పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం పుంజుకోగలదని భావిస్తున్నామన్నారు.

బయోకాన్ జోరు

మూడో త్రైమాసికంలో రూ.217 కోట్ల లాభం

న్యూఢిల్లీ: బయోటెక్నాలజీ దిగ్గజం బయోకాన్ కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రెండింతలు పెరిగి రూ.217.2 కోట్లకు చేరుకుంది. బయోలాజిక్స్ వ్యాపారం పనితీరు మెరుగ్గా ఉండటం వల్ల లాభాలు వృద్ధి చెందే అవకాశం ఏర్పడింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.91.9 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ రాబడి రూ.1,057.9 కోట్ల నుంచి రూ.1,540.8 కోట్లకు పెరిగింది. కంపెనీ ఇంతకు ముందెన్నడూ లేని విధంగా అధిక రాబడి, లాభంలో వృద్ధిని నమోదు చేసుకుందని బయోకాన్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ మజుందార్‌షా తెలిపారు. బయోలాజిక్స్ సెగ్మెంట్ రాబడి రెండింతలకు పైగా పెరిగిందని, స్థూల మార్జిన్ 30 శాతం పెరిగిందని చెప్పారు. చిన్న మాలిక్యూల్స్, బ్రాండెడ్ ఫార్ములేషన్స్, రీసెర్చ్ సర్వీసుల్లో మంచి వృద్ధి నమోదైందన్నారు. అందుబాటు ధరల్లోనే తమ ఔషధాలను అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గురువారం బీఎస్ఈలో బయోకాన్ షేరు ధర స్వల్పంగా పెరిగి రూ.670.55 వద్ద ముగిసింది.

మోల్డ్‌టెక్ లాభంలో భారీ వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన కేపీఓ, ఐటీ సంస్థ మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ 2018 డిసెంబరు 31వ తేదీతో ముగిసిన మూడో త్రైమాసికంలో 176.64 శాతం వృద్ధితో రూ.33.08 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.11.95 కోట్లు. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం 28.05 శాతం పెరిగి రూ.166.26 కోట్ల నుంచి రూ.212.90 కోట్లకు చేరింది. ఎబిటా 126.68 శాతం పెరిగి రూ.59.43 కోట్లు కాగా ఎబిటా శాతంలో 28 శాతం వృద్ధి చోటు చేసుకుంది. అదే తేదీతో ముగిసిన 9 నెలల కాలంలో కంపెనీ ఆర్జించిన ఆదాయం రూ.682.22 కోట్లు కాగా నికరలాభం రూ.82.95 కోట్లు. గత ఏడాది తొమ్మిది నెలల కాలంతో పోల్చితే ఆదాయంలో 14.86 శాతం, లాభంలో 73.64 శాతం వృద్ధి ఏర్పడింది. ఎబిటా రూ.93.49 కోట్ల నుంచి రూ.141.02 కోట్లకు పెరిగినట్టు కంపెనీ ప్రకటించింది.

విస్తరణకు ఇకెవా నిధుల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన కోవర్కింగ్ కార్యాలయ స్థలాల అభివృద్ధి సంస్థ ఇకెవా విస్తరణ కోసం మీనాక్షి గ్రూప్ నుంచి నిధులు సమీకరించింది. ఆ నిధుల పరిమాణం ఎంతన్నది సంస్థ ప్రకటించలేదు. రానున్నకాలంలో దేశంలోని ప్రధాన నగరాల్లో 15 కొత్త కేంద్రాలను 3 వేల సీట్ల సామర్థ్యంతో ఏర్పాటుచేయనున్నట్టు కంపెనీ తెలిపింది.

కోల్గేట్ లాభం రూ.192 కోట్లు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం కోల్గేట్ పామోలివ్ ఇండియా లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 12.56 శాతం వృద్ధితో రూ.192.10 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.170.65 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం 6.27 శాతం వృద్ధితో రూ.1,041.88 కోట్ల నుంచి రూ.1,107.26 కోట్లకు చేరుకుంది. మార్కెట్లో తాము చేసిన కృషికి మంచి ఫలితాలు లభించాయని, ఆదాయంలో మెరుగైన వృద్ధి నమోదైందని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఇస్సామ్ బచాలానీ తెలిపారు. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం వ్యయాలు 4.49 శాతం పెరిగి రూ.789.99 కోట్ల నుంచి రూ.825.49 కోట్లకు చేరుకున్నాయి.

అల్ట్రాటెక్ రాబడి రూ.9,493 కోట్లు

న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.9,492.94 కోట్ల మొత్తం రాబడిపై రూ.390.43 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.8,056.54 కోట్ల రాబడిపై రూ.456.66 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ఆర్జించింది. మూడో త్రైమాసికంలో దేశీయ అమ్మకాలు 15 శాతం పెరిగాయి. అధిక ఇంధన వ్యయాలు, రూపాయి విలువలో క్షీణత వల్ల మొత్తం వ్యయాలు 11 శాతం పెరిగినట్టు కంపెనీ తెలిపింది. యూఎన్‌సీఎల్ కొనుగోలు కోసం రుణాలు సేకరించినందు వల్ల వడ్డీ భారం ఎక్కువైనట్టు పేర్కొంది. అల్ట్రాటెక్ మొత్తం వ్యయాలు రూ.8,916.44 కోట్లుగా ఉన్నాయి. మౌలిక సదుపాయాలు, అందుబాటు ధరల్లో గృహాల నిర్మాణం పెరుగుతున్న కారణంగా సిమెంట్‌కు డిమాండ్ పుంజుకుంటోందని కంపెనీ పేర్కొంది.

జ్యోతి లాబ్స్ లాభంలో 30 శాతం వృద్ధి

ముంబై: ఎఫ్ఎంసీజీ సంస్థ జ్యోతి లాబొరెటరీస్ స్టాండ్‌ఎలోన్ నికర లాభం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.48.41 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో సంస్థ ఆర్జించిన నికర లాభం (రూ.37.28 కోట్లు)తో పోల్చితే వృద్ధి 29.85 శాతంగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.413.54 కోట్ల నుంచి రూ.441.27 కోట్లకు చేరుకుంది. ఫ్యాబ్రిక్ కేర్ డివిజన్ (ఫ్యాబ్రిక్ వైట్‌నర్, ఫ్యాబ్రిక్ ఎన్‌హాన్సర్, బార్ సోప్, డిటర్జెంట్ పౌడర్) లాభం రూ.37.2 కోట్ల నుంచి రూ.36.6 కోట్లకు తగ్గింది. రాబడి మాత్రం రూ.181.89 కోట్ల నుంచి రూ.192.56 కోట్లకు ఎగబాకింది. డిష్‌వాషింగ్ విభాగం రాబడి రూ.138 కోట్ల నుంచి రూ.150 కోట్లకు చేరుకుంది.

ఎన్ఐఐటీకి ఫారెక్స్ దెబ్బ

న్యూఢిల్లీ: స్కిల్స్, టాలెంట్ డెవలప్‌మెంట్ సంస్థ ఎన్ఐఐటీ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.19.4 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన నికర లాభం రూ.19.7 కోట్లతో పోల్చితే ఇది 1.5 శాతం తక్కువ. సమీక్షా కాలంలో కన్సాలిడేటెడ్ నికర రాబడి 8.7 శాతం పెరిగి రూ.209.4 కోట్ల నుంచి రూ.227.8 కోట్లకు చేరుకుంది. ప్రతికూల విదేశీ మారక (ఫారెక్స్) రేటు కారణంగా రూ.5.2 కోట్ల మేరకు ప్రభావం పడినట్టు తెలిపింది. కార్పొరేట్ లెర్నింగ్ బిజినెస్ (సీఎల్‌జీ) 25 శాతం పెరిగి రూ.161.4 కోట్లకు చేరుకుందని, ఇందులో ఆపరేటింగ్ మార్జిన్ నిలకడగా ఉందని ఎన్ఐఐటీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ కె తదాని తెలిపారు. స్కిల్స్, కెరీర్స్ గ్రూప్ (ఎస్ఎన్‌సీ) నికర రాబడి రూ.63.4 కోట్లుగా ఉందని చెప్పారు. మైండ్ చాంపియన్ లెర్నింగ్ సిస్టమ్స్ లిమిటెడ్ రూ.3 కోట్ల నికర రాబడిని నమోదు చేసుకుందన్నారు.

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM .63(.63)10
ADITYA SPIN. 5.69(5.42)1810
AGRO TECH FO 605.4(598.3)375
AISHWARYA TE 2.99(3.14)5200
ALPHAGEO (I) 470.05(452.35)1289
ALU FLUORIDE 112.5(115.55)10485
AMAR RAJA BA 775.35(781.25)10290
ANDHRA BANK 27.2(27.2)57594
ANDHRA CEMEN 5.1(5.08)5901
ANDHRA PETRO 59.75(62.25)9443
ANJANI PORTL 119.75(123)1888
ASTRA MICRO 80.4(80.6)2501
AUROB.PHARMA 787.8(782.05)75636
AVANTEL LTD 222(223.5)453
AVANTI FEEDS 358.7(362.55)11838
B.N.RATHI SE 25.05(26)39
BALAJI AMINE 480.3(492.5)884
BAMBINO AGRO 183(184)1129
BARTRONICSIN 6.74(6.71)11543
BCG 3.03(3)37044
BHAGIRA.CHEM 430(438.95)4260
BHAGYA INL 34.8(35.85)1464
BHARATFIN 944.1(949.1)604700
BNR UDYOG 18.03(17.68)10
CAMBRIDGE 45.4(45.3)112
CCHHL 7.29(7.88)587
CCL PRODUCTS 273.75(272.1)623
CELESTIAL 7.55(7.56)4699
CIL SECURITS 15.15(15.45)2111
COROM INTER 443(435.2)4165
CUBEX TUBING 14.62(14.95)207
CYBERMATE 1.96(1.9)20540
CYIENT 591.95(598.4)4313
DANLAW TECH. 94.5(98.9)286
DIAMONPOWER 1.5(1.44)3722
DIVI'S LAB. 1494.85(1503.7)12546
DIVYA.GRANIT 102.9(103.9)9273
DQ ENT 7.14(7.69)1800
DR.REDDY'S 2666.2(2645.5)29593
EMPEE SUGARS 1.47(1.41)62
EVEREST ORG. 127.15(125.2)9201
FACOR ALLOYS 2.15(2.1)84851
FOURTH GEN. 2.36(2.25)100
GATI LTD. 76.4(77.4)43911
GAYATRI PROJ 166.4(168.85)1698
GENNEX LAB 3.49(3.57)56695
GMR INFRASTR 15.95(16.15)688059
GODAVARI DRU 22.05(21.2)2585
GOLDSTONE EN 13.7(14.25)13332
GRANULES (I) 96(93.2)314607
GVK POWERINF 6.87(6.96)123777
HBL P SYS 26.7(26.9)6211
HERITGFOOD 515.85(519.05)1276
INCAP LTD. 38.85(37)145
IPAPPM 432.65(443.15)1961
IVRCL LTD .96(.98)41105
KAKATIYA CEM 188.35(192.05)806
KALLAM 16.95(17.65)18716
KAVERI SEED 578(555.75)29702
KCP LTD 86.35(86.8)1430
KERNEX MICRO 25.65(26.45)2582
KNR CONST 210.55(210.9)9324
KREBS BIOCHM 112.1(112.85)119
LOKESH MACH 44.15(44.8)264
LOTUS CHOC 23.25(22.15)1589
MADHUCON PRJ 6.73(6.34)1001
MOLD-TEK TEC 50.25(52)16481
MOSCHIP SEMI 21.4(21.55)7431
MSR INDIA 10.58(10.57)10046
N C L IND. 126.3(126.55)236
NACLIND 27.5(27.1)35
NATCO PHARM 681.65(685.2)12374
NCC 83.9(85.45)447680
NEHA INTER. 4.3(4.3)35857
NETTLINX LTD 44.65(46.95)7341
NEULAND LAB. 504.95(500.35)8522
NIHAR INFO 11.4(11.98)90
NILE LTD. 348.3(354)3643
NTL 1.26(1.26)1
OIL COUNTRY 14(14.2)2549
OLECTRA 238.1(234.25)14619
PADMALAYA TE 2.23(2.23)1001
PALRED 37.85(38.55)705
PANYAM CEMEN 11.92(12.27)4360
PENNAR STEEL 37(37.4)16482
PFL INFOTECH 8.49(8.49)8
PHYTOCHEM I. 43.1(41.75)3003
PITTIENG 55.85(55.2)10609
POKARNA LTD 172.75(168.95)3248
PRAJAY ENGS. 8.5(8.25)2356
PREMIER EXPL 252.8(265.15)16783
PRSMJOHNSN 79.4(80.9)5710
RAIN 119.45(119.6)31249
RAJ PACKAGIN 28.4(27.05)1014
REG.CERAMIC 4.25(4.47)4450
RESTILE CER. 3.82(3.9)439
SAGAR CEM. 644(632)2
SAMKRG PIST. 182.75(187.3)3397
SANGHI IND. 57.5(59)2122
SATVAH.ISPAT 9.11(9.55)2700
SAVEN TECHNO 28.3(27.5)5370
SIBAR AUTO 29.45(29.5)83
SMPL .38(.37)200
SMS PHARMACE 71.95(72.3)859
SREE RAYALA 152.05(152.25)462
STEEL EXCH 13.25(13.75)732
SUJANA INDUS .3(.31)300
SURANATP 4.05(4.39)13532
SURYACHAKRA .28(.29)37950
SURYAMBA SP 67(66.8)920
SURYAVA SPIN 5.17(5.45)56
SUVEN LIFE S 202.1(204.1)25983
TAJ GVK HOTL 182.45(181.45)2661
TANLA 32.85(29.9)79375
TCI INDUS. 910(870)345
TRANSCORP IN 25.5(25.5)1297
TRANSGENE BI 5.81(5.92)21000
TRANSPORT CO 290.3(290.7)500
USHER AGRO 2.38(2.5)205
VICEROY HOTE 3.83(3.99)20809
VIJAY TEXTIL 40.25(40.8)2900
VIMTA LABS 265.4(274.65)6576
VIRAT CRANE 32.5(31.9)502
VIRINCHI 77.4(79.65)19270
VISAKA IND. 393.6(412.15)4635
VISTA PHARMA 27.2(27.95)10896
VIVIMED LABS 25.35(25.65)63422
VST INDUS. 3208.5(3135.85)777
WATERBASE 153.1(156)24469
ZEN TECH 85.55(85)32408
ZENOTECH 32.4(32.1)4429

ఎన్ఎస్ఈ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 601.75(608.1)6200
AARTIIND 1557.3(1536.6)49888
ABAN 71.55(70.6)486038
ABB 1258.35(1293.2)144809
ABFRL 202.95(204.1)1182826
ABGSHIP 1.9(1.9)19527
ACC 1419.7(1429.85)343178
ADANIENT 142.55(143)1678843
ADANIPORTS 380.95(385.2)3633336
ADANIPOWER 52.1(51.75)9678975
ADANITRANS 202.95(207.6)610057
AEGISCHEM 194.8(197.35)102711
AHLUCONT 290.15(295.55)5091
AIAENG 1627.55(1639.4)76062
AJANTPHARM 1164.65(1165.4)153019
AKZOINDIA 1725.2(1739.65)1365
ALBK 43.15(42.05)3527376
ALLCARGO 107.45(109.65)56321
ALOKTEXT 3.75(3.85)2273444
AMARAJABAT 776.4(782.45)228537
AMBUJACEM 211.2(212.4)1682064
ANANTRAJ 34.15(34.25)184546
ANDHRABANK 26.95(27.05)463132
APARINDS 615.55(620.2)2772
APLLTD 588.55(589.25)25002
APOLLOHOSP 1314.65(1293.85)831256
APOLLOTYRE 216.8(218.4)802132
ARVIND 89.55(91.1)1018072
ASHIANA 113(114.15)16726
ASHOKA 120.95(123.55)60196
ASHOKLEY 84.8(89.15)31366207
ASIANPAINT 1401.85(1396.55)1562800
ASTRAL 1055.35(1058.25)12605
ASTRAZEN 1612.35(1653.1)3125
ATUL 3526.7(3536.4)2240
AUROPHARMA 788.8(783.1)1853657
AXISBANK 663.65(661.6)7013582
BAJAJ-AUTO 2651.65(2674.1)183566
BAJAJCON 355.55(356.5)13913
BAJAJELEC 459.05(464)60074
BAJAJFINSV 6407.3(6493.15)108993
BAJAJHIND 8.7(8.8)1094755
BAJAJHLDNG 2939.8(2966.65)39805
BALKRISIND 847.5(864.45)843210
BALLARPUR 3.95(4.05)781672
BALMLAWRIE 185.7(189)59886
BALRAMCHIN 106.3(105.55)823914
BANKBARODA 113(111.3)13283892
BANKINDIA 97.3(97.1)5449282
BASF 1407.9(1470.15)18573
BATAINDIA 1152.85(1160.95)334775
BBTC 1209.35(1208)234998
BEML 870.75(883.3)957971
BERGEPAINT 322.75(320.25)863160
BFUTILITIE 205(205.95)264567
BGRENERGY 55.85(56.5)30266
BHARATFIN 947.75(951.3)222857
BHARATFORG 475.8(490.1)1023064
BHARTIARTL 301.65(303.7)9363696
BHEL 69.05(69.35)6289323
BIOCON 670.1(670.65)1514939
BIRLACORPN 523.3(531.15)31382
BLISSGVS 159.65(159.5)880686
BLUEDART 2992.2(3062.8)1873
BLUESTARCO 607.4(608.25)7599
BOMDYEING 116.75(118.25)438909
BOSCHLTD 19155.4(19090.15)9082
BPCL 353.95(357.15)1647059
BRFL 8.65(8.7)18569
BRIGADE 211.65(210.95)125043
CADILAHC 346.1(342.05)545629
CANBK 262.3(260.45)3700424
CARERATING 1007.55(985.15)504114
CASTEXTECH 1.05(1.1)210494
CASTROLIND 162.9(164.05)769103
CCL 273.85(272.15)36909
CEATLTD 1219.75(1219.5)266821
CENTRALBK 32.5(32.75)128111
CENTURYPLY 167.95(170.7)81070
CENTURYTEX 871.3(885.9)411896
CERA 2576.65(2568.35)2993
CESC 685.45(679.1)465373
CHAMBLFERT 166.55(164.25)179874
CHENNPETRO 262.9(260.15)327647
CHOLAFIN 1159.45(1144.95)252964
CIPLA 500.7(509.3)1620195
CLNINDIA 396.15(400.55)6474
COALINDIA 223.85(225.55)2838220
COLPAL 1321.9(1307.25)1359904
COROMANDEL 443.95(434.2)218705
CORPBANK 27(27.4)101800
COX&KINGS 159.7(157.6)29871
CRISIL 1647.65(1646.45)5887
CUB 190.05(186.95)902113
CUMMINSIND 824.7(821.65)290818
CYIENT 592.05(597.9)78413
DABUR 430.4(430.65)1179389
DBCORP 178.1(180.3)86377
DBREALTY 27.05(26.7)87380
DCBBANK 181.85(179.85)1008066
DCMSHRIRAM 327.65(333.55)35952
DEEPAKFERT 106.1(112.55)1819269
DELTACORP 236.3(237.85)434375
DEN 71.45(71.1)234227
DENABANK 12.85(12.9)674554
DHANUKA 403.55(410.35)10571
DHFL 207.65(209.6)4803404
DISHTV 33.55(33.65)11807720
DIVISLAB 1493.25(1503.3)365424
DLF 177.75(177.25)5827123
DREDGECORP 420.25(429.1)244641
DRREDDY 2668.45(2646.75)611565
DYNAMATECH 1440(1450.3)468
ECLERX 1071.3(1065.45)6428
EDELWEISS 151.75(160.55)2478727
EICHERMOT 20115.6(20089.15)45723
EIDPARRY 202.75(203.35)175317
EIHOTEL 179.9(179.5)27685
ELECTCAST 21.35(21.25)82715
ELGIEQUIP 250.1(250.2)50671
EMAMILTD 418.8(417.9)63993
ENGINERSIN 117.2(116.8)1269245
EROSMEDIA 80.65(81.65)127314
ESCORTS 715.55(730.4)1410155
ESSDEE 16.35(15.6)13929
ESSELPACK 116.9(116.7)121553
EVEREADY 217.35(218.25)74545
EXIDEIND 233.2(241.1)2153736
FCONSUMER 40.05(40.5)745512
FDC 164.6(165.85)39341
FEDERALBNK 88.9(88.5)6256146
FINCABLES 423.45(424.7)22154
FINPIPE 530.5(530.35)8171
FLFL 413.45(420.9)13440
FORTIS 136.35(135.5)599598
FSL 48.9(49.15)1707912
GAIL 333.6(334.2)3384646
GATI 76.4(77.65)276065
GDL 100(105.9)160918
GEPIL 812.7(810.3)4818
GESHIP 291.05(290.7)51863
GET&D 295.7(305.75)23108
GILLETTE 6499.3(6493.65)2805
GLAXO 1406.25(1408.85)7663
GLENMARK 649.75(649.4)523889
GLOBOFFS 13.35(13.1)16015
GMDCLTD 84.7(84.45)28028
GMRINFRA 15.95(16.15)6695516
GODFRYPHLP 958.25(955.75)142196
GODREJCP 790.6(789.8)506573
GODREJIND 522.45(526)218111
GODREJPROP 742.45(715.3)212753
GPPL 87.75(87.65)65309
GRANULES 96.3(93.3)3701722
GREAVESCOT 120.35(119.4)193404
GREENPLY 134.25(137.3)109189
GRINDWELL 569.95(568.6)66552
GRUH 223.2(226.45)654959
GSFC 105.35(105.9)898523
GSKCONS 7255.35(7268.45)9334
GSPL 179.7(180)293814
GUJFLUORO 887.05(884)25192
GULFOILLUB 855.55(852.05)4905
GVKPIL 6.95(6.9)811160
HATHWAY 31.9(31.75)3295603
HAVELLS 702.6(696.2)1172488
HCC 13.25(13.3)2606977
HCL-INSYS 20.95(21.8)1251660
HCLTECH 946.45(944.45)1477391
HDFC 1971.1(1958.25)2194496
HDFCBANK 2102.25(2105.4)2527893
HDIL 27.45(26.95)4301829
HEIDELBERG 148.7(148.65)21392
HEROMOTOCO 2790.2(2795.95)240737
HEXAWARE 326.35(333.1)1147157
HFCL 22.3(22.45)1938246
HIMATSEIDE 212.5(213.65)13319
HINDALCO 205.05(205.45)3917176
HINDCOPPER 47.2(47.95)283628
HINDPETRO 243.1(241.85)4653823
HINDUNILVR 1759.5(1767.2)1350870
HINDZINC 257.95(259.4)359501
HMT 17.75(17.5)1685
HMVL 119.95(122.5)14200
HONAUT 21797.9(22154.2)1186
HOTELEELA 14.9(14.8)78744
HSIL 234.55(228.05)41372
HTMEDIA 41.85(42.25)91334
IBREALEST 84.05(83.35)2307843
IBULHSGFIN 773.5(778.7)3186834
ICICIBANK 364.8(367.4)17521254
ICRA 3092.25(3128.5)580
IDBI 56.05(56.6)4180297
IDEA 34.05(33.9)33984041
IDFC 42.45(42.5)1053049
IFBIND 863.25(838.3)8272
IFCI 13.95(14.05)2656980
IGARASHI 525.15(536.55)5446
IIFL 448.6(428)300722
IL&FSTRANS 9.35(9.8)950212
INDHOTEL 135.65(137.5)708564
INDIACEM 83.7(84)1868534
INDIANB 255.95(248.5)1644817
INDOCO 202.95(207.5)56966
INDUSINDBK 1490.3(1495)1088512
INEOSSTYRO 661.4(672.2)1727
INFRATEL 263(277)11122963
INFY 732(731.65)7429783
INGERRAND 596.55(592.35)11724
INOXLEISUR 248.05(248.05)18320
INOXWIND 71.6(72.35)26945
INTELLECT 212.35(210.7)172656
IOB 13.9(14)253356
IOC 136.8(136.1)6161313
IPAPPM 432.1(443.95)40195
IPCALAB 784.35(781.75)87845
IRB 143.35(147.2)1231285
ITC 278.9(277.3)28026449
J&KBANK 39.1(38.7)856145
JAGRAN 107.45(110)43567
JAICORPLTD 106.7(108)529157
JBCHEPHARM 318(319.55)8916
JBFIND 20(20.65)48934
JCHAC 1780.05(1769.65)431
JETAIRWAYS 265.85(265.5)12514642
JINDALPOLY 249.45(249.7)26094
JINDALSTEL 141.65(139.5)10485698
JISLJALEQS 60.6(60.85)6885259
JKCEMENT 716.95(712.6)11919
JKIL 116.95(118.1)72108
JKLAKSHMI 293.8(296)15105
JKTYRE 95.5(97)228938
JMFINANCIL 83.3(83)569950
JPASSOCIAT 6.75(6.95)11290161
JPINFRATEC 3.5(3.35)1312835
JPPOWER 1.95(1.95)1846265
JSWENERGY 67.8(68.55)285940
JSWHL 2648.7(2485.1)21011
JUBILANT 723.2(757.2)327211
JUBLFOOD 1179.65(1173.25)1660507
JUSTDIAL 482.55(484.4)1423274
JYOTHYLAB 179.9(191.55)669512
KALPATPOWR 375.6(379.5)8047
KANSAINER 454.4(447.7)57956
KEC 253(259.6)414167
KESORAMIND 78.5(81.2)108254
KIRLOSENG 180.4(182.65)8948
KITEX 104.95(107)20674
KOLTEPATIL 265.25(253.45)234454
KOTAKBANK 1267.75(1276.5)1459776
KPIT 128.95(216.65)35704029
KRBL 353.15(361.95)176473
KSCL 576.75(554.65)500097
KSK 1.45(1.45)499954
KTKBANK 120.7(118.5)1397681
KWALITY 7(7.2)1859099
L&TFH 137.5(136.6)3490759
LAKSHVILAS 69.35(70.05)391004
LAOPALA 215.5(216.3)3488
LAXMIMACH 5461.35(5518.35)1112
LICHSGFIN 469.6(466.95)922672
LT 1295.35(1301.45)1654706
LUPIN 868.4(864.6)701634
M&M 697.3(695.85)3891245
M&MFIN 422.25(434.7)2516921
MAGMA 102.6(105.2)59929
MAHINDCIE 231.8(231.4)328177
MAHLIFE 414.35(410.85)31687
MANAPPURAM 99.05(97.9)2850625
MANPASAND 80.5(81.7)113151
MARICO 373.95(376.55)904818
MARKSANS 27.1(27.05)548550
MARUTI 7040.6(7045.4)520703
MAYURUNIQ 371(384.55)8989
MCLEODRUSS 106.55(104.3)359169
MERCK 3306.2(3304.25)6504
MHRIL 205.7(206.5)40659
MINDACORP 147.15(144.9)133588
MINDTREE 910.4(906.55)2027003
MMTC 27.9(28.05)442641
MOIL 160.95(160.9)53540
MONSANTO 2542.7(2553.3)579
MOTHERSUMI 154.05(157.55)5785444
MOTILALOFS 643.3(664.15)202723
MPHASIS 921.25(897.95)522968
MRF 64902.75(66072.05)4134
MRPL 69.65(69.15)535744
MTNL 14.7(14.8)386209
MUTHOOTFIN 541.1(541.7)685146
NATCOPHARM 680.55(688.85)219246
NATIONALUM 61.85(61.7)2839521
NAUKRI 1715.6(1729.05)614949
NAVKARCORP 48(46.2)652473
NCC 83.85(85.35)4326899
NETWORK18 37.25(37.85)121292
NHPC 25.3(25.25)1370740
NIITTECH 1300.7(1274.95)1103506
NITINFIRE 1.55(1.55)83309
NLCINDIA 67.65(68)93834
NMDC 90.1(89.9)973709
NTPC 140.05(140.75)3541981
OBEROIRLTY 471.7(440.2)1096773
OFSS 3796.4(3769.65)20813
OIL 170(170.05)693618
OMAXE 212.95(213.5)403794
ONGC 141.7(143.3)3820645
ORIENTBANK 93.45(92.55)2210599
ORIENTCEM 75.55(74.85)22896
ORISSAMINE 832.35(851.55)6658
PAGEIND 23172.95(22808.85)32985
PARSVNATH 6.8(7)51741
PCJEWELLER 76.75(78.25)7062773
PEL 2307.75(2357.85)377837
PERSISTENT 551.9(544.7)334939
PETRONET 226.3(226.8)1907820
PFC 104.75(101.95)5386754
PFIZER 2682.55(2662.65)12659
PFS 16.2(16.5)433230
PGHH 9921.3(9914.85)1063
PHOENIXLTD 615.2(603.8)78419
PIDILITIND 1109.35(1131.45)2220551
PIIND 853.2(868.3)37792
PNB 78.1(77.75)13272022
POWERGRID 186.75(186.3)3463363
PRAJIND 131.75(134.65)2627595
PRESTIGE 213.95(213.15)107340
PRSMJOHNSN 79.25(80.8)99607
PTC 85.45(84.65)1066850
PUNJLLOYD 3.35(3.5)520821
PURVA 75.15(74.6)46743
PVR 1600.4(1607.2)1643831
RADICO 427.95(421.5)827349
RAIN 120.25(120.05)391171
RAJESHEXPO 574(582.35)166006
RALLIS 163.9(165.4)387351
RAMCOCEM 599.7(600.95)302930
RAMCOSYS 240(245.6)6857
RATNAMANI 890.45(894.3)32263
RAYMOND 796.15(813.9)1010345
RCF 62.2(62.7)640765
RCOM 12.85(12.95)62852835
RECLTD 122.5(120.95)3932407
REDINGTON 73.75(77.8)1207248
RELAXO 723.1(736.35)15564
RELCAPITAL 212.55(208.9)6031067
RELIANCE 1247.45(1226.3)13155185
RELINFRA 282.15(281.75)3634634
RENUKA 10.65(10.65)278926
REPCOHOME 407.95(409.1)416058
RIIL 327(330.35)254156
RKFORGE 488.75(490)94186
RNAVAL 12.55(12.65)943310
ROLTA 6.65(6.95)383650
RPOWER 28.85(28.1)7120092
RTNPOWER 3.6(3.65)1149885
RUCHISOYA 7(7.15)472450
SADBHAV 200.05(199.6)32341
SADBHIN 92.35(94.3)6073
SAIL 48.25(48.55)6284815
SANOFI 6403.45(6403.3)729
SBIN 288.05(286.65)11532528
SCHAEFFLER 5401.95(5411.25)1789
SCHNEIDER 92.35(92.9)37279
SCI 42.75(43.05)104633
SHARDACROP 303.35(300)161677
SHILPAMED 405.7(398.4)13245
SHK 170.75(171.65)214837
SHOPERSTOP 519.8(518.15)11045
SHREECEM 16170.55(16103.35)27535
SHRIRAMCIT 1723.85(1752.2)2069
SIEMENS 1027.95(1045)361633
SIMPLEXINF 168.5(173.3)21029
SINTEX 11.1(11.25)858527
SITINET 9.2(9)380588
SJVN 25.8(25.8)150205
SKFINDIA 1924.85(1924.85)16221
SMLISUZU 611.15(615.65)4919
SNOWMAN 32.7(33.2)76346
SOBHA 502.5(503.1)147789
SOMANYCERA 350.25(353.65)17498
SONATSOFTW 321(321.35)69068
SOUTHBANK 13.8(13.95)9411258
SPARC 171.95(172.7)1758169
SREINFRA 31.1(32.25)4138513
SRF 2094.9(2059.55)200947
SRTRANSFIN 1114.55(1088.05)816136
STAR 530.85(531.5)1859191
STCINDIA 121.7(123.4)53147
SUNDARMFIN 1450.7(1469.75)13666
SUNDRMFAST 524.55(522.25)53963
SUNPHARMA 423(431)18446490
SUNTV 527(529.45)2113026
SUPREMEIND 1045.85(1066)73472
SUVEN 202.5(203.75)217527
SUZLON 5.15(5.15)6256463
SWANENERGY 100.5(98)241421
SYMPHONY 1230.45(1220.1)70470
SYNDIBANK 35.55(35.75)4427381
SYNGENE 588.9(579.4)849347
TAKE 148.45(156.6)102032
TATACHEM 689.2(681.25)379049
TATACOFFEE 93.8(92.5)504200
TATACOMM 521.6(515.15)247811
TATAELXSI 933.3(966.8)1357593
TATAGLOBAL 210.8(210.6)1059068
TATAMOTORS 175.4(180.25)13461254
TATAMTRDVR 92.75(95.55)2739738
TATAPOWER 74.55(75.2)3700318
TATASPONGE 713.05(735.05)73210
TATASTEEL 460.75(464.6)4790846
TATASTLBSL 33.5(34.05)192133
TBZ 63(63.35)32974
TCS 1901.55(1875.6)1962927
TECHM 727.75(720.7)1849102
TEXRAIL 56.4(56.2)195753
THERMAX 1114.95(1090.8)10515
THOMASCOOK 221.2(221.6)78817
TIDEWATER 5302.45(5237.75)594
TIMKEN 556.4(560.7)6356
TITAN 969.65(962.15)1246903
TNPL 230.1(229)36708
TORNTPHARM 1889.05(1909.2)176527
TORNTPOWER 258.5(262.75)902166
TREEHOUSE 4.55(4.55)17992
TRIDENT 66.4(68.95)523338
TRITURBINE 109.15(112.45)8170
TTKPRESTIG 7848.9(8050.5)5678
TTML 3.9(3.9)419973
TV18BRDCST 34.05(34.5)3100470
TVSMOTOR 521.75(531.55)1479385
TVSSRICHAK 2390.1(2393)1042
TVTODAY 361.55(362.55)26038
UBL 1448.3(1444.9)672662
UCOBANK 19.7(19.85)225101
UFLEX 260.05(260.55)37183
ULTRACEMCO 3790.7(3850.65)808713
UNICHEMLAB 205.15(206.95)13817
UNIONBANK 82.5(82.75)6625042
UNITECH 1.75(1.8)6892214
UPL 747.35(762.85)2109205
VAIBHAVGBL 701.35(705.05)5447
VAKRANGEE 44.7(47.05)8644809
VEDL 193.5(192.8)6195845
VIDEOIND 2.9(2.9)168840
VIJAYABANK 45(44.45)1618274
VINATIORGA 1580.95(1589.9)12266
VIPIND 481.05(490.25)223196
VOLTAS 538.7(532.75)677637
VRLLOG 260.85(270.75)44789
VSTIND 3203.8(3167.15)19597
VTL 1073.05(1081.05)5931
WABAG 292.1(294.65)99034
WABCOINDIA 6459.75(6326.5)1617
WELCORP 111(114.85)736259
WELSPUNIND 59.15(59.35)603585
WHIRLPOOL 1480.5(1460.6)51870
WIPRO 351.75(351.55)4230546
WOCKPHARMA 483.6(492.25)794794
WONDERLA 272.65(274.9)12242
ZEEL 433.85(432.85)6954715
ZEELEARN 33.8(34.7)111618
ZYDUSWELL 1305.35(1274.5)6157

కేటీఆర్‌వి పిల్లి శాపాలు

▸ దోచుకోవడం.. దాచుకోవడంపై సర్వహక్కులూ జగన్‌వే

▸ ఆంధ్రలో చిచ్చే బీజేపీ, వైసీపీ, టీఆర్ఎస్ ధ్యేయం: యామిని



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): "ఆంధ్ర సీఎం గురించి మాట్లాడుతున్న పక్క రాష్ట్ర పార్టీలోని యువనేత మాటలు పిల్లి శాపాల్లా ఉన్నాయి. ముందంజలో ఉన్న ఆంధ్రను చూసి ఏంచేయాలో తెలియని నిస్సహాయ స్థితిలో ఉన్న కేటీఆర్ శాపాలు పెడుతున్నాడు" అని టీడీపీ అధికార ప్రతినిధి సాదినేని యామినీశర్మ విమర్శించారు. గురువారం విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'వారానికి 3 రోజులు సెలవులు తీసుకుంటూ 3వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసిన జగన్... కాళ్లు బొబ్బలెక్కడంతో బ్రేకుల్లేని కారెక్కి నోటి కొచ్చినట్టు కారుకూతలు కూస్తున్నాడు. నవరత్నాలను అధికార పార్టీ వారు దొంగలిస్తున్నారని మొసలి కన్నీరు కారుస్తున్నాడు. ప్రజా రంజక పాలనకు, సంక్షేమ పథకాలకు ఆద్యుడు చంద్రబాబు అన్న విషయం జగన్ తెలుసుకుంటే మంచిది. దోచుకోవడం, దాచుకోవడంపై సర్వహక్కులు జగన్‌కే ఉన్నాయి. పాదయాత్రలో పరువు పోగొట్టుకొని, కోడికత్తి డ్రామాతో మతిపోగొట్టుకున్న ప్రతిపక్షనేత... తాజాగా ఎన్ఐఏను అడ్డంపెట్టుకొని, పక్కరాష్ట్ర నేతలతో కలిసి ఏపీలో రాజకీయాలు చేయాలని చూస్తున్నాడు. ఆంధ్రలో ప్రజలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడమే ధ్యేయంగా వైసీపీ, టీఆర్ఎస్, బీజేపీలు ఒక పద్ధతి ప్రకారం పనిచేస్తున్నాయి' అంటూ సాదినేని మండిపడ్డారు.

జన్మభూమి ద్రోహి కన్నా: మంత్రి కాల్వ

"రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్న బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ జన్మభూమి ద్రోహిగా ఎదుగుతారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో గృహ నిర్మాణాలు చేస్తున్నారంటూ కన్నా ప్రచారం చేయడం సిగ్గు చేటు' అని మంత్రి కాల్వ శ్రీనివాసులు రేపల్లెలో ధ్వజమెత్తారు.

ఎవరైనా మా పథకాలు కాపీ కొట్టాల్సిందే: ప్రత్తిపాటి

"టీఆర్ఎస్‌లోని 90% మంది చంద్రబాబు దగ్గర ట్రైనింగ్ తీసుకున్న వారే ఉన్నారు. సంక్షేమ పథకాలను తెలంగాణ నుంచి కాపీ కొట్టాల్సిన పనిలేదు" అని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చినకాకానిలో అన్నారు. 'మోదీని ఎదిరించలేని జగన్ క్రైస్తవులు, ముస్లింల మనోభావాలను ఎలా సంరక్షిస్తారు' అని షేక్ నాగుల్ మీరా ప్రశ్నించారు.

చేతకాదన్న జగన్

▸ మేం చేసి చూపించాం.. కాపు రిజర్వేషన్లపై సుబ్బారాయుడు

అమరావతి/విజయవాడ విద్యాధరపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'కాపు రిజర్వేషన్లు కేంద్రం చేయాలి తప్ప తన చేతిలో లేదని.. తనవల్ల కాదని వైసీపీ అధ్యక్షుడు జగన్ చేతులెత్తేశారు. కానీ, కేంద్రం చేయకపోయినా మేం మా పరిధిలోనే చేసి చూపించాం. జగన్‌కు చేతకానిది మేం చేశాం' అని కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి సుబ్బారాయుడు వ్యాఖ్యానించారు. గురువారం ఆయన సీఎం చంద్రబాబు నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. కాపు రిజర్వేషన్లపై మాట్లాడే నైతిక హక్కును వైసీపీ, బీజేపీ కోల్పోయాయని, ఆ రెండు పార్టీల నేతలు మాట్లాడకపోవడం మంచిదని ఆయన అన్నారు. కాగా, కాపు జాతి మొత్తం చంద్రబాబు వెన్నంటే నడవటానికి సిద్ధంగా ఉందని మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్ విజయవాడలో అన్నారు.

▸ 6న దేవినేని అవినాశ్ ప్రమాణస్వీకారం



తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన దేవినేని అవినాశ్ ఫిబ్రవరి 6వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. వేలాదిమంది తెలుగుయువత కార్యకర్తలు, పార్టీ నేతలతో విజయవాడలో భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసి ఘనంగా బాధ్యతలు చేపట్టనున్నారు.



జయహో బీసీ సన్నాహక సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, వేదికపై మంత్రులు, బీసీ నేతలు

సంఘటితమే బలం

▸ టీడీపీ అంటేనే వెనుకబడిన వర్గాలు

▸ బీసీలు కులాలుగా విడిపోవద్దు.. ఐకమత్యంగా ఉంటే మహాబలం

▸ 'జయహో బీసీ' సన్నాహక సభలో సీఎం

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాలు ఐకమత్యాన్ని చాటాలని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు పిలుపిచ్చారు. 138 కులాలుగా విడిపోతే బలహీనపడతారని, ఈ కులాలన్నీ సంఘటితమైతే బలమైన శక్తిగా మారతారని అన్నారు. బీసీలు-టీడీపీ అనుబంధం 36ఏళ్లుగా అప్రతిహతంగా సాగుతోందని చెప్పారు. 27న రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న 'జయహో బీసీ' సదస్సుకు సన్నాహకంగా గురువారం ఉండవల్లిలోని ప్రజావేదిక వద్ద ముఖ్యమంత్రి బీసీ నేతలతో సమావేశం నిర్వహించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, పితాని సత్యనారాయణ, కాల్వ శ్రీనివాసులు, ఎంపీలు కొనకళ్ల నారాయణ, బుట్టా రేణుక, బీసీ ఫెడరేషన్ల చైర్మన్లు, వివిధ సంఘాల నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు. బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలని, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సీఎం ఈ సందర్భంగా సూచించారు. సమర్థ నాయకత్వం బీసీల్లో రావాలని, సామర్థ్యం ఉన్న వారికి ప్రోత్సాహం అందించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. అవసరమైతే ఎంఎస్ఎంఈలో రిజర్వేషన్లు అమలు చేసి బీసీలు పరిశ్రమలు నెలకొల్పేలా చూస్తామన్నారు. ఇంకా ఏమన్నారంటే..

బీసీలే నా హైకమాండ్..

'తెలుగుదేశం అంటే బీసీలు, బీసీలంటే తెలుగుదేశం! వారికి రాజ్యాధికారమిచ్చింది టీడీపీయే. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కూడా టీడీపీ ఘనతే. ఆ కోటా వల్లే ఈ రోజు అన్ని పార్టీల్లో బీసీ నాయకత్వం ఎదిగింది. బీసీల డిమాండ్లన్నిటినీ పరిశీలిస్తా. వారే నా హైకమాండ్. వారు ఏది చెబితే అదే చేస్తా. రాష్ట్రవ్యాప్తంగా 30 బీసీ సంఘాలు ఈ సన్నాహక సమావేశానికి రావడం సంతోషంగా ఉంది. వెనుకబడిన వర్గాలే టీడీపీకి వెన్నెముక. వారి అండ ఉన్నంత వరకు టీడీపీని ఏ శక్తీ ఏమీ చేయలేదు. పేదరికం లేని సమాజం చూడాలనేది నా ఆశయం.'

అప్పుడు ఎన్నో బాధలు పడ్డారు

'టీడీపీ రాకముందు బీసీలు ఎన్నో కష్టాలు అనుభవించారు. అత్యంత వెనుకబడిన తరగతులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత మాదే. రూ.100 కోట్ల బడ్జెట్ కూడా కేటాయించాం. 11 ఫెడరేషన్లకు మేమొచ్చాక ప్రత్యేక గుర్తింపు వచ్చేలా చేశాం. అందుకే రాజమహేంద్రిలో జయహో బీసీ సభ నిర్వహిస్తున్నాం.'

బీసీల ఆదాయం పెంచుతాం

'బీసీలకు న్యాయం జరిగే వరకు, వారి ఆదాయం పెరిగే వరకు అండగా ఉంటాం. చేతివృత్తులే బీసీల ఆస్తి. ప్రపంచీకరణ వల్ల చేతివృత్తులు దెబ్బతిన్నాయి. ఆధునిక పనిముట్లను 90% సబ్సిడీతో ఇస్తున్నాం. నాడు అక్కసుతోనే వైఎస్ ఆదరణ పథకం రద్దు చేశారు. దీంతో కులవృత్తిదారులు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. 2014లో టీడీపీ గెలవగానే ఆదరణ-2ను ప్రారంభించాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 600 రకాలకు పైగా ఆధునిక పనిముట్లను తీసుకొచ్చి బీసీలకు అందించి వారి కష్టాలు తీర్చాం. ఇంకా ఆధునిక పనిముట్లు అందిస్తాం.' అధికారముందనే గర్వం, ఏమరుపాటు నాకు లేదు. జీవితాంతం వెనుకబడిన వర్గాలకు రుణపడి ఉంటా. సీఎంగా ఇక్కడ నిలబడి మాట్లాడుతున్నానంటే దానికి కారణం వారే. టీడీపీకి ఇప్పటికీ ఎక్కువ ఓట్లు వేసేది బీసీలే. వారిని మరిచిపోతే నన్ను నేను మరచినట్లే. టీడీపీతోనే న్యాయం జరుగుతుందని వారు పెట్టుకున్న నమ్మకం నా బాధ్యతను మరింత పెంచింది.'

బీజేపీ ఆటలు సాగవు..

'బీజేపీ ఆడే ఆటలు తెలుగు ప్రజల ముందు సాగవు. దేశంలో అన్నీ పార్టీలది ఒక దారి. జగన్, కేసీఆర్‌ది మరో దారి. మోదీని మళ్లీ గెలిపించేందుకు వారిద్దరూ తపనపడుతున్నారు. మోదీ ఓడితేనే ఆంధ్ర గెలుస్తుంది. కోడికత్తి పార్టీతో జట్టుకట్టి రాష్ట్రానికి అన్యాయం చేయాలని హైదరాబాద్ మోదీ (కేసీఆర్) ప్రయత్నిస్తున్నారు.'

ఆ పార్టీలకు శ్రద్ధలేదు..

'పేదల్లో ఎక్కువ మంది బీసీలే. అందుకే వారి ఉన్నతికి కృషి చేస్తున్నాం. కులవృత్తులు, చేతివృత్తులతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వారి కోసం ఆదరణ పథకం ప్రవేశపెట్టాం. మిగిలిన పార్టీలు ఎప్పుడూ బీసీల గురించి ఇంత శ్రద్ధ తీసుకోవు.. మాట్లాడవు. టీడీపీకి అండగా ఉండే వారి రుణం వచ్చే ఐదేళ్లలో తీర్చుకుంటా. పసుపు-కుంకుమ కింద డ్వాక్రా సభ్యులకు మరో రూ.10 వేలు ఇవ్వనున్నాం. ఇందులో ఎక్కువ లబ్ధిపొందేది బీసీలే. టీడీపీకి మద్దతుదారులనే కక్షతో గత ప్రభుత్వాలు బీసీలకు ఏమీ చేయలేదు. టీడీపీ బలపడుతుందనే బీసీలను అణచివేశారు. చంద్రన్న బీమా, పెళ్లికానుక వంటి సంక్షేమ పథకాలతో పాటు, అన్న క్యాంటీన్ల ద్వారా ప్రజాసేవ చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో పేద చిన్నారుల కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని నేనే ప్రవేశపెట్టాను'.

ఆడబిడ్డలకు అండ

▸ పసుపు-కుంకుమ ద్వారా మరో రూ.10 వేలు

▸ 93,81,118 డ్వాక్రా సభ్యులకు లబ్ధి

▸ ఏప్రిల్ 5 లోగా మూడు విడతల్లో పంపిణీ

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆడబిడ్డలకు ప్రభుత్వం మరోమారు ఆర్థికంగా చేయూత ఇవ్వనుంది. పసుపు-కుంకుమ పేరుతో ఇప్పటికే ఒక్కో డ్వాక్రా సభ్యురాలికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం చేసిన ప్రభుత్వం... మరోసారి రూ.10వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేటగిరీల్లో కలిపి 93,81,118 మంది పొదుపు సంఘ సభ్యులకు మూడు విడతలుగా ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఫిబ్రవరి 1న తొలి విడతగా రూ.2500, మార్చి 8న రెండో విడతగా రూ.3500, ఏప్రిల్ 5న మూడో విడతగా రూ.4వేలు అందించాలని నిర్ణయించింది. సీఎం చంద్రబాబు శుక్రవారం కడప, అమరావతి, విశాఖపట్నం సభల్లో డ్వాక్రా సంఘాలకు ఈ విషయం వివరించనున్నారు. డ్వాక్రా పొదుపు సంఘాల ద్వారా మహిళల జీవనోపాధికి కావాల్సిన పెట్టుబడులకు రుణాలు ఇప్పించి వారు నెలకు రూ.10వేలకు తక్కువ కాకుండా కుటుంబ ఆదాయం పొందాలన్నది ప్రభుత్వ ఆశయంగా ఉంది. రాష్ట్రంలో 2014 మార్చి 31 నాటికి ఉన్న 86,04,304 మంది డ్వాక్రా సభ్యులకు పెట్టుబడి నిధి కింద ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.8604కోట్లు మంజూరు చేసి వారి సంఘాల పొదుపు ఖాతాలకు నాలుగు విడతలలో ప్రభుత్వం జమచేసింది. రుణాలపై బ్యాంకులు విధించిన వడ్డీ నిమిత్తం 2014 ఫిబ్రవరి నుంచి 2016 జూలై వరకూ రూ.2514 కోట్లు బ్యాంకులకు చెల్లించింది.

వైసీపీలో ఎన్నో అవమానాలు

▸ నా సీటుపై అబద్ధాలాడారు

▸ నా తండ్రి విగ్రహావిష్కరణకు వాళ్ల అనుమతి తీసుకోవాలా?

▸ తండ్రిలేని వాడినని జగన్ జాలిపడ్డారట!

▸ వదిలేస్తే గాలికి కొట్టుకుపోతానట

▸ రంగా ఆశయాలు నెరవేర్చడమే లక్ష్యం

▸ వైసీపీలో ఉంటే అది సాధ్యపడదు

▸ నా తండ్రి హత్య కొందరు వ్యక్తుల పని

▸ దానిని టీడీపీకి ఆపాదించడం సరికాదు

▸ మీడియాతో వంగవీటి రాధా



విజయవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీలో కొన్నేళ్లుగా తాను ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని వంగవీటి రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ తెలిపారు. అలాంటి అవమానాలు ఇంకెవరికీ ఎదురు కాకూడదని కోరుకుంటున్నానని చెప్పారు. ఈ నెల 25/26 తేదీల్లో ఆయన టీడీపీలో చేరతారని వార్తలు వస్తున్న నేపథ్యంలో గురువారం ఆయనే విజయవాడలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇకపై ప్రజాజీవితంలో ఆంక్షలు లేకుండా ముందుకు సాగాలనుకుంటున్నట్లు చెప్పారు. వైసీపీకి రాజీనామా చేయడానికి కారణాలను వివరించారు. తన తండ్రి రంగా ఆశయాలను నెరవేర్చడమే తన లక్ష్యమన్నారు. 'సొంత తమ్ముడికన్నా ఎక్కువగా చూసుకుంటానని జగన్ ఆనాడు చెప్పారు. పార్టీలో చేరాక భిన్నమైన పరిస్థితులు ఎదురయ్యాయి. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను. కొందరు నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించినా భరించాను. పార్టీలో తానే సర్వం.. తాను చెప్పిందే వేదమన్నట్లుగా జగన్ వ్యవహరిస్తున్నారు. అడుగడుగునా ఆంక్షలు విధించారు. చివరకు నా తండ్రి విగ్రహావిష్కరణకు వెళితే.. 'ఎవరికి చెప్పి వెళ్లావ్.. నీ ఇష్టమా? ఇది నా పార్టీ.. తండ్రి లేనివాడివని జాలి చూపిస్తూ గుప్పిట్లో పెట్టుకున్నాను. వదిలేస్తే గాలికి కొట్టుకుపోతావని జగన్ బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. రంగా అభిమానులు అన్ని పార్టీలు, అన్ని కులాలు, అన్ని మతాల్లో ఉన్నారు. ఈ విషయం జగన్‌కు అర్థంకాకపోతే నేనేమీ చేయలేను. నా తండ్రి అభిమానులంతా కలిసి విగ్రహం పెట్టారు. నా తండ్రి విగ్రహావిష్కరణకు వెళ్లడానికి వైసీపీ లోకల్ ఇన్‌చార్జి పర్మిషన్ తీసుకోవాలట.. రంగాపై అభిమానంతో కొంతమంది భోజనాలు పెడితే.. అది కూడా నా పొరపాటేనట! ఈ కారణాలతోనే గత సెప్టెంబరు 11 నుంచి నన్ను పార్టీలో దాదాపుగా పక్కన బెట్టారు. సొంత తమ్ముడిలా చూసుకుంటానని చెప్పిన జగన్.. ఈ 4నెలల్లో ఒక్కసారి కూడా ఫోన్ చేయలేదు. నన్నే కాదు.. సొంత పార్టీ ఎమ్మెల్యేలనే పూచిక పుల్లల్లా తీసి పారేస్తున్నారు. నా సీటుపై ఎన్నో అబద్ధాలు ఆడారు. అక్కడకు వెళ్లు.. ఇక్కడకు వెళ్లు అంటూ ఆడుకున్నారు. సూటిపోటి మాటలతో బాధపెట్టారు. ఈ అవమానాలన్నిటినీ దిగమింగుకుంటే చేతగానివాడిగా లెక్కగట్టారు. ఇంకా ఆ పార్టీలో ఉంటే నా తండ్రి ఆశయాలను నెరవేర్చడం సాధ్యపడదని అర్థమైంది. అందుకే రాజీనామా చేశాను' అని చెప్పారు.

సోషల్ మీడియాలో బెదిరింపులు

వైసీపీకి రాజీనామా చేశాక ఆ పార్టీ నాయకులు తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని రాధా ఆరోపించారు. 'సోషల్ మీడియాలో గ్రూపులను క్రియేట్ చేసి నన్ను చంపుతామంటూ బెదిరింపులకు సైతం దిగారు. ఇలాంటి బెదిరింపులకు, దాడులకు భయపడి పారిపోయే వాడిని కాదు. బెదిరిస్తున్న సోషల్ మీడియా గ్రూపుల ఐపీ అడ్రస్‌లతో సహా పూర్తి వివరాలను పోలీసులకు అందజేయగలను. అయితే ఆ గ్రూపులను తాము క్రియేట్ చేయలేదంటూ కింది వాళ్లను బలి చేస్తారు. ఎవరి దయాదాక్షిణ్యాలపైనో ఆధారపడి నేను ప్రజాజీవితంలో కొనసాగడం లేదు! జగన్ జాలి చూపిస్తే రాజకీయాల్లో లేను. ప్రజల అభిమానంతోనే ముందుకు సాగుతున్నా. జగన్ ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని రంగా అభిమానులను గౌరవిస్తే మంచిది. లేదంటే ప్రజలు క్షమించరు' అని తేల్చిచెప్పారు. రూ.వంద కోట్లు తీసుకుని టీడీపీలో చేరడానికి సిద్ధపడ్డాననే ఆరోపణలు పనికిమాలినవని రాధా కొట్టిపారేశారు. ఆ డబ్బులు బ్యాగుల్లో ఇచ్చారా? సూట్‌కేసుల్లో ఇచ్చారా? నిరూపిస్తే ఆ సొమ్మునంతా వారికే ఇచ్చేస్తానని సవాల్ చేశారు.

రేపు సాయంత్రం టీడీపీలోకి రాధా?

వైసీపీకి రాజీనామా చేసిన వంగవీటి రాధాకృష్ణ 26వ తేదీ సాయంత్రం టీడీపీలో చేరనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సాయంత్రం 4 గంటలకు రాధాను పార్టీలో చేర్చుకోవడానికి ముహూర్తం నిర్ణయించినట్లు తెలిసింది.

మేమలా చేయడం పొరపాటు..

తన తండ్రిని కొందరు వ్యక్తులు హత్య చేస్తే.. దానిని టీడీపీకి ఆపాదించడం సరికాదని ఒక ప్రశ్నకు సమాధానంగా రాధా చెప్పారు. 'టీడీపీలోనూ రంగాను అభిమానించేవాళ్లు ఉన్నారు. వారంతా వచ్చి ఎవరో చేసిన పనిని పార్టీకి ఎలా ఆపాదిస్తారు? ఆ ఘటనతో మాకేమైనా సంబంధం ఉందా అని అడిగారు. దానికి నా వద్ద సమాధానం లేదు. అప్పుడున్న పరిస్థితుల్లో మా వాళ్లను కాపాడుకోవడం కోసం టీడీపీయే నా తండ్రిని పొట్టనపెట్టుకుందంటూ మేం కూడా ఆవేశంలో అనాలోచితంగా ప్రజలను రెచ్చగొట్టేలా ప్రకటనలిచ్చాం. రంగాను అభిమానించేవాళ్లు అన్ని పార్టీల్లోనూ ఉన్నారనే వాస్తవాన్ని మర్చిపోయాం. అది మా పొరపాటే' అని తెలిపారు. రంగా కుటుంబం పదిమందికీ ఉపయోగపడుతుందని, రంగాను ఒక వ్యక్తిగా కాకుండా ఒక వ్యవస్థగా గుర్తించారు కాబట్టే టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దమనసుతో తనను గౌరవంగా పార్టీలోకి ఆహ్వానించారని చెప్పారు. విజయవాడలోని పేదలందరికీ ఇళ్ల పట్టాలివ్వాలనేది తన తండ్రి ఆశయమని, దానిని నెరవేర్చి రంగా అనే వ్యవస్థను బతికించాలని తాను కూడా సీఎంను కోరుతున్నానని చెప్పారు. మీ సామాజిక వర్గాన్ని ఆకట్టుకోవడం కోసమే టీడీపీ మిమ్మల్ని ఆహ్వానించిందనే వాదనలు వినిపిస్తున్నాయని అడిగినప్పుడు.. రాధా ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగా అభిమానులు అన్ని కులాలు, మతాలు, పార్టీల్లోనూ ఉన్నారని, ఆయన ఆశయాలను ఎవరు నెరవేరిస్తే వారికే అండగా నిలుస్తారని స్పష్టం చేశారు.



వైసీపీ విధానాలు నచ్చకే రాజీనామా

▸ జగన్‌కు చెప్పినా ప్రయోజనం లేదు

▸ ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబే మళ్లీ రావాలి

▸ రాజకీయ భవిష్యత్‌పై ఫిబ్రవరిలో నిర్ణయం

▸ 'ఆంధ్రజ్యోతి'తో ఘట్టమనేని ఆదిశేషగిరిరావు

విజయవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో చంద్రబాబే సమర్థుడైన నాయకుడని ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన సూపర్‌స్టార్ కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు చెప్పారు. వైసీపీలో ఒంటెద్దు పోకడలు తప్ప నాయకుల అభిప్రాయాలకు ఎలాంటి విలువ లేదని వ్యాఖ్యానించారు. గురువారం ఆయన సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆదిశేషగిరిరావు 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

వైసీపీకి రాజీనామా చేయడానికి కారణాలు..

వైసీపీలో జరుగుతున్న పరిణామాలు, విధివిధానాలు నాకు నచ్చలేదు. ఏడాదిగా ఎన్నో సూచనలు చేశాను. పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధులు అసెంబ్లీకి దూరంగా ఉండటం సరికాదన్నది నా అభిప్రాయం. ప్రతిపక్షంగా వైసీపీ సరైన పాత్ర పోషించలేదు. ప్రజల సమస్యలపై అసెంబ్లీలో పోరాటం చేయకుండా బయట ఉండిపోవడం దురదృష్టకరం. ప్రత్యేక హోదా విషయంలో ఆ పార్టీ సాధించింది లేదు. ఒంటెద్దు పోకడలు తప్ప అక్కడ ఏమీ లేదు. అందుకే మనస్థాపం చెందే పార్టీ నుంచి బయటకు వచ్చాను. సమస్యల గురించి అప్పుడప్పుడు జగన్‌కు చెబుతూనే ఉన్నా. 'సరే చూద్దామన్నా..' అనడం తప్ప ఏ ప్రయోజనం కనిపించలేదు. 'జనం నన్ను చూసి ఓటేస్తారు..' అన్న అభిప్రాయంలో జగన్ ఉన్నారు.

చంద్రబాబుతో ఏం మాట్లాడారు?

మర్యాదపూర్వకంగానే సీఎంని కలిశాను. చంద్రబాబుతో నాకు 40 ఏళ్లుగా పరిచయం. పింఛన్లు, డ్వాక్రా మహిళలకు సాయం నిజంగా మంచి ఆలోచనలు. పోలవరం, పట్టిసీమ విషయంలో వైసీపీది తప్పటడుగు. వీటిని అడ్డుకోవడం చాలా తప్పు. పట్టిసీమ ప్రాజెక్టుతో కృష్ణా డెల్టా రైతులకు చాలా ప్రయోజనం చేకూరింది. ఇది కళ్లకు కనిపించే నిజం. కానీ వాటిలో అవినీతి జరిగిందంటూ ఆ ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నం సరికాదు.

టీడీపీలో ఎప్పుడు చేరనున్నారు?

ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సీఎంను కలిసినప్పుడు కూడా ఎలాంటి చర్చలు జరగలేదు. ఫిబ్రవరి మొదటివారంలో రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం వెల్లడిస్తాను. సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు అభిమానులు సానుకూలంగా స్పందిస్తున్నారు. కృష్ణ అనుమతి లేకుండా నేను ఎలాంటి పని చేయను. అలాగే నేను తీసుకున్న నిర్ణయాలనూ ఆయన కాదన్నది లేదు. మహేశ్‌ను రాజకీయాలకు దూరంగా ఉండమని చెబుతాను.

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే మంచిది?

రాష్ట్రం ముందుకెళ్లాలంటే మరోసారి చంద్రబాబును బలపర్చాలన్న అభిప్రాయం జనంలో బలంగా ఉంది. మౌలిక సదుపాయాల కల్పనలో సీఎంకు ముందుచూపు ఉంది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో అనేక సమస్యలున్నాయి. వాటిని అధిగమించాలంటే ఆయనే సరైన నాయకుడన్నది నా వ్యక్తిగత అభిప్రాయం కూడా. అందరూ సమర్థులమని చెప్పుకుంటారు కానీ, ఎవరి సమర్థత ఏమిటో జనాలకు ఇట్టే అర్థమవుతుంది.

చంద్రబాబుకే మళ్లీ అధికారం

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ మధ్యే ప్రధానంగా పోటీ ఉంటుంది. చంద్రబాబుకే ప్రజలు మళ్లీ అధికారం ఇస్తారు. 30 ఏళ్లు కాంగ్రెస్‌లో ఉండి, వైఎస్ఆర్‌తో సన్నిహితంగా ఉన్నా. జగన్ తీరు నచ్చక వైసీపీ నుంచి బయటికి వచ్చాను. వైసీపీలో పారదర్శకత లేదు' అని ప్రముఖ వ్యాపారవేత్త ఘట్టమనేని ఆదిశేషగిరిరావు అన్నారు. ఆయన గురువారం ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబును కలిశారు. ఆపై విలేకర్లతో మాట్లాడారు. 'ఏపీలో చంద్రబాబు పరిపాలన బాగుంది. వచ్చే ఎన్నికల్లో ఆయనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. పింఛన్లు రెట్టింపు చేయడం, డ్వాక్రా మహిళలకు లబ్ధి కల్పిస్తూ, పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న చంద్రబాబుకు అభినందనలు. అవి తెలిపేందుకే ఆయనను మర్యాదపూర్వకంగా కలిశాను.



హత్యలకు పవనే కారణం

▸ ప్రశాంత మన్యంలో ఆయనే ఆజ్యం పోశారు

▸ మా కుటుంబాలను కనీసం పరామర్శించలేదు

▸ మంత్రి శ్రావణ్‌కుమార్, సివేరి అబ్రహం ధ్వజం

పాడేరు, జనవరి 24: క్వారీల విషయంలో సీఎం చంద్రబాబు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇద్దరు గిరిజన నేతలు కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమ ప్రాణాలు కోల్పోయారంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం ఖండించారు. ఆనాడు పవన్ పాడేరు సభలో గూడ క్వారీపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వల్లనే ఇద్దరు గిరిజన నేతలు హత్యకు గురయ్యారని వారు ఆరోపించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి ఫోన్‌లో మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న మన్యంలో పవన్ ఆజ్యం పోశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాక్సైట్ తవ్వకాల జీవోలను సీఎం చంద్రబాబు రద్దు చేశారని, తన తండ్రి సైతం బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగానే పోరాటం చేశారని గుర్తుచేశారు. బాధలో ఉన్న తమ కుటుంబాలను కనీసం పరామర్శించడానికి రాని పవన్ కల్యాణ్ ఇప్పుడు గిరిజనుల సంక్షేమం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాగే, పాడేరులో సివేరి అబ్రహం విలేకరులతో మాట్లాడుతూ పాడేరు సభలో పవన్ రెచ్చగొట్టిన కారణంగానే మావోయిస్టుల చేతిలో ఇద్దరు నేతలు హత్యకు గురయ్యారన్నారు.


కిడారి, సివేరి హత్య కేసు.. నిందితుడికి 31 వరకు రిమాండ్


విజయవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్య కేసులో నిందితుడు ధర్మయ్యను కస్టడీ ముగియడంతో ఎన్ఐఏ అధికారులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. అతనికి ఈనెల 31 వరకు కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం రాజమండ్రి జైలుకు తరలించారు.

జమ్మలమడుగులో చెలిమి!

సీటు పంచాయితీకి బాబు చెక్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంపై టీడీపీ అధినేత చంద్రబాబు కొత్త వ్యూహం ఎంచుకొన్నారు. సీటు పంచాయితీకి విరామం ఇచ్చి... ముందు అక్కడి రెండు వర్గాలూ కలసి పనిచేయాలని ఆదేశించారు. 'అక్కడ ఏ సీటు ఎవరికో నేను నిర్ణయం తీసుకొంటాను. సర్వే చేసి ప్రజాభిప్రాయం ప్రకారం నేను వెళ్తా. ముందు మీరిద్దరూ నియోజకవర్గంలో కలసి పనిచేయండి. మీడియా ముందుకు వెళ్లి సంయుక్తంగా మాట్లాడండి' అని మంత్రి ఆదినారాయణరెడ్డి, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డిలను ఆయన ఆదేశించారు. వీరిద్దరిలో ఒకరిని కడప లోక్‌సభ స్థానానికి... రెండోవారిని జమ్మలమడుగు అసెంబ్లీ స్థానానికి నిలపాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. కానీ ఈ ఇద్దరూ అసెంబ్లీ స్థానం తనకే కావాలని కోరుతున్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు పెట్టింది పేరైన ఆ నియోజకవర్గంలో ఈ ఇద్దరు నేతల వర్గాలు ఇంతవరకూ కలసి పని చేయడం లేదు. వీరిద్దరూ కూడా ఉమ్మడిగా సభల్లో పాల్గొన్నదీ లేదు. దీనితో ముందుగా క్షేత్రస్థాయిలో ఐకమత్యం తేవాలని చంద్రబాబు నిర్ణయించారు. దీనికి రామసుబ్బారెడ్డి సవరణ సూచించారు. 'ఒకేసారి రెండు వర్గాలు కలసి సభలు పెడితే గొడవలు కావచ్చు. మొదట ఎవరికి వారుగా విడివిడిగా సభలు పెడతాం. మీరు పార్టీ పరిశీలకులను పంపండి. తర్వాత కలిపి సభలు పెడతాం. కలసి పనిచేసే వాతావరణం నెమ్మదిగా పెంపొందిస్తే మంచిది' అని ఆయన సూచించారు.





ఏదో ఒక రూపంలో నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య ఐక్యత పెంచాలని, ఇద్దరు నేతలూ కలసి కార్యక్రమాల్లో పాల్గొనాలని, ఆ పని జరిగిన తర్వాతే అభ్యర్థిత్వంపై తాను నిర్ణయం తీసుకొంటానని చంద్రబాబు తేల్చిచెప్పారు. ఆయన ఆదేశంతో ఆదినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి ఇద్దరూ తమ జిల్లా నేతలతో కలసి మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. సీఎం ఏ నిర్ణయం తీసుకొన్నా తాము కట్టుబడి ఉంటామని చెప్పారు. కానీ తర్వాత విడివిడిగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తమ పాత వైఖరులనే పునరుద్ఘాటించారు.

27న గుంటూరులో జనసేన శంఖారావం



- రేపటి నుంచి పవన్ జిల్లా పర్యటన

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శని, ఆదివారాల్లో గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారు. 27న గుంటూరు ఎల్ఈఎం స్కూల్ గ్రౌండ్స్‌లో 'జనసేన శంఖారావం' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఇటీవల టీడీపీ ప్రభుత్వం పలు పథకాలు ప్రకటించడంతో, తాము ఇప్పటికే గుప్పించిన హామీల్లోనూ మార్పులు చేర్పులు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జనసేన అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి నెలాఖరులోగా ప్రకటన చేసే వీలుందని, కుదిరితే గుంటూరు శంఖారావం సభలోనే కొన్నిటిని ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వివరిస్తున్నాయి.

జగన్ కలిసొస్తే... సీఎంని చేస్తాం



- పవన్ పొత్తుకు సై అంటే అధిష్ఠానాన్ని ఒప్పిస్తా: చింతా

తిరుపతి(తిలక్‌రోడ్డు), జనవరి 24: "వైసీపీ అధినేత జగన్ కలిసొస్తే కాంగ్రెస్‌లో కలుపుకొంటాం. అవసరమైతే సీఎంని చేస్తాం. కాంగ్రెస్ హయాంలో రెండుసార్లు సీఎం అయిన వైఎస్ రాజశేఖరరెడ్డి బిడ్డే జగన్. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న ఆయన, పార్టీపై కోపంతో బయటకు వెళ్లి వైసీపీని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడాయన కాంగ్రెస్‌తో కలిసేందుకు సరే అంటే నేను దూతగా వెళ్లి జగన్, విజయమ్మలతో చర్చిస్తా. ఇదంతా తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే" అని కేంద్ర మాజీ మంత్రి చింతమోహన్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా కాంగ్రెస్ పార్టీకి చెందిన చిరంజీవికి తమ్ముడే. ఆయన కూడా పొత్తు సరే అంటే నేను అధిష్ఠానాన్ని ఒప్పిస్తా. గతంలోనూ ఎస్పీ, బీఎస్పీలను కలిపింది నేనే. ప్రియాంక రాజకీయరంగ ప్రవేశంతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుంది" అని వ్యాఖ్యానించారు.

జగన్.. నువ్వో పిచ్చుక



- నువ్వా కాంగ్రెస్‌ను విమర్శించేది?.. క్షమాపణ చెప్పు: రఘువీరా

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): "జగన్ నువ్వో పిచ్చుక. నీదో గువ్వ పార్టీ. నువ్వా కాంగ్రెస్‌ను విమర్శించేది? ఇంతకాలం టీడీపీతో కలుస్తున్నామంటూ నీ పత్రికల్లో విషం కక్కుతూ కథనాలు రాయించావు. ఇప్పుడు రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు ఒంటరిగా పోటీ చేస్తున్నామంటే మరింత విషం కక్కుతూ నీ పత్రికల్లో ప్రధాన శీర్షికతో కథనం రాయిస్తావా? ముడుపులు ముట్టాయంటూ నిరాధారమైన ఆరోపణలు చేయిస్తావు. మరి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బేషరతుగా మద్దతు పలికినందుకు బీజేపీ నుంచి నీకెంత ముట్టిందో చెప్పు. కాంగ్రెస్‌పై నీ పత్రికలో కథనాలకు బేషరతుగా క్షమాపణ చెప్పు" అని పీసీసీ చీఫ్ రఘువీరా డిమాండ్ చేశారు.



హైకోర్టు ఆస్తుల విభజనపై చర్చిస్తున్న ఇరురాష్ట్రాల అధికారులు

జనాభా నిష్పత్తిలోనే పంపిణీ

- హైకోర్టు చరాస్తులపై ఇరురాష్ట్రాల అంగీకారం

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి హైకోర్టుకు సంబంధించిన చరాస్తుల విభజనపై ఏపీ, తెలంగాణ ఒక అవగాహనకు వచ్చాయి. జనాభా ప్రాతిపదికన ఆస్తులు పంచుకోవాలని నిర్ణయించాయి. హైకోర్టుకు ఉన్న వాహనాలు, ఫర్నిచర్, కంప్యూటర్లు తదితరాలన్నీ 58శాతం ఏపీకి, 42శాతం తెలంగాణకు చెందేలా అంగీకారం కుదిరింది. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, న్యాయశాఖ కార్యదర్శులు, హైకోర్టుల రిజిస్ట్రార్లు గురువారం హైదరాబాద్‌లో సమావేశమై ఆస్తుల పంపిణీపై చర్చించారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టానికి అనుగుణంగా జనాభా ప్రాతిపదికన పంపకాలకు ఇరురాష్ట్రాల ఉన్నతాధికారులు అంగీకరించారు. ఏపీకి రావాల్సిన చరాస్తులను ఫిబ్రవరి ఒకటోతేదీ నాటికి ఇక్కడకు తరలిస్తారు.

కరువు రైతుకు ఊరట

- పంటల బీమా రాష్ట్ర వాటా విడుదల

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2017-18 రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతులకు ఊరట లభించింది. పంటల బీమా పథకం కింద 2018-19 ఖరీఫ్‌కు రాష్ట్ర వాటా ప్రీమియం రాయితీ రూ.283.63 కోట్లను వ్యవసాయ బీమా కంపెనీలకు ప్రభుత్వం చెల్లించిందని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఫలితంగా గత రబీలో పంట నష్టపోయిన 70 వేల మంది రైతుల ఖాతాలకు రూ.129 కోట్లు నష్ట పరిహారం చెల్లించామని చెప్పారు. 2018 ఖరీఫ్ తాలూకు రాష్ట్ర ప్రభుత్వం తరపున బీమా కంపెనీలకు రూ.205 కోట్లు రాష్ట్ర వాటా ప్రీమియం సబ్సిడీ చెల్లించాల్సి ఉందన్నారు. 2018 ఖరీఫ్‌లో కరవు వల్ల పంట దెబ్బతిన్న రైతులకు రూ.1500 కోట్లు రావడానికి అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మిగిలిన ప్రీమియం సబ్సిడీ మొత్తాన్ని త్వరలోనే చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.

ఒక కులానికే 5 శాతం ఎలా?

- అగ్రవర్ణ పేదలందరికీ న్యాయం కోసం ఆర్యవైశ్యుల వినతి

చెన్నై, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల పోరాటంతో అగ్రవర్ణ పేదలకు కేంద్రం 10శాతం రిజర్వేషన్ కల్పించిందని, దాన్ని అడ్డుకునేందుకు తమిళనాడులోని ద్రవిడ పార్టీలు కోర్టుకెళ్తే, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క కులానికే 5శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం పేదలకు అన్యాయం చేయడమేనని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సమ న్యాయం చేయాలని కోరింది.

రాజకీయ 'మార్పు'!

- కుల ముద్రలు దాటుతున్న వలసలు
- కరుడుగట్టిన నేతలూ కదులుతున్నారు
- టీడీపీ వైపు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి చూపు
- ఇప్పటికే చంద్రబాబుతో డీఎల్ చర్చలు
- కీలకంగా టీడీపీలోకి వంగవీటి రాధా రాక
- జగన్‌తో సన్నిహితంగా మెలిగిన ఆదిశేషగిరి రావు.. త్వరలో టీడీపీలోకి
- మోదీతో ముందు నుంచీ ఆకుల సాన్నిహిత్యం.. ఇప్పుడు జనసేనలోకి
- కాంగ్రెస్‌ను వీడి పవన్ చెంతకు మనోహర్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)







ఏ నిమిషానికి ఏమి జరుగునో... ఏ నాయకుడు ఎటువైపు మారునో...

అంటూ రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త గాలులు వీస్తున్నాయి. ఊహించిన వలసలు కొన్నైతే... 'ఈయన కూడానా' అని ఆశ్చర్యపరిచే వలసలు కొన్ని! 'ఆయన కుటుంబం ఫలానా సామాజిక వర్గానికి ప్రతీక. అందువల్ల ఆయన పార్టీ మారే అవకాశమే లేదు' అని ఇన్నాళ్లూ బలంగా చేసిన వాదనలూ వీగిపోతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వలసల రాజకీయం రసవత్తరంగా మారుతోంది. కొన్నిచోట్ల సామాజికపరమైన మార్పులకు కూడా ఈ పరిణామాలు దోహదం చేస్తుండటం విశేషం! దివంగత నేత వంగవీటి రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ టీడీపీలో చేరడం ఖాయమైంది. కోస్తా జిల్లాల్లో పార్టీలను అంటిపెట్టుకొని ఉన్న సామాజిక సమీకరణాలు మారడానికి ఈ చేరిక దోహదం చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వంగవీటి రాధా రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఇంతవరకూ టీడీపీ వైపు రాలేదు. మొదట కాంగ్రెస్‌లో ఉన్న ఆయన... తర్వాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ తర్వాత వైసీపీకి మారారు. వంగవీటి రంగా హత్య తర్వాత కృష్ణా జిల్లాలో రెండు సామాజిక వర్గాల్లో ఒక్కో కులం ఒక్కో పార్టీ వైపు ఉండిపోయాయి. ఈ ముద్రను చెరిపివేసేందుకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు గతంలోనే ప్రయత్నించారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న వంగవీటి రత్నకుమారిని టీడీపీలోకి తీసుకున్నారు. దేవినేని నెహ్రూను టీడీపీలోకి తీసుకోవడానికి ఆసక్తి చూపకపోవడానికీ ఇదే కారణం. దీనితో నెహ్రూ కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. దీంతో ఫలానా సామాజికవర్గం నేత ఫలానా పార్టీలోనే ఉంటారనే ముద్ర కొంత తగ్గింది. ఆ సమయంలోనే రంగా కుటుంబం కూడా కాంగ్రెస్‌లోకి వెళ్లింది. నెహ్రూ, రంగా కుటుంబాలు రెండూ అలా కొంత కాలం కాంగ్రెస్‌లోనే ఉండిపోయాయి. కానీ, వంగవీటి రాధాకృష్ణ ప్రజారాజ్యంలో చేరడంతో మళ్లీ దారులు వేరయ్యాయి. నెహ్రూ చనిపోవడానికి కొద్దిగా ముందు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి టీడీపీలో చేరారు. ఇప్పుడు వంగవీటి రాధాకృష్ణ టీడీపీలో చేరితే కోస్తాలో ప్రబలంగా ఉన్న కుల విభేదాలు కొంత తగ్గుముఖం పడతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మార్పులో మరో పరిణామం

సినీ హీరో ఘట్టమనేని కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు వైసీపీ నుంచి టీడీపీలో చేరనుండటం కూడా మార్పుచేర్పుల్లో ఒక కీలక పరిణామం. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన నాటి నుంచి కృష్ణ కుటుంబం ఆ పార్టీకి దూరంగానే ఉంది. 1989 ఎన్నికల్లో కృష్ణ ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున పోటీచేసి గెలిచారు. ఆ తర్వాత ఆ పార్టీలో ఇమడలేక క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక కృష్ణ సతీమణి విజయనిర్మల టీడీపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. కానీ, నెగ్గలేదు. ఆమె కూడా తర్వాత క్రియాశీల రాజకీయాల్లోకి రాలేదు. కానీ, కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు సుదీర్ఘ కాలం నుంచి కాంగ్రెస్‌లోనే ఉన్నారు. తర్వాత వైసీపీలో చేరారు. జగన్ పాదయాత్రలో చురుగ్గా పాల్గొన్నారు. అమరావతిలో జగన్ సొంత ఇంటి నిర్మాణాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. అంత సన్నిహితంగా మెలిగిన ఆయన కూడా వైసీపీని వీడి టీడీపీలో చేరాలని నిర్ణయించుకోవడం సన్నిహితులకు ఆశ్చర్యం కలిగించింది. మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ కాంగ్రెస్‌ను వీడి జనసేనలో చేరడం కూడా చర్చనీయాంశ పరిణామం.

మోదీతో సన్నిహితంగా మెలిగినా...

బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ జనసేన పార్టీలో చేరడం మరో ఆసక్తికర పరిణామం. పోయిన ఎన్నికల ముందు నుంచీ ఆయన నరేంద్ర మోదీతో సన్నిహితంగా ఉన్నారు. మోదీ ప్రధాని కావడానికి ముందు అహ్మదాబాద్ వెళ్లి రెండుమూడుసార్లు కలిసివచ్చారు. బీజేపీలో చేరి క్రియాశీలంగా పనిచేశారు. ఆ కారణంతోనే టీడీపీలో సీనియర్‌నేత గోరంట్లను పక్క నియోజకవర్గానికి మార్చి, పొత్తులో ఆకులకు రాజమండ్రి సీటును ఇచ్చారు. కానీ బీజేపీకి గుడ్‌బై చెప్పేశారు.

టీడీపీ కోటలోకి కోట్ల!?



కోట్ల పేరు వినగానే కాంగ్రెస్ గుర్తుకొస్తుంది. కొన్ని దశాబ్దాలుగా కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని అంటి పెట్టుకుని ఉన్న రాజకీయ కుటుంబం అది! ఇప్పుడు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి టీడీపీలో చేరే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. రాజకీయంగా క్రియాశీలకంగా ఉండాలని ఆయన భావిస్తున్నారు. కానీ, ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా ఉంది. టీడీపీతో పొత్తు ఉండాలని భావిస్తున్న కాంగ్రెస్ నేతల్లో ఆయన కూడా ఒకరు. కానీ, పొత్తు ఉండదని అధిష్ఠానం తేల్చేసింది. దీనిపై బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో కోట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పొత్తుల్లేకుంటే పార్టీ మునుగుతుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కోట్ల టీడీపీలో చేరే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయనను పార్టీలో చేర్చుకునేందుకు వైసీపీ కూడా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే... టీడీపీ వైపే చూపుతున్నారు!

డీఎల్... సైకిల్!



కడప జిల్లాకు చెందిన మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత డీఎల్ రవీంద్రా రెడ్డి టీడీపీలోకి రావడంపైనా చాన్నాళ్లుగా ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇటీవల ఆయన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును కలిసి 45 నిమిషాలపాటు చర్చించినట్లు తెలిసింది. తనకు మైదుకూరు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డీఎల్ కోరుతుండగా... ఎమ్మెల్సీ ఇచ్చేందుకు హామీ లభించినట్లు తెలుస్తోంది. దీనిపై డీఎల్ నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉంది.



పనమ్మాయిపై భానుప్రియ సోదరుడి వేధింపులు!

- బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు
- అది అబద్ధపు కేసు: భానుప్రియ వివరణ

సామర్లకోట/చెన్నై(ఆంధ్రజ్యోతి), జనవరి 24: ఇంట్లో పనిచేసే బాలికను లైంగికంగా వేధిస్తున్నారంటూ ప్రముఖ సినీనటి భానుప్రియ సోదరుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనంమేరకు... తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండలం, పండ్రవాడ గ్రామానికి చెందిన పెనుపాకల ప్రభావతి, రాజు దంపతుల కుమార్తె(14)ను మూడేళ్ల క్రితం చెన్నైలోని భానుప్రియ ఇంట్లో పని చేయడానికి పంపించారు. ఏడాది నుంచి ఆమె సోదరుడు గోపాలకృష్ణ తమ కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడటమే గాక తమను బెదిరిస్తున్నారని ప్రభావతి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా తమపై ఇచ్చింది అబద్ధపు కేసని భానుప్రియ స్పష్టం చేశారు. ఆ బాలిక చెన్నై టి.నగర్‌లోని తమ ఇంటినుంచి వస్తువులు, డబ్బు, నగలు దొంగతనం చేసిందన్నారు. ఇటీవల విషయం గుర్తించిన తాము పోలీసులకు అప్పగిస్తామని బెదిరించడంతో తన తల్లి ఐప్యాడ్, వాచ్‌లు, కెమెరా తెచ్చి ఇచ్చిందని, నగలు, డబ్బు మాత్రం ఇవ్వలేదన్నారు. అవి కూడా తెస్తానని వెళ్లి కేసు పెట్టిందన్నారు.

1.16 లక్షల కోట్లు!

- లోటు, రాజధాని, హోదా కింద రావాలి
- రాయితీలతో కూడిన ప్రత్యేక హోదా
- వెంటనే వెనుకబడిన జిల్లాల నిధులివ్వాలి
- పోలవరానికి పైసా ఇవ్వలేదు.. హామీలు నెరవేర్చండి
- ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి సుదీర్ఘ లేఖ

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన పారిశ్రామిక రాయితీలతో కూడిన ప్రత్యేక హోదాను తక్షణం ప్రకటించాలని ప్రధాని మోదీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు డిమాండ్ చేశారు. నాడు రాజ్యసభలో ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా, రెవెన్యూ లోటు భర్తీ, రాజధాని అమరావతి నిర్మాణానికి సాయం కింద దరిదాపుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.1.16 లక్షల కోట్లు రావలసి ఉందని పేర్కొన్నారు. దీనిపై చంద్రబాబు గురువారం మోదీకి సుదీర్ఘ లేఖ రాశారు. ఆ లేఖ సారాంశమిదీ..

రావలసింది ఇవీ..

కాగ్ నిర్ధారించిన ఆర్థిక లోటు భర్తీకింద రూ.12,009 కోట్లు, అమరావతి నిర్మాణానికి రాష్ట్రం సమర్పించిన ప్రతిపాదనల ప్రకారం రూ.61,123 కోట్లు, బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద రూ.23,300 కోట్లు, ప్రత్యేక హోదాలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు 90 శాతం నిధులిస్తామన్న ప్రధాని హామీ కింద రూ.16,447 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసిన రూ.3,722 కోట్లు.. మొత్తం రూ.1,16,691.30 కోట్లు రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాలి. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వేసిన నిజనిర్ధారణ కమిటీ కూడా రాష్ట్రానికి కేంద్రం రూ.74,542 కోట్లు ఇవ్వాలని తేల్చింది. రూ.1,03,904 కోట్లు ఇవ్వాల్సి ఉందని ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ నిపుణుల కమిటీ కూడా స్పష్టంచేసింది.'

ప్రత్యేక హోదాపై పిల్లిమొగ్గలు

'ప్రత్యేక హోదాపై కేంద్రం అనేకసార్లు మాటమార్చింది. 14వ ఆర్థికసంఘం ఇక ప్రత్యేక హోదా ఎవరికీ ఇవ్వకూడదని చెప్పినట్లు పేర్కొంది. ఆర్థికసంఘం మాజీ ఛైర్మన్ వై.వి.రెడ్డి స్వయంగా ఆ విషయాన్ని ఖండించారు. ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదు కాబట్టి ప్రత్యేక సాయం ఐదేళ్లపాటు చేస్తామన్నారు. తద్వారా నాటి ప్రధాని రాజ్యసభలో ఇచ్చిన హామీ మేరకు ఐదేళ్లపాటు అదనపు నిధులు రాష్ట్రానికి వస్తాయన్నారు. తర్వాత మాట తప్పి కేవలం కేంద్ర ప్రాయోజిత పథకాలకే పరిమితం చేశారు. విదేశీ సాయంతో నడిచే ఈఏపీ ప్రాజెక్టులకు రుణం అందించి.. ఆ రుణాన్ని కేంద్రమే కడుతుందని.. తద్వారా ప్రత్యేక సాయం అందిస్తామని ఆ తర్వాత చెప్పారు. అదీ జరగలేదు. ప్రత్యేక సాయం కోసం స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ) ఏర్పాటుచేయాలని సూచించి.. రుణభారాన్ని రాష్ట్రంపై మోపే ప్రయత్నం కేంద్రం చేసింది. ఎస్పీవీ ఏర్పాటుపైనా ఇంతవరకూ రాతపూర్వక ఉత్తర్వు ఇవ్వలేదు. మా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి తీరాలి. జీఎస్టీ హయాంలో కూడా ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నారు. అదే పద్ధతిలో మాకూ ఇవ్వాలి.'

బుందేల్‌ఖండ్‌లో రూ.4,115.. మాకు 428

'రాష్ట్రంలోని వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి కోసం బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామన్నారు. ఈ ఏడు జిల్లాల అభివృద్ధికి రూ.24,350 కోట్లు ఇవ్వాలని 2014 అక్టోబరులో కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. కానీ మీరు మాత్రం ఏడాదికి ఒక్కో జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున ఆరేళ్లపాటు ఇస్తామన్నారు. అది కూడా మూడేళ్లపాటే ఇచ్చారు. రూ.1050 కోట్లు ఇవ్వగా.. వాటితో 25,007 పనులు చేపట్టాం. రూ.1049.34 కోట్లకు యూసీలు పంపించాం. 2017-18కి సంబంధించిన రూ.350 కోట్లను రాష్ట్ర ఖాతాలో వేసి.. మళ్లీ వెంటనే వెనక్కి తీసేసుకున్నారు. ఆ మొత్తంతో పాటు ఈ ఏడాది కూడా కలిపి రూ.700 కోట్లు విడుదల చేయాలని పలుమార్లు కోరాం. నీతి ఆయోగ్ కూడా సిఫారసు చేసింది. తెలంగాణలోని తొమ్మిది వెనుకబడిన జిల్లాలకు 2018కి సంబంధించిన రూ.450 కోట్లను గత సెప్టెంబరులో విడుదల చేశారు. మా రాష్ట్రానికి ఇవ్వకపోవడం వల్ల ఆయా జిల్లాలో చేపట్టిన పనుల్లో కొన్ని ఇంకా పూర్తికాలేదు. మరోవైపు బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ప్రత్యేక ప్యాకేజీ కింద ఒక్కో వ్యక్తికి రూ.4,115 చొప్పున కేంద్రం ఇచ్చింది. కానీ మా వెనుకబడిన జిల్లాలకు తలసరి రూ.428 మాత్రమే ఇచ్చింది.'

పోలవరం తుది అంచనాలపై సాగదీత

'పోలవరం జాతీయ ప్రాజెక్టు మా రాష్ట్రానికి జీవనాడి. ఇప్పటికి 64.01శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై రాష్ట్రప్రభుత్వం చేసిన వ్యయం రూ.10,449.30 కోట్లు. ఇందులో కేంద్రం రూ.6,727.26 కోట్లు రాష్ట్రానికి తిరిగిచ్చింది. ఇంకా రూ.3,722.04 కోట్లు ఇవ్వాల్సి ఉంది. 2018 జూన్ నుంచి పోలవరానికి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసినదానిలో ఒక్క పైసా కూడా వెనక్కు ఇవ్వలేదు. మరోవైపు కేంద్ర ఆర్థిక శాఖ 2016లో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం.. 2014 మార్చి నాటి ధరల ప్రకారం ప్రాజెక్టు అంచనాలను సవరించి పంపించాం. 2017 ఆగస్టు 16న కేంద్ర జలసంఘానికి రూ.57,940.86కోట్లతో సవరించిన అంచనాలు పంపాం. దీన్ని ఆమోదించడంతో పాటు.. రాష్ట్రానికి తిరిగివ్వాల్సిన నిధులు ఇవ్వాలి.'

పన్ను ప్రోత్సాహకాలు


పారిశ్రామికీకరణ, వృద్ధిరేటును పెంచేందుకు నూతన రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ కింద పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వాలి. విభజన చట్టంలోని సెక్షన్ 94(1)కింద వీటిని ఇవ్వాలి. కానీ కంటితుడుపు చర్యగా కొన్ని ప్రోత్సాహకాలు ఇచ్చారు. పైగా అవి అంతకుముందే తెలంగాణలోని తొమ్మిది వెనుకబడిన జిల్లాలు, బీహార్, పశ్చిమబెంగాల్‌లోని పలు జిల్లాలకు ఇచ్చినవే.

అమరావతికి సాయం ఇదా!

రైతుల ఔదార్యంతో సమీకరించిన 33 వేల ఎకరాల్లో రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.1.09 లక్షల కోట్లు కావాలి. రాజ్‌భవన్, సచివాలయం, హైకోర్టు, శాసనసభ తదితరాల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన చేయాలి. వీటికోసం రూ.62,623 కోట్లతో డీపీఆర్ పంపించాం. కానీ కేంద్రం రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చింది. కడప ఉక్కు కర్మాగారంపై ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చినా కేంద్రం అక్కడ ఉక్కు కర్మాగారం పెట్టడంలో విఫలమైంది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం మేమే అక్కడ ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేశాం. కనీసం పదేళ్లపాటు దానిపై ఆదాయపు పన్ను, జీఎస్టీ, దిగుమతి సుంకం మినహాయింపులైనా ఇవ్వండి. కాకినాడలో పెట్రోలియం కాంప్లెక్స్ నిర్మాణం విషయంలోను రాష్ట్రానికి మేలు చేసేలా వ్యవహరించలేదు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు నిధులు ఇవ్వడం లేదు. మరోవైపు... విభజన చట్టంలోని తొమ్మిదో షెడ్యూలులోని సంస్థల ఆస్తులను ఇప్పటికీ విభజించలేదు. ఈ ఆస్తుల విలువ రూ.38,772.85 కోట్లు.'

ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చాం!

- 'పెద్దకొడుకు'గా మాట నిలబెట్టుకున్నా
- చెప్పినవీ.. చెప్పనివీ చేస్తున్నాం
- అందరి మద్దతూ టీడీపీకే రావాలి
- కాపు కోటాపై అవాకులు చవాకులు
- వైసీపీ, బీజేపీపై బాబు ఆగ్రహం
- 'మిషన్-2019'పై నేతలతో టెలికాన్ఫరెన్స్



అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'ప్రతి ఇంటికీ పెద్ద కొడుకుగా ఉంటానన్నాను. ఇచ్చినమాట నిలబెట్టుకున్నా. బాధ్యత గల కుటుంబ పెద్దగా పని చేస్తున్నాను. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి చేకూరింది. వారందరి మద్దతు టీడీపీకే ఉండేలా చూడాలి' అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'ఎన్నికల మిషన్-2019'పై టీడీపీ ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జులు, పార్టీ బాధ్యులతో గురువారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల మంది పార్టీ తరపున పని చేస్తున్నారని, 50 వేలమంది బూత్ కన్వీనర్ల సైన్యం ఉందన్నారు. 'సాంకేతికత మనకు అదనపు బలం. టీడీపీ సంస్థాగత బలం ఏమిటో ఈ ఎన్నికల్లో చూపాలి. క్షేత్రస్థాయిలో ఉత్సాహంగా పని చేయాల'ని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇంకా ఏమన్నారంటే...

90% సంతృప్తి ఉంటే: 'రాష్ట్రంలో మన ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికే 78.5% సంతృప్తి ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో 84 శాతం ఉంది. ఇది 90 శాతానికి చేరితే ప్రతిపక్షానికి స్థానమే ఉండదు. సింగపూర్‌లో 50 ఏళ్లుగా ఒకే ప్రభుత్వం ఉంది. అందుకే అద్భుత అభివృద్ధి సాధ్యమైంది. మేనిఫెస్టోలో చెప్పినవన్నీ మనం నాలుగున్నరేళ్లలోనే చేశాం. చెప్పనవి కూడా అనేకం చేశాం. రూ.1,000 పింఛను రూ.2వేల చేశాం. పింఛన్లు 10 డ్వాక్రా మహిళలకు రూ.10 వేలు ఇస్తామన్నాం.. రూ.20 వేలు ఇస్తున్నాం. రాష్ట్రంలో 97% రైతుల రాబడి రెట్టింపు చేశాం. రెండంకెల వృద్ధి రేటు సాధించాం. అందువల్ల టీడీపీ పట్ల ప్రజాదరణ కూడా రెట్టింపు కావాలన్నదే నా ఆకాంక్ష. రాష్ట్ర హితం కోరే ప్రతి ఒక్కరూ టీడీపీతో కలిసి రావాలి. ప్రజల కోసం పని చేసేది టీడీపీయే. స్వార్థం కోసం పని చేసేవి వైసీపీ, బీజేపీ. కేసుల మాఫీ కోసం జగన్ మోదీతో రాజీ పడ్డాడు. డబ్బుల కోసం కేసీఆర్‌తో రాజీ పడ్డాడు. టీఆర్ఎస్‌కు రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నాడు. ఆయన డబ్బులున్న వాళ్లకే టికెట్లు ఇస్తున్నాడు.' 'కాపు రిజర్వేషన్లపై వైసీపీ, బీజేపీ అవాకులు చవాకులు పేలుతున్నాయి. ఈ రిజర్వేషన్లపై రాష్ట్రానికి అధికారం లేదంటున్నారు. కాపులకు 5% కోటా ఇస్తే వీళ్లకు బాధేంటి? అప్పుడు తన పరిధిలో లేదని తప్పించుకున్నాడు. మొన్న బీజేపీ కాపు రిజర్వేషన్లపై నిందించింది. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం చేస్తాం. రాష్ట్రాల్లో అక్కడి పార్టీల అభీష్టం మేరకే ఎన్నికల్లో పోటీలు ఉంటాయి. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.

కియ కారు వచ్చేనయా!

- 29న తొలి కారు ట్రయల్‌రన్.. హాజరు కానున్న సీఎం, కియ ఎండీ



కియ ప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'కియ' కారు ఈనెల 29న రోడ్డెక్కనుంది. తొలి కారును ఆ రోజున ప్రయోగాత్మకంగా పరుగులు తీయిస్తారు. అనంతపురం జిల్లా పెనుకొండ సమీపంలోని కియ కార్ల ప్లాంటులో దీనికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పరిశ్రమ ప్రాంగణంలో 84.14 ఎకరాల్లో బాడీషాప్, పెయింట్‌షాప్, అసెంబ్లీ షాప్, ఇంజిన్ షాప్, ప్రెస్‌కు సంబంధించిన భవనాలు నిర్మించారు. ఐరన్ ఫ్రేమ్ కు సంబంధించిన ఆ నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. అంటే... తొలి కారు తయారీకి రంగం పూర్తిగా సిద్ధమైందన్న మాట. పరిశ్రమ ప్రాంగణంలోనే రైడింగ్ ట్రాక్ నిర్మించారు. తొలి కారును కియ ఎండీ, సీఎం చంద్రబాబు నడుపుతారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కొరియా రాయబారి కూడా పాల్గొంటారు. లక్ష్యం ప్రకారం 2018 డిసెంబరులోనే కియ ప్లాంటు నుంచి తొలి కారు రావాల్సి ఉంది. కానీ, నెల ఆలస్యమైంది.

సర్వం సిద్ధం: కలెక్టర్.. కియ కార్ల పరిశ్రమ రాకతో మహానగర వాతావరణం కనిపిస్తోందని అనంతపురం జిల్లా కలెక్టర్ జి. వీరపాండ్యన్ తెలిపారు. ట్రయల్ రన్‌కు సంబంధించిన ఏర్పాట్లను కియ ప్రతినిధులతో కలిసి ఆయన సమీక్షించారు. 'పరిశ్రమలో నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. ఉద్యోగ నియామకాలు కూడా జరుగుతున్నాయి. 10 వేల నుంచి 20 వేల మంది ఉద్యోగులు నివసించడానికి అవసరమైన భవనాలు, అవసరమైన పాఠశాలలు, ఆస్పత్రులు, హోటళ్లు శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయి' అని కలెక్టర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సమ్మె విరమణ

విజయవాడ(గవర్నర్‌పేట), జనవరి 24: వేతన సవరణ, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులు నెలరోజులకుపైగా చేస్తున్న నిరవధిక సమ్మెను ఎట్టకేలకు విరమించారు. ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ గురువారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఉండవల్లి ప్రజావేదికలో మంత్రి సి.ఆదినారాయణరెడ్డితో బుధవారం జరిగిన చర్చల్లో కొన్ని హామీలు లభించడంతో సమ్మె విరమిస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫారసుల మేరకు 20 శాతం వేతనాలు పెంచడానికి మంత్రి అంగీకరించారని, గ్రాట్యుటీని రూ.4లక్షల వరకు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. సమ్మెను జయప్రదం చేసిన ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

డ్రోన్.. 'డిజిటల్ స్కై'లో నమోదు తప్పనిసరి

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్రోన్‌లను వినియోగించే వీడియోగ్రాఫర్లు, కెమెరామెన్‌లు, ఇతరులు తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న డిజిటల్ స్కై విధానం కింద తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్ నెట్ లిమిటెడ్(ఏపీఎస్ఎఫ్ఎల్) ఎండీ దినేశ్‌కుమార్ స్పష్టం చేశారు. ఏపీఎస్ఎఫ్ఎల్‌కు అనుబంధంగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రాష్ట్రంలో డ్రోన్స్ వినియోగంపై ప్రత్యేక విధానాన్ని తీసుకొచ్చిందని గురువారం ఓ ప్రకటనలో వివరించారు. రాష్ట్రంలో డ్రోన్ల తయారీ, అభివృద్ధి అంశాలను డ్రోన్స్ లిమిటెడ్ పర్యవేక్షిస్తుందని తెలిపారు.

తొలి టెస్ట్-మూడో రోజు
ఇంగ్లండ్ x వెస్టిండీస్
రా. 7.30 నుంచి
సోనీ టెన్-1లో...

తొలి టెస్ట్ - రెండో రోజు
ఆస్ట్రేలియా x శ్రీలంక
ఉ. 8.30 నుంచి
సోనీ టెన్-3లో...

ప్రొ. రెజ్లింగ్ లీగ్
ఎంపీ యోధ x యూపీ దంగల్
రా. 7 గం నుంచి
సోనీ సిక్స్, సోనీ టెన్-3

అమ్మాయిలూ అదరగొట్టారు..

- మంధాన సెంచరీ
- జెమీమా అజేయ 'హాఫ్'
- భారత్ 9 వికెట్ల విజయం
- కివీస్‌తో తొలి వన్డే

ఒక రోజు తేడాతో న్యూజిలాండ్ జట్లకు రెండోసారి షాక్ ఎదురైంది. బుధవారం విరాట్ కోహ్లీ సేన చేతిలో కివీస్ పురుషుల జట్టుకు ఓటమి ఎదురుకాగా.. ఈసారి మన మహిళల జట్టు కూడా అదే రీతిలో అదరగొట్టింది. తొలుత స్పిన్నర్లు ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్ ధాటికి కివీస్ విలవిల్లాడింది. ఆ తర్వాత ఓపెనర్లు స్మృతి మంధాన శతక మెరుపులు.. టీనేజర్ జెమీమా రోడ్రిగ్స్ అజేయ అర్ధసెంచరీతో విరుచుకుపడగా భారత్ ఏకంగా తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచి ఘనంగా బోణీ చేసింది.


జెమీమా రోడ్రిగ్స్ (81 నాటౌట్)


స్మృతి మంధాన (105)

నేపియర్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత మహిళల జట్టు ఆల్‌రౌండ్ షోతో చెలరేగింది. ఓపెనర్లు స్మృతి మంధాన (104 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 105), జెమీమా రోడ్రిగ్స్ (94 బంతుల్లో 9 ఫోర్లతో 81 నాటౌట్) బ్యాటింగ్ సహాయంతో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో నెగ్గింది . తద్వారా మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. టీ20 ప్రపంచకప్ సెమీస్‌లో ఓటమి.. ఆ తర్వాత జరిగిన అంతర్గత గొడవల అనంతరం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఆకట్టుకునే ప్రదర్శన కనబరచింది. టాస్ కోల్పోయి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 48.4 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు సుజీ బేట్స్ (36), డెవిన్ (28) జట్టుకు శుభారంభాన్నిచ్చారు. అయితే స్పిన్నర్లు ఏక్తా బిస్త్ (3/32), పూనమ్ యాదవ్ (3/42) బంతులకు సమాధానం లేకపోగా వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. మిడిలార్డర్‌లో కెప్టెన్ శాటర్త్‌వెయిట్ (31), కెర్ (28) పోరాడారు. దీప్తి శర్మకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 33 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 193 పరుగులు చేసి గెలిచింది.

రికార్డు శతకం: స్వల్ప లక్ష్యం కోసం బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు స్మృతి మంధాన, జెమీమా అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. దాదాపు మ్యాచ్ చివరి వరకు కొనసాగిన ఈ జంట కివీస్ బౌలర్లను ఆటాడుకుంది. ఈక్రమంలో స్మృతి కివీస్ గడ్డపై సెంచరీ సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్‌గానూ నిలిచింది. గతేడాది సూపర్ ఫామ్‌ను ఆమె ఈ ఏడాదీ కొనసాగించగా కేవలం ఐదో వన్డే ఆడిన జెమీమా ఆత్మవిశ్వాసంతో కివీస్ బౌలర్లను ఎదుర్కొంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించడంతో 105 బంతుల్లోనే వీరిద్దరు 100 పరుగులు జోడించారు. 61 బంతుల్లో జెమీమా కెరీర్‌లో తొలి అర్ధ సెంచరీ సాధించగా.. అదే జోరుతో 101 బంతుల్లో స్మృతి కెరీర్‌లో నాలుగో శతకం పూర్తి చేసుకుంది. ఆ తర్వాత విజయానికి ఏడు పరుగులు కావాల్సి ఉండగా 33వ ఓవర్‌లో తొలి బంతిని బౌండరీగా మలిచిన స్మృతి.. ఆ తర్వాతి బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించి క్యాచ్ అవుటైంది. దీంతో తొలి వికెట్‌కు 190 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. అయినా మరో నాలుగు బంతుల్లో భారత జట్టు మ్యాచ్‌ను ముగించింది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: సుజీ బేట్స్ (సి) జులన్ (బి) దీప్తి శర్మ 36, డెవిన్ (రనౌట్-శర్మ) 28, డౌన్ (స్టంప్డ్) తన్మయ్ (బి) పూనమ్ 0, శాటర్త్‌వెయిట్ (సి) రోడ్రిగ్స్ (బి) పూనమ్ 31, కెర్ (సి) హేమలత (బి) పూనమ్ 28, మాడీ గ్రీన్ (బి) ఏక్తా బిస్త్ 10, బెజుడెన్‌హౌట్ (స్టంప్) తన్మయ్ (బి) దీప్తి శర్మ 9, కాస్పెరెక్ (సి) తన్మయ్ (బి) ఏక్తా బిస్త్ 6, హన్నా రోవే (సి) శిఖా పాండే (బి) ఏక్తా బిస్త్ 25, హడెల్‌స్టన్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) శిఖా పాండే 10, తహుహు (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 48.4 ఓవర్లలో 192 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-61, 2-68, 3-70, 4-119, 5-136, 6-140, 7-148, 8-161, 9-187, 10-192. **బౌలింగ్:** జులన్ గోస్వామి 10-0-41-0; శిఖా పాండే 7.4-1-38-1; ఏక్తా బిస్త్ 9-0-32-3; దీప్తి శర్మ 10-1-27-2; పూనమ్ యాదవ్ 10-0-42-3; హేమలత 2-0-11-0.

భారత్: జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 81; స్మృతి మంధాన (సి) తహుహు (బి) కెర్ 105; దీప్తి శర్మ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 33 ఓవర్లలో 193/1. వికెట్ పతనం:** 1-190. **బౌలింగ్:** తహుహు 5-0-34-0; రోవె 5-0-29-0; హడెల్‌స్టన్ 3-0-22-0; కాస్పెరెక్ 7-0-37-0; కెర్ 6-0-33-1; డెవిన్ 3-0-14-0; శాటర్త్‌వెయిట్ 4-0-22-0.


రెండో వన్డే వేదిక మౌంట్ మాంగనుయ్ వద్ద ధోనీ, రాయుడు, కుల్దీప్, చాహల్, కేదార్

పాండ్యా, రాహుల్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

జట్టులో చేరనున్న హార్దిక్


రాహుల్ హార్దిక్ పాండ్యా

న్యూఢిల్లీ: టీమిండియా క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌కు ఊరట లభించింది. వారిపై విధించిన సస్పెన్షన్‌ను పాలక మండలి (సీఓఏ) గురువారం ఎత్తివేసింది. ఓ టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో రెండు వారాల కిందట వారిపై సస్పెన్షన్ వేటు వేయడంతోపాటు ఆస్ట్రేలియా పర్యటన నుంచి స్వదేశానికి రప్పించిన సంగతి తెలిసిందే. అమికస్ క్యూరీ పీఎస్ నరసింహ అనుమతితో పాండ్యా, రాహుల్‌పై ఈనెల 11న విధించిన సస్పెన్షన్‌ను ఉపసంహరించినట్టు బీసీసీఐ తెలిపింది. సుప్రీంకోర్టు ఆమోదించిన బీసీసీఐ కొత్త రాజ్యాంగంలోని 46వ నిబంధన ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది. అయితే ఈ అంశంపై విచారణ జరుగుతుందని, అందుకు అంబుడ్స్‌మన్‌ను సుప్రీంకోర్టు నియమించాల్సి ఉందని పేర్కొంది. వచ్చేనెల 5న ఈ విషయంపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టే అవకాశాలున్నాయి.

కాగా సస్పెన్షన్ ఎత్తివేయడంతో 25 ఏళ్ల హార్దిక్ సాధ్యమైనంత త్వరగా వెళ్లి న్యూజిలాండ్‌లోని జట్టులో చేరే అవకాశాలున్నాయి. ఇక రాహుల్..దేశవాళీలో లేదా ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగే సిరీస్‌లో భారత్-ఎ జట్టు తరపున ఆడే అవకాశాలున్నాయి. కర్ణాటక కనుక రంజీట్రోఫీ ఫైనల్‌కు చేరితే..మయాంక్ అగర్వాల్‌తో కలిసి 26 ఏళ్ల రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశముంది.

సునాయాసంగా క్వార్టర్స్‌కు...

- సింధు, సైనా, శ్రీకాంత్ జోరు
- ఇండోనేసియా మాస్టర్స్


శ్రీకాంత్

జకార్తా: భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్, శ్రీకాంత్ ఇండోనేసియా మాస్టర్స్‌లో జోరును కొనసాగిస్తున్నారు. గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో వీరు వరుస గేముల్లో గెలిచి క్వార్టర్స్‌కు చేరారు. తొలుత రెండో సీడ్ సింధు 23-21, 21-7తో మరిస్కా టున్‌జంగ్ (గ్రెగొరియా)ను కేవలం 37 నిమిషాల్లోనే ఓడించింది. అయితే ఆమెకు క్వార్టర్స్‌లో కరోలినా మారిన్ ఎదురయ్యే అవకాశం ఉంది. మొదటి గేమ్‌లో టున్‌జంగ్ నుంచి సింధుకు గట్టి పోటీ ఎదురైంది. కానీ రెండో గేమ్‌లో సింధు జోరు ముందు ప్రత్యర్థి ఏమాత్రం నిలవలేకపోయింది. ఇక సైనా 21-17, 21-15తో ఫిట్రియాని (ఇండోనేసియా)పై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ కిడాంబి శ్రీకాంత్ 21-14, 21-9తో కెంటా నిషిమోటో (జపాన్)పై నెగ్గాడు. పురుషుల డబుల్స్‌లో మను అత్రి-బి.సుమీత్ రెడ్డి జోడీ 14-21, 21-17, 10-21 తేడాతో ఐదో సీడ్ కిమ్ అస్ట్రప్-ఆండర్స్ స్కారుప్ (డెన్మార్క్) చేతిలో ఓడింది.

ఇంగ్లండ్ ఢమాల్

తొలి ఇన్నింగ్స్ 77 ఆలౌట్
రోచ్‌కు ఐదు వికెట్లు



బ్రిడ్జిటౌన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో పేసర్ కీమర్ రోచ్ (5/17) ధాటికి ఇంగ్లండ్ జట్టు చిగురుటాకులా వణికింది. నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడిన అతడు పర్యాటక బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. దీంతో గురువారం రెండో రోజు ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 30.2 ఓవర్లలో 77 పరుగులకు కుప్పకూలింది. విండీస్‌పై ఈ జట్టుకిది నాలుగో అత్యల్ప స్కోరు. హోల్డర్ (2/15), జోసెఫ్ (2/20) రాణించారు. జెన్నింగ్స్ (17), సామ్ కర్రాన్ (14), బెయిర్‌స్టో (12), ఆదిల్ రషీద్ (12) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. ఏడుగురు బ్యాట్స్‌మెన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అంతకుముందు వెస్టిండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 101.3 ఓవర్లలో 289 పరుగులకు ఆలౌటైంది. హెట్‌మయెర్ (81), హోప్ (57), చేజ్ (54) అర్ధ సెంచరీలు చేశారు. అయితే 49 పరుగుల తేడాతో విండీస్ చివరి ఆరు వికెట్లను కోల్పోయింది. అండర్సన్‌కు ఐదు వికెట్లు దక్కాయి. ప్రస్తుతం వెస్టిండీస్‌కు 212 పరుగుల ఆధిక్యం లభించింది.

శ్రీలంక 144 ఆలౌట్

బ్రిస్బేన్: పేసర్లు పాట్ కమ్మిన్స్ (4/39), రిచర్డ్‌సన్ (3/26) దెబ్బకు ఆస్ట్రేలియాతో గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో శ్రీలంక స్వల్ప స్కోరుకే కుప్పకూలింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న పర్యాటక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 56.4 ఓవర్లలో 144 పరుగులు మాత్రమే చేసింది. డిక్‌వెల్లా పోరాడడంతో (78 బంతుల్లో 64) లంక ఆమాత్రం స్కోరు చేయగలిగింది. అనంతరం బరిలోకి దిగిన ఆసీస్ జట్టు తొలి రోజు ఆట ముగిసేసరికి 2 వికెట్లు కోల్పోయి 72 పరుగులు సాధించింది.

రఫాడించాడు!

- టిట్సిపాస్‌ను చిత్తుచేసిన నడాల్ ● తుదిపోరుకు స్పెయిన్ బుల్
- మహిళల ఫైనల్లో ఒసాకా-క్విటోవా ● ఆస్ట్రేలియన్ ఓపెన్

గ్రీక్ ఆటగాడు స్టెఫనోస్ టిట్సిపాస్ సంచలనాలకు సెమీస్‌లో తెరపడింది..క్వార్టర్ ఫైనల్లో దిగ్గజ ప్లేయర్ రోజర్ ఫెడరర్‌ను కంగు తినిపించిన టిట్సిపాస్ ఆటలు నడాల్ ముందు సాగలేదు.. వరుస సెట్లలో కేవలం గంటన్నరలోపే స్టెఫనోస్‌కు చెక్ చెప్పిన స్పెయిన్ బుల్ ఫైనల్‌కు చేరుకున్నాడు.. ఆదివారం జరిగే అంతిమ సమరంలో టాప్‌సీడ్ జొకోవిచ్ /లుకాస్ పౌలీ (ఫ్రాన్స్) మధ్య జరిగే మ్యాచ్ విజేతతో నడాల్ తలపడతాడు.. వీరిద్దరి మధ్య రెండో సెమీస్ శుక్రవారం జరగనుంది..ఇక మహిళల టైటిల్ కోసం నాలుగో సీడ్ నవోమి ఒసాకా, ఎనిమిదో సీడ్ పెట్రా క్విటోవా అమీతుమీ తేల్చుకోనున్నారు.


నడాల్

మెల్‌బోర్న్ : వర్ధమాన ఆటగాడిగా ప్రశంసలు అందుకుంటున్న స్టెఫనోస్ టిట్సిపాస్ ఆస్ట్రేలియన్ ఓపెన్ అమోఘ ప్రదర్శన సెమీఫైనల్‌తో ఆగిపోయింది. ఓ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరిన తొలి గ్రీక్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించిన స్టెఫనోస్‌కు రెండో సీడ్ రఫెల్ నడాల్ చెక్ చెప్పాడు. గురువారం రాడ్ లెవర్ ఎరీనాలో జరిగిన తొలి సెమీఫైనల్లో 32 ఏళ్ల నడాల్ 6-2, 6-4, 6-0 స్కోరుతో 20 ఏళ్ల టిట్సిపాస్‌ను చిత్తు చేశాడు. ఏకంగా 28 విన్నర్లు సంధించిన నడాల్ ఆరుసార్లు స్టెఫనోస్ సర్వీస్‌ను బ్రేక్ చేయడం విశేషం. అంతేనా కేవలం ఒక బ్రేక్‌పాయింట్ మాత్రమే రఫా కాచుకోవడం గమనార్హం. జొకోవిచ్-పౌలీ రెండో సెమీస్ విజేతతో నడాల్ ఫైనల్లో తలపడతాడు. 2009లో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించిన నడాల్...అన్ని గ్రాండ్‌స్లామ్‌లను రెండుసార్లు గెలుపొందిన రికార్డుకు ఒక్క విజయం దూరంలో నిలిచాడు. ఓపెన్ శకంలో ఈ ఘనత ఇప్పటి వరకూ ఏ ఆటగాడూ అందుకోలేదు. 63 వరుస గేముల్లో ఎందులోనూ నడాల్ తన సర్వీస్‌ను కోల్పోకపోవడం మరో విశేషం. అంతేకాదు..ఫైనల్‌కు చేరే క్రమంలో అతడు ఒక్క సెట్ కూడా చేజార్చుకోలేదు. ఇక..రెండో ఆస్ట్రేలియన్ ఓపెన్, ఏడో గ్రాండ్‌స్లామ్ ఆడిన టిట్సిపాస్‌ను నడాల్ ప్రశంసల్లో ముంచెత్తాడు. 'పలు గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గే సత్తా అతడికి ఉంది' అని జోస్యం చెప్పాడు. తొలి సెట్ నుంచే టిట్సిపాస్‌ను నడాల్ ఏమాత్రం కుదురుకోనివ్వలేదు. ఆ సెట్‌ను రఫా చేజిక్కించుకున్నాక.. తర్వాత ఏ దశలోనూ ప్రత్యర్థికి స్టెఫనోస్ పోటీ ఇవ్వలేక పోయాడు. మ్యాచ్‌లో ఇద్దరూ చెరో ఐదు ఏస్‌లు సంధించగా.. టిట్సిపాస్ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు.


ఒసాకా


క్విటోవా

ఒసాకా x క్విటోవా : శనివారం జరిగే మహిళల టైటిల్ పోరులో యూఎస్ ఓపెన్ చాంపియన్ నవోమి ఒసాకా-పెట్రా క్విటోవా ఢీకొనను న్నారు. సెమీస్‌లో జపాన్‌కు చెందిన ఒసాకా 6-2, 4-6, 6-4తో కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)ను ఓడించింది. చెక్ రిపబ్లిక్‌కే చెందిన మరో స్టార్ క్విటోవా 7-6 (2), 6-0 స్కోరుతో అన్‌సీడెడ్ డానిలీ కొలిన్స్ (అమెరికా)పై గెలుపొందింది.

మండిన ఎండ: 40 డిగ్రీల అదిరిపోయే ఎండ కారణంగా క్విటోవా-కొలిన్స్ సెమీస్ మొదటి సెట్ మధ్యలో పై కప్పును మూసివేసి మ్యాచ్ నిర్వహించారు. పోటాపోటీగా సాగిన తొలి సెట్ టైబ్రేక్‌కు మళ్లినా..అందులో క్విటోవా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి సెట్‌ను సొంతం చేసుకుంది. ఇక రెండోసెట్‌లో అయితే రెండుసార్లు వింబుల్డన్ విజేత పెట్రాకు ఎదురులేకపోయింది.

ఆ ఘటన తర్వాత తొలి ఫైనల్: 2016 డిసెంబరు 20..క్విటోవా జీవితంలో అత్యంత విషాదం చోటుచేసుకున్న రోజు. చెక్ రిపబ్లిక్‌లోని ప్రొస్టెజోవ్‌లోని ఆమె నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన చోరుడు కత్తితో క్విటోవాపై దాడి చేశాడు. దాంతో ఆమె ఎడమ చేతికి అయిన గాయానికి నాలుగు గంటలపాటు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ఆ దారుణం నుంచి కోలుకున్న పెట్రా...గురువారం నాటి విజయంతో మొదటిసారి ఓ పెద్ద టోర్నీ ఫైనల్‌కు చేరింది. 'ఆ ఘటన నుంచి అదృష్టవశాత్తు బయటపడ్డా. ఇక ఈ సెమీస్ గెలుపు చాలా సంతృప్తి నిచ్చింది' అని ఆమె చెప్పింది.

పురుషుల సింగిల్స్ సెమీస్
జొకోవిచ్ x పౌలీ
మ 2. తర్వాత


మహిళల డబుల్స్ ఫైనల్
ఉ.9.30 గం. తర్వాత
సోనీ సిక్స్, సోనీ టెన్-2లో

ఉమేష్ యాదవ్ 7/48

● కేరళ-విదర్భ రంజీ

వయనాడ్ (కేరళ): విదర్భ పేస్ బౌలర్ ఉమేష్ యాదవ్ (7/48) విజృంభించడంతో రంజీ ట్రోఫీ తొలి సెమీఫైనల్‌లో కేరళ 28.4 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. ఈ ప్రదర్శనతో రంజీల్లో 100 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో కూడా ఉమేష్ స్థానం సంపాదించాడు. కేరళ తరపున విష్ణు వినోద్ (37 నాటౌట్), సచిన్ బేబి (22) మాత్రమే రాణించారు. అనంతరం బరిలోకి దిగిన విదర్భ నిలకడగా ఆడింది. తొలి రోజు ఆట ముగిసేసరికి 45 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. ఓపెనర్ ఫైజ్ ఫజల్ అర్ధ శతకం (75) చేసి జట్టుకు శుభారంభాన్ని అందించాడు. ఇక, బెంగళూరు వేదికగా కర్ణాటక-సౌరాష్ట్ర మధ్య మొదలైన రెండో సెమీఫైనల్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆతిథ్య జట్టు తొలి రోజు ఆట ముగిసేసరికి 9 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. శ్రేయాస్ గోపాల్ (87), శ్రీనివాస్ శరత్ (74 నాటౌట్), మనీష్ పాండే (62) రాణించారు.

గెలిపించిన వినేశ్ ఫొగట్


వినేశ్

గ్రేటర్ నొయిడా: ఆసియా గేమ్స్ స్వర్ణ పతక విజేత వినేశ్ ఫొగట్ కీలక మ్యాచ్‌లో గెలవడంతో హరియాణా హామర్స్ జోరుకు ముంబై మహారథి బ్రేక్ వేసింది. ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో భాగంగా గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో 4-3 తేడాతో ముంబై గెలిచింది. ఆరో మ్యాచ్‌లో తలపడిన వినేశ్ ఫొగట్ మహిళల 53కేజీల విభాగంలో సీమాపై 12-2 తేడాతో నెగ్గింది. దీంతో ముంబై విజయాన్ని ఖాయం చేసుకుంది. ఆ తర్వాత పురుషుల 57కేజీల్లో జరిగిన చివరి మ్యాచ్‌లో హామర్స్ ఆటగాడు రవి కుమార్ 13-9తో ఇలియసోవ్‌ను ఓడించాడు. అంతకుముందు జరిగిన మ్యాచ్‌ల్లో పురుషుల 65కేజీల్లో హర్‌పూల్ 5-2తో రజనీష్‌పై గెలిచి ముంబైకి తొలి పాయింట్‌ను అందించాడు. మహిళల 62 కేజీల్లో ఒమెల్‌చెంకో 16-0తో శిల్పిపై.. పురుషుల 86కేజీల్లో అలీ షబనోవ్ 4-3తో దీపక్ పూనియాపై గెలిచి హామర్స్‌ను 2-1తో ఆధిక్యంలో నిలిపారు. ఈ దశలో ముంబై రెజ్లర్లు విజృంభించి వరుసగా మూడు మ్యాచ్‌లను నెగ్గారు.

సాహస బాలలతో ప్రధాని భేటీ!

వెయ్యి మొక్కలు నాటిన చిన్నారికి ప్రత్యేక ప్రశంస

న్యూఢిల్లీ, జనవరి 24: పిల్లలు ప్రకృతితో అనుబంధాన్ని పెంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. గురువారం ఆయన ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2019 విజేతలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లల విజయ గాథలను విన్నారు. ఆరో పుట్టిన రోజున 1,006 మొక్కలు నాటిన ఇహా దీక్షిత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 783 ఎంట్రీలు రాగా, 26 మందిని అవార్డుకు ఎంపిక చేశారు. వినూత్న ఆవిష్కరణ, విద్యాపరమైన ప్రతిభ, క్రీడలు, కళలు, సంస్కృతి, సామాజిక సేవ, సాహసం రంగాల్లో అవార్డులను ఇచ్చారు. ప్రధాని తన నివాసంలోనే జరిగిన మరో కార్యక్రమంలో గణతంత్ర ఉత్సవాల శకటాల కళాకారులతో ముచ్చటించారు. వారితో పాటు గిరిజన అతిథులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు హాజరయ్యారు. దేశ ప్రజలంతా వారి నుంచి స్ఫూర్తి పొందుతారని ప్రధాని వ్యాఖ్యానించారు. నిత్యజీవితంలో క్రమశిక్షణను భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.



రాష్ట్రీయ బాల పురస్కార్-2019 అందుకున్న బాలలతో సంభాషిస్తున్న ప్రధాని మోదీ

2019లో హంగే

ఏ కూటమికీ స్పష్టమైన మెజారిటీ రాదు.. ఏబీపీ-సీ ఓటర్ 'దేశ్ కా మూడ్ ' సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 24: "2019 ఎన్నికల్లో మేం 2014 కన్నా ఎక్కువ సీట్లు గెలవబోతున్నాం".. గత ఏడాది జనవరిలోనూ, సెప్టెంబరులోనూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఘంటాపథంగా చెప్పిన మాట ఇది! నిజంగా ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిపితే ఎన్డీయే మళ్లీ 2014 తరహాలోనే భారీ మెజారిటీతో అధికారాన్ని సాధిస్తుందా? అంటే.. ఆ అవకాశం లేదని ఏబీపీ-సీఓటర్ నిర్వహించిన 'దేశ్ కా మూడ్' సర్వేలో తేలింది. యూపీఏ సైతం స్పష్టమైన మెజారిటీ సాధించడం కష్టమేనని స్పష్టమైంది!! ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రజల నాడి ఎలా ఉందో తెలుసుకునేందుకు ఏబీపీ-సీఓటర్ ఈ పోల్ నిర్వహించింది. 2014 ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఎన్డీయేలో ప్రధాన పక్షమైన బీజేపీ పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసింది. రెండేళ్లుగా ఆ పరిస్థితిలో మార్పు వస్తోంది. తాజాగా ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ విజయం అందుకు నిదర్శనం. ఒకవైపు ఎన్డీయే తన మిత్రులను కోల్పోతుండగా.. అర్ధమనస్కంగానైనా, ఎన్ని విభేదాలున్నా మోదీకి వ్యతిరేకంగా విపక్షాలన్నీ ఏకం అవుతున్నాయి. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో.. ఏబీపీ-సీఓటర్ పోల్‌లో పలు ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. దాని ప్రకారం..

- 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఏ కూటమికీ మెజారిటీ రాదు. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఉంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 233 సీట్లు వచ్చే అవకాశం ఉంది. అటు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏకి 167 సీట్లొచ్చే చాన్స్ ఉంది. ఇతర పార్టీలకు వచ్చే సీట్లు దాదాపు 143.
- ఎన్డీయేకి వైసీపీ, టీఆర్ఎస్, బిజూ జనతాదళ్, మిజో నేషనల్ ఫ్రంట్ మద్దతిస్తే.. ఆ కూటమి సంఖ్య 278ని చేరుతుంది.
- యూపీఏ కూటమికి ఏఐయూడీఎఫ్, ఎల్డీఎఫ్, టీఎంసీ, ఎస్పీ-బీఎస్పీ-ఆర్ఎల్డీ మహాకూటమి మద్దతు లభించినా.. 257 సీట్లతో అధికారానికి కొద్ది దూరంలో నిలిచిపోతుంది.
- యూపీలో మొత్తం లోక్‌సభ స్థానాలు 80 కాగా.. 2014లో బీజేపీకి 71 సీట్లు వచ్చాయి. ఈసారి అలాంటి పరిస్థితి లేదని, అక్కడ ఎస్పీ-బీఎస్పీ కూటమికి 51 సీట్ల దాకా వచ్చే అవకాశం ఉందని సర్వేలో తేలింది. మిగతా సీట్లలో ఎన్డీయేకి 25, యూపీఏకి 4 సీట్లు రానున్నాయి.
- బిహార్‌లో మాత్రం ఎన్డీయే కూటమికి శుభవార్తే. 40 లోక్‌సభ స్థానాల్లో 35 స్థానాలను బీజేపీ-జేడీయూ కూటమి కొల్లగొడుతుందని సర్వేలో తేలింది.

సర్వే ఇలా చేశారు..

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని 543 నియోజకవర్గాల్లో 22,309 మందిని ప్రశ్నించారు. 2018 డిసెంబరు మూడో వారం నుంచి 2019 జనవరి మూడోవారం దాకా ఈ సర్వేను నిర్వహించారు. ఫలితాలు 3 నుంచి 5 శాతం వరకూ అటూఇటుగా ఉండొచ్చు.

- పశ్చిమ బెంగాల్‌లో 42 సీట్లకు తృణమూల్ కాంగ్రెస్ 34 చోట్ల జయకేతనం ఎగురవేసే చాన్స్ ఉందని తేలింది. 8 సీట్లలో.. ఏడింట బీజేపీనే విజయం సాధిస్తుందని సర్వే చెబుతోంది.
- ఒడిసాలో 21 స్థానాలకుగాను 12 సీట్లలో బీజేపీ.. తొమ్మిది చోట్ల బీజేడీ గెలిచే చాన్స్ ఉంది.
- గుజరాత్‌లో 26 సీట్లలో 24 చోట్ల కమలమే వికసిస్తుందని సర్వేలో తేలింది.
- ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో దెబ్బతిన్నా.. అక్కడ బీజేపీ పరిస్థితి మరీ అంత దారుణంగా ఏమీ లేదని సర్వేలో తేలింది. రాజస్థాన్‌లో 25 సీట్లలో 18 చోట్ల బీజేపీ.. మిగతా 7 సీట్లలో కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉంది. మధ్యప్రదేశ్‌లో 29 సీట్లకుగాను 23 బీజేపీ ఖాతాలోనే పడనున్నాయి!
- మహారాష్ట్రలో 48 సీట్లకుగాను.. 28 'హస్త'గతం కానున్నాయి. మిగిలిన 20 సీట్లూ బీజేపీ-శివసేన కూటమికి వస్తాయట.
- పంజాబ్‌లో 13 సీట్లకుగాను 12 చోట్ల గెలుపుతో కాంగ్రెస్ తన పట్టు నిలుపుకోనుండగా.. హరియాణాలో పదింట ఏడు సీట్లలో బీజేపీ గెలుస్తుందట.
- గోవాలో ఉన్న రెండు సీట్లనూ చెరొకటీ పంచుకోనున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 11 సీట్లుండగా.. వాటిలో ఐదు చోట్ల ఎన్డీయే, ఆరు చోట్ల యూపీఏ విజయం సాధించనున్నాయి.
- దక్షిణాదిన అన్ని రాష్ట్రాల్లో కలుపుకొని 129 సీట్లుండగా.. అందులో 69 సీట్లను సాధించి యూపీఏ ముందంజలో ఉంటుందని సర్వేలో తేలింది.
- ఈశాన్యాన బాగా పట్టు పెంచుకున్న బీజేపీ.. ఈ సార్వత్రిక ఎన్నికల్లో దాన్ని నిలబెట్టుకోనుందని, అక్కడ 25 సీట్లలో బీజేపీ 14.. కాంగ్రెస్ 9 సీట్లను గెలుచుకోనున్నాయని తేలింది. మిగిలిన 2 సీట్లు ఇతరులపరం కానున్నాయి.

మోదీకి కష్టమే



(మొదటి పేజీ తరువాయి)

నియోజక వర్గాల్లో 13,179 మందిని సర్వే చేసింది. జనవరి ఏడో తేదీన కేంద్ర కేబినెట్ ఆర్థిక బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లకు ఆమోద ముద్ర వేసింది. వాటి ప్రభావం ఈ సర్వేలో ప్రతిఫలించే అవకాశం లేదు. కాగా, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 237 స్థానాల్లో విజయం సాధిస్తుందని మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే అంచనా వేసింది. 2014 ఎన్నికలతో పోలిస్తే, ఆ పార్టీ 99 సీట్లను కోల్పోనుంది. గత ఎన్నికల్లో కేవలం 60 స్థానాలు సాధించిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ఈసారి తన సీట్లను 166కు పెంచుకుంటుందని తెలిపింది. ఎన్డీయే, యూపీఏ కూటముల్లో లేని పార్టీలు 140 సీట్లను సాధిస్తాయని పేర్కొంది. గత ఎన్నికలతో పోలిస్తే ఇవి 13 సీట్లను కోల్పోనున్నాయి. తద్వారా, ఏ పార్టీ, ఏ కూటమి మేజిక్ మార్కు అయిన 272 సాధించే అవకాశం లేదని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే హంగ్ పార్లమెంటు ఏర్పడుతుందని అంచనా వేసింది. ఎస్పీ, బీఎస్పీ, పీడీపీ, టీఎంసీ పార్టీలు యూపీఏకు మద్దతు ఇస్తే దానిదే అధికారమని విశ్లేషించింది. ఎన్డీయేకు కేసీఆర్, పళనిస్వామి, జగన్‌రెడ్డి, నవీన్‌పట్నాయక్ కలిసినా మేజిక్ మార్కుకు ఒక సీటు దూరంలో ఆగిపోతుందని అంచనా వేయడం గమనార్హం. యూపీఏ 33% ఓట్లను సాధిస్తే.. ఎన్డీయే 35% ఓట్లను దక్కించుకుంటుందని తెలిపింది. ఉత్తరం, పశ్చిమం, తూర్పు భారతంలో ఎన్డీయేకు ఎక్కువ సీట్లు వస్తాయి. యూపీలో ఎస్పీ-బీఎస్పీ-ఆర్ఎల్డీ కూటమి ఏర్పాటుతో బీజేపీకి ఎదురుదెబ్బ ఖాయమని అంచనా వేసింది.

ఉత్తరంలో ఎన్డీయేకే జై

ఉత్తర భారతదేశంలో ఎన్డీయే తన పట్టు నిలబెట్టుకోనుందని సర్వే తెలిపింది. ఢిల్లీ, హరియాణా, పంజాబ్, యూపీ, రాజస్థాన్ తదితర ఉత్తరాది రాష్ట్రాల్లో 40% ఓట్లను దక్కించుకోనుంది. ఇక్కడ యూపీఏ ఓట్ల శాతం 23 మాత్రమే. ఉత్తరాదిలో ఎన్డీయే 66 సీట్లను కైవసం చేసుకుంటే, కాంగ్రెస్‌కు కేవలం 20 సీట్లే వస్తాయని అంచనా వేసింది. ఇతరులు 65 స్థానాలు కైవసం చేసుకుంటారని పేర్కొంది. పశ్చిమంలోనూ ఎన్డీయేదే హవా. ఇక్కడ ఆ కూటమి 76 సీట్లను; యూపీఏ 40 సీట్లను సాధిస్తాయని తెలిపింది. యూపీఏకే దక్షిణం కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో కూడిన దక్షిణాదిలో యూపీఏ 78, ఎన్డీయే 26 సీట్లను దక్కించుకోనుంది. అసోం, బిహార్, ఒడిసా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లతో కూడిన తూర్పు భారతంలో ఎన్డీయే 69 సీట్లు సాధిస్తే.. యూపీఏ 28, ఇతరులు 45 స్థానాల్లో విజయం సాధించనున్నారు.

మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే ప్రకారం ఎన్డీయే ఎవరంటే..: బీజేపీ, ఆల్ ఇండియా ఎన్ రంగస్వామి కాంగ్రెస్, అప్నాదళ్, బోడో పీపుల్స్ ఫ్రంట్, డీఎండీకే, జేడీయూ, ఎల్జేపీ, నాగా పీపుల్స్ ఫ్రంట్, పీఎంకే, నేషనల్ పీపుల్స్ పార్టీ, ఆర్పీఐ(ఏ), అకాలీదళ్, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్, శివసేన

యూపీఏ ఎవరంటే: కాంగ్రెస్, డీఎంకే, జేడీఎస్, నేషనల్ కాన్ఫరెన్స్, జేఎంఎం, కేరళ కాంగ్రెస్ (మణి), ఐయూఎంఎల్, ఎన్సీపీ, ఆర్జేడీ, ఆర్ఎల్డీ, టీడీపీ

ఇతరులు ఎవరంటే: ఎస్పీ-బీఎస్పీ-ఆరెల్డీ కూటమి, ఆప్, ఏజీపీ, మజ్లిస్, అన్నాడీఎంకే, ఫార్వర్డ్ బ్లాక్, టీఎంసీ, ఏఐయూడీఎఫ్, బీజేడీ, సీపీఐ, సీపీఎం, ఐఎన్ఎల్డీ, పీడీపీ, కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), ఎంఎన్ఎస్, ఎన్ఎల్పీ, ఆరెస్పీ, టీఆర్ఎస్, వైసీపీ, స్వతంత్రులు.

ఐఆర్‌పై త్వరలో నిర్ణయం

- ఉద్యోగులకు సీఎం హామీ

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మధ్యంతర భృతి(ఐఆర్)పై వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఉద్యోగ సంఘాల నాయకులకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సానుకూలంగా లేకపోవడంతో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని, దీన్ని ఉద్యోగులు అర్థం చేసుకోవాలన్నారు. ఇటీవల ఉద్యోగులకు డీఏ ప్రకటించినందుకు ఏపీఎన్జీవో నేతలు, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు గురువారం ఉండవల్లిలో సీఎంను కలిసి, ధన్యవాదాలు తెలిపారు. 11వ పీఆర్సీ నివేదిక అందనందున ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేలోపు ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని కోరారు. అలాగే సీపీఎస్ రద్దు, ప్రభుత్వ సంస్థలు, గురుకుల పాఠశాలల్లో పనిచేసేవారికి పీఆర్సీ అమ లు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ తదితరాలపై సీఎంకు వారు విజ్ఞప్తులు చేశారు. వాటిపై సీఎం స్పందిస్తూ... కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఆటంకంగా ఉన్నాయని, దానిపై అప్పీలుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. కేంద్రంలో ఏపీకి అనుకూలమైన ప్రభుత్వం ఉంటే ఈ కష్టాలు ఉండేవి కావని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకూ కేంద్రం నుంచి రూ.75వేల కోట్లు రావాల్సి ఉందని చెప్పారు. మోదీ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, పోలవరం ప్రాజెక్టులో ఇంకా రూ.4వేల కోట్లు రాష్ట్రానికి ఇవ్వాలన్నారు. ఉపాధి నిధులు కూడా సక్రమంగా విడుదల చేయడం లేదని ఆరోపించారు. జీతాలు ఇచ్చేందుకూ ఇబ్బందులు పడాల్సి వస్తోందని, రుణాలు తెచ్చుకునేందుకు వీలులేని పరిస్థితి కల్పించారని, అయినా ఉద్యోగులను ఇబ్బంది పెట్టాలని తాను ఎప్పు డూ అనుకోలేదని సీఎం స్పష్టం చేశారు.



చంద్రబాబును కలిసిన ఎన్జీఓ సంఘం నేతలు

ఆంధ్రలో పెట్టుబడులపై త్వరలో నిర్ణయం

- హెచ్‌పీఈ సీఎస్‌వో విశాల్ వెల్లడి
- దావోస్‌లో లోకేశ్‌తో భేటీ
- రాష్ట్రంలో అవకాశాలను వివరించిన మంత్రి
- 3 రోజుల పర్యటనలో పలు సంస్థలతో ఒప్పందాలు
- తిరుగు పయనమైన రాష్ట్ర బృందం

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టే అంశంపై తమ కంపెనీలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని హెవ్లెట్ పకార్డ్ ఎంటర్‌ప్రైజ్ (హెచ్‌పీఈ) చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ (సీఎస్‌వో) విశాల్‌లాల్ పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా అక్కడ ఏర్పాటుచేసిన ఆంధ్ర పెవిలియన్‌లో రాష్ట్ర ఐటీ మంత్రి లోకేశ్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో అద్భుతమైన నైపుణ్యమున్న యువతీ, యువకులున్నారని.. ఐటీ రంగం అభివృద్ధికి ప్రభుత్వపరంగా అనేక చర్యలు తీసుకుంటున్నామని లోకేశ్ తెలిపారు. డీటీపీ పాలసీ, క్లౌడ్ హబ్ పాలసీలను వివరించారు. పాలసీలు, రాయితీల వల్ల అనేక కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. అదానీ రాకతో తమ రాష్ట్రం డేటా సెంటర్ హబ్‌గా ఆవిర్భవిస్తుందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్నామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. విశాల్‌లాల్ స్పందిస్తూ...తమ కంపెనీలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాగా.. దావోస్‌లో పర్యటన ముగించుకుని లోకేశ్ బృందం అమరావతికి బయల్దేరింది. 3రోజుల పర్యటనలో భాగంగా పలు సంస్థల అధినేతలను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరింపజేశారు. మంత్రితోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పెట్టుబడి అనుకూల వాతావరణాన్ని వివరించి కంపెనీలుల సానుకూలంగా స్పందించేందుకు కృషిచేశారని ప్రభుత్వం పేర్కొంది.

పాండ్యా హత్యపై మళ్లీ దర్యాప్తు జరపాలి

సుప్రీంలో ప్రశాంత్ భూషణ్ వ్యాజ్యం

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గుజరాత్ సీఎంగా నరేంద్ర మోదీ ఉన్నప్పుడు జరిగిన మంత్రి హరేన్ పాండ్యా హత్యపై తాజా దర్యాప్తునకు ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలయ్యింది. సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తునకు ఆదేశించాలని ఆయన కోరారు. గ్యాంగ్‌స్టర్ సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్‌లో ప్రత్యక్ష సాక్షి ఆజంఖాన్ ఇటీవల వెల్లడించిన తాజా రహస్యాల ఆధారంగా ఈ హత్యకేసుపై తిరిగి దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. గుజరాత్‌లో 2002 అల్లర్లకు నాటి ముఖ్యమంత్రి నేతృత్వంలోని మోదీ ప్రభుత్వమే కారణమంటూ పాండ్యా ఒక స్వతంత్ర ట్రైబ్యునల్ ముందు సాక్ష్యమిచ్చినందువల్లే ఈ హత్యకు కుట్ర జరిగిందనే అనుమానాలున్నాయి. ఈ కేసులో 12 మందికి జైలు శిక్ష పడగా.. హైకోర్టు 2011లో నిర్దోషులుగా విడుదలయ్యారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.**